# ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్యకలాపాలు

# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

OFFICIAL REPORT

మంగళవారం, డిసెంబరు 23, 2014

**TUESDAY, 23RD DECEMBER, 2014**

14వ శా.స. 3వ సమావేశం, వాల్యూం-5 నంబరు-5

**14TH L.A. III – SESSION, VOL—5 NO-5**

శక సంవత్సరం-1936, పుష్య -2

**2- Paush, 1936 – S.E.**

శాసన సభ సచివాలయం

పబ్లిక్ గార్డెన్స్

హైదరాబాదు- 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS, NAMPALLY**
**HYDERABAD - 500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | డా. కోడెల శివప్రసాదరావు |
| ఉప సభాపతి | : | శ్రీ మండలి బుద్ధప్రసాద్ |
| కార్యదర్శి(ఇంచార్జ్) | : | శ్రీ కె.సత్యనారాయణ రావు |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ పి.బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎం. విజయరాజు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ పి.వి.సుబ్బారెడ్డి<br>శ్రీ కె.రాజకుమార్<br>శ్రీమతి ఆర్.వనితారాణి<br>శ్రీ పి.నరసింహ<br>శ్రీ బి.కమలాకర్<br>డా. వై.కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె.వెంకటేశ్వరరావు<br>శ్రీ డి.జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి.ప్రభాకర్‌రావు |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ శ్రీనివాస్ అల్లాడి |

------

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు

## అధికార నివేదిక

**(14వ శాసన సభ)**
**(మూడవ సమావేశము : ఐదవ రోజు)**

**మంగళవారం, డిసెంబర్ 23, 2014**
**సభ ఉ.గం.09.00.లకు ప్రారంభమైనది**
**(గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)**

--------------

# విషయ సూచిక


| | | | పుట సంఖ్య |
|---|---|---|---|
| 1. | సభ సమావేశం (ఉ.గం.9.00.) | ..... | 5 |
| 2. | వాయిదా తీర్మానం –తిరస్కృతి<br>(కరువు పరిస్థితులు, త్రాగునీటి సమస్యపై) | ..... | 5–6 |
| 3. | నక్షత్రపు గుర్తు గల ప్రశ్నలు – సమాధానాలు | ..... | 7–45 |
| 4. | జీరో అవర్ | ..... | 45–54 |
| 5. | సభా సమక్షంలో ఉంచిన పత్రములు | ..... | 54 |
| 6. | సంతాప తీర్మానం | ..... | 55 |
| 7. | ముఖ్యమంత్రి గారిచే ప్రకటన<br>(నిత్యావసర వస్తువుల సరఫరాపై) | ..... | 55–57 |
| 8. | ప్రభుత్వ తీర్మానం ప్రవేశం, చర్చ, ఆమోదం<br>(కొల్లేరు వన్యప్రాణుల అభయారణ్యా సరిహద్దుపై ) | ..... | 57–75 |
| 9. | రైతుల రుణ మాఫీపై చర్చ కొనసాగింపు | ..... | 75–95 |
| 10. | సభాపతిచే ప్రకటన<br>(సభలో చర్చకు రాని ప్రశ్నలు మరియు ఇతర అంశములపై) | ..... | 95 |
| 11. | సభాపతిచే ప్రకటన (గణాంకాలు) (Statistics)<br>(శా.స.14–3వ సమావేశంనకు సంబంధించిన<br>గణాంకముల వివరములపై) | ..... | 95 & 96 |
| 12. | నిరవధిక వాయిదా (మ. గం.2.07 ని.లకు) | ..... | 96 |

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ
## 14వ శాసనసభ, 3వ సమావేశం
## మంగళవారం, 23వ తేది డిసెంబరు, 2014

(సభ ఉదయం సమయం గం.09.00లకు సమావేశమైనది. గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

* * *

మిస్టర్ స్పీకర్‌:

## వాయిదా తీర్మానం

**రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు మరియు త్రాగునీటి సమస్యపై శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి మరియు ఇతరులు ఇచ్చిన వాయిదా తీర్మానం తిరస్కరించడమైనది.**

(INTERRUPTIONS FROM SRI G.SRIKANT REDDY, MEMBER, YSRCP)

MR.SPEAKER: Yes, Srikanth Reddy garu.

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి(రాయచోటి): స్పీకర్ గారు, ఈ డిసెంబరు మాసములోనే త్రాగునీటి కొరకు తీవ్ర ఎద్దడి నెలకొని ఉంది. గతంలో ఎన్నడూ లేనటువంటి పరిస్థితులు ఉన్నాయి. త్రాగు నీటికి ఇంతవరకు ఎటువంటి కేటాయింపులు లేవు. వెయ్యి అడుగులకు బోర్లు వేసినప్పటికీ నీరు అందని పరిస్థితులు ఉన్నాయి. కనీసం పంట కూడా వేయలేనటువంటి పరిస్థితులు న్నాయి. రాజధానికి భూములు ఇచ్చిన వారికి పూర్తిగా రుణమాఫీ చేశారు. కరువు రైతుల గురించి కూడా ఆలోచించాలి. దానిపైన చర్చ జరగాలి. బి.ఏ.సి. సమావేశంలో అన్ని అంశాలపై చర్చిద్దామని అనుకున్నాము. ఈరోజు చివరి రోజు. మరలా ఫిబ్రవరి మాసము వరకూ ఈ సభ సమావేశం కాదు కాబట్టి, దయ ఉంచి తమరు ఈ అంశంపై చర్చించడానికి సమయం కేటాయించాలని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్: శ్రీకాంత్ రెడ్డిగారూ, కరువు, త్రాగునీటి గురించి ప్రస్తావించారు. రెండూ కూడా ముఖ్యమైన అంశాలే. నిన్న చర్చలో కరువు మీద కొంత మాట్లాడారు. ఆ అంశంపై మంత్రిగారు సమాధానం ఇవ్వబోతున్నారు. వారు సమాధానం ఇచ్చిన తరువాత మీరు క్లారిఫికేషన్ అడగండి.

Let us now take up the Question Hour.

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డిః (మైకు లేకుండా) సర్, ముఖ్యమైన సమస్య సార్.

మిస్టర్ స్పీకర్ః మంత్రిగారు స్టేట్‌మెంట్ ఇచ్చిన తరువాత దాని మీద క్లారిఫికేషన్ అడగండి.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు శ్రీ శ్రీకాంత్‌రెడ్డి మరికొందరు ఇతర ప్రతిపక్ష సభ్యులు వెల్‌లో నికి వచ్చారు)

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డిః (మైకు లేకుండా) (వెల్‌లోనికి వస్తూ) సర్, రైతులకు నారు పోసుకునే పరిస్థితులు కూడా లేవు. రాయలసీమ ప్రాంతంలో త్రాగడానికి కూడా నీళ్ళు లేవు.

**(వెల్‌లోనున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు సభను అర్థాంతరంగా ముగించారంటూ గౌరవ సభాపతికి తెలియజేయసాగారు)**

MR.SPEAKER: Who are responsible for that? You are responsible. We are not responsible. Do not waste your time please. If you think discussion on drinking water is so important, you should have given notice under Rule-344. అటువంటప్పుడు వాయిదా తీర్మానం ఎందుకు ఇచ్చారు. నిబంధన 344 ప్రకారం అడిగి ఉండవచ్చు కదా.

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డిః (మైకు లేకుండా) సర్, మేము 344 ప్రకారం అడిగాం, ప్రాపర్ ఫార్మ్‌లోనే అడిగాం.

MR.SPEAKER: I have not received it yet. నిబంధన 344లోని అంశంపైన మంత్రిగారు సమాధానమిస్తారు. దానిపైన మీరు క్లారిఫికేషన్ అడగండి. దయచేసి కూర్చోండి. Please do not waste the time of the House.

(INTERRUPTIONS FROM YSRCP MEMBERS)

(వెల్‌లోనున్న వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సభ్యులు కొందరు, తమ పార్టీలో ఒక్కరికి మాట్లాడే అవకాశం ఇవ్వవలసిందిగా గౌరవ సభాపతిని కోరారు)

MR.SPEAKER: You take five minutes. Now, please go back to your seats.

(YSRCP Members resumed their seats)

Let us take up the Question Hour.

## నక్షత్ర గుర్తు గల ప్రశ్నలు – సమాధానాలు

**Question No.456 (31) is postponed at the request of the Member.**

**Now, Question No.621 (32), Minister for Irrigation.**

**ప్రశ్న నెం.32/621**
**సర్వశ్రీ గొట్టిపాటి రవికుమార్, ఆదిమూలపు సురేష్, పోతుల రామారావు.**

**– ఎం.ఎల్.ఏలు.,**

నీటిపారుదల శాఖమంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా?

అ) ఎన్.ఎస్.పి (నాగార్జునా సాగర్ ప్రాజెక్టు) కాలువల ఆధునీకరణకు సంబంధించి భౌతిక, ఆర్థిక ప్రగతి ప్యాకేజీ వారి వివరాలేమిటి?

ఆ) సకాలంలో పనులు పూర్తి చేయకుండా అశ్రద్ధ వహించిన కాంట్రాక్టర్లపై ప్రభుత్వం ఎటువంటి చర్య తీసుకోలేదన్న విషయం వాస్తవమేనా?

ఇ) అన్ని విధాలుగా ఈ ప్రాజెక్టును ఎప్పటిలోగా పూర్తి చేయడమవుతుంది?

ఈ) ఇప్పటివరకు ప్రాజెక్టుకు అంతర్జాతీయ ఏజెన్సీల ద్వారా సమకూర్చిన ఆర్థిక సహాయం, ఖర్చు చేసిన మొత్తమెంత?

**సాగునీటిపారుదల, పరీవాహక ప్రాంత అభివృద్ధి మరియు జల వనరుల నిర్వహణ శాఖ మంత్రి శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు:**

అ) నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఆధునీకరణ భౌతిక ప్రగతి (అనుబంధం–ఎలో), ఆర్థిక ప్రగతి(అనుబంధం–బిలో)కి సంబంధించిన ప్యాకేజి వారీ వివరాలను సభా సమక్షంలో ఉంచడమయింది.

ఆ) లేదండీ, పురోగతి తక్కువగా ఉన్నందున నోటీసులు జారీ చేస్తూ అశ్రద్ధ వహించిన కాంట్రాక్టర్లపై చర్య తీసుకోవడమవుతున్నది.

ఇ) ప్రాజెక్టును 2016, జూలై నాటికి పూర్తి చేయడమవుతుంది.

ఈ) రూ.4444.41 కోట్ల అంచనా వ్యయంతో నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఆధునీకరణ పనిని చేపట్టడమయింది. ప్రాజెక్టు ఆధునీకరణకు ప్రపంచ బ్యాంకు 48 శాతం మేరకు ఆర్థిక సహాయాన్ని అందించడానికి అంగీకరించింది. మిగిలిన 52 శాతం వాటాను రాష్ట్ర ప్రభుత్వం భరించవలసి ఉంటుంది. ఎ.పి.డబ్ల్యు.ఎస్.ఐ.పి. మొత్తం వ్యయం రూ.4444.41 కోట్లకు గాను, ఉమ్మడి రాష్ట్రం విడిపోయిన తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వాటా రూ.2,832.691 కోట్లుగా ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాటా అయిన రూ.2,832.691 కోట్లలో ప్రపంచ బ్యాంకు సహాయం 48 శాతం (అంటే రూ.1359.69 కోట్లు), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వాటా 52 శాతం (అంటే రూ.1473.00 కోట్లు). సదరు పనులపై ఇప్పటివరకు రూ.810.94 కోట్లను ఖర్చు చేయడమయింది.

మిస్టర్ స్పీకర్: రవికుమార్ గారు.

శ్రీ గొట్టిపాటి రవికుమార్ (అద్దంకి): స్పీకర్ సర్, గౌరవ మంత్రి గారు చెప్పినట్లు, మొదటి ప్రశ్న అనుబంధం 'ఏ'లో గానీ, 'బి'లో గానీ పరిశీలిస్తే, దాదాపు అన్ని ప్రాజెక్టుల్లో కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు సంబంధించి 87 శాతం మెయిన్ గ్రాంట్ పనులు అయిపోయాయని ఉంది. మిగతావన్నీ కూడా 50 శాతం పైన పనులు పూర్తయ్యినట్లుగా అర్థమవుతోంది. ఈ సంఖ్యలు చాలా వరకు వాస్తవ విరుద్ధంగా ఉన్నాయి. అధ్యక్షా, మంత్రిగారిని మీద్వారా అడుగుతున్నాను.

...

పేజి నెం.3 పేరా 7లో ప్రకాశం జిల్లా, అద్దంకి బ్యాంక్ కెనాల్‌కు సంబంధించింది. 18వ మైలు రాయి నుంచి 35వ మైలు రాయి వరకు ఈ కాలువ ఉంటుంది. 59.36 శాతం పని పూర్తి అయ్యిందని రిపోర్టులో ఇవ్వడం జరిగింది. 20 నుంచి 30 శాతానికి మించి పనులు జరగలేదన్న వాస్తవాన్ని మంత్రి గారిని తెలియజేస్తున్నాను. కేవలం శాసనసభలో ప్రశ్న ఉంది కనుక దానికి సంబంధించి అనుబంధం 'ఏ'లో గాని, 'బీ'లో అంకెలు పెంచి పని శాతం పెరిగినట్లు, దాదాపు 50, 60 శాతం పని జరిగిందని వాస్తవానికి విరుద్ధంగా ఉంది. మా జిల్లాకు పైన గుంటూరు జిల్లా ఉంది. అద్దంకి బ్యాంక్ కెనాల్‌కు 30 కిలోమీటర్ల లైనింగ్ పనులు పూర్తి అయితే గాని క్రింద ఉన్న 30 కిలోమీటర్లు మాకు నీరు రాదు అధ్యక్షా. అక్కడ జీరో కి.మీ. నుంచి 29 కి.మీ. వరకు జీరో శాతం పని జరిగింది. ఒక్క రూపాయి పని కూడా జరగలేదు.

11వ పేజీలో మా జిల్లాకు అద్దంకి బ్యాంక్ కెనాల్ క్రింద 18 డీసీ ప్యాకేజీలు ఉన్నాయి. అందులో ఏడు సంవత్సరాలలో 15 శాతం పని మాత్రమే జరిగింది. అద్దంకి, పర్చూరుకు 30 కిలోమీటర్ల పరిధిలో ఇప్పటి వరకు 15 శాతానికి మించి పనులు జరగలేదన్న విషయాన్ని మంత్రి గారికి తెలియజేస్తున్నాను.

(ఈ సందర్భంగా సభ్యులు శ్రీ రవికుమార్ కొన్ని దినపత్రికల ప్రతీలను సభలో చూపిస్తూ చదవసాగారు)

ప్రముఖ దినపత్రికలలో కూడా ఈ విషయాలను రాశారు. 'సాగర్ కుడి కాలువలో పనులు కాలయాపన', గత ఏడు సంవత్సరాలుగా పనులు కాలయాపన జరుగుతున్నాయి. ఇప్పటి వరకు దాదాపు 32 ప్యాకేజీలలో పనులు ప్రారంభం కాని మాట వాస్తవమా కాదా అని ఈ సభ ద్వారా మంత్రి గారిని అడుగుతున్నాను.

అలాగే రెండవ ప్రశ్నకు సంబంధించి మంత్రి గారు సమాధానమిస్తూ, పనులలో పురోగతి లేని కాంట్రాక్టులపై చర్యలు తీసుకున్నామని చెప్పారు. కేవలం ఏడు సంవత్సరాల నుంచి నోటీసులు జారీ చేస్తూ ఉన్నారు. ఇంతవరకు ఏ కాంట్రాక్టర్‌పైన ఏ విధమైన చర్యలు తీసుకోలేదు. ఆ పనులు ఎప్పటిలోపు పూర్తి చేస్తారో తెలుపవలసిందిగా కోరుతున్నాను. ప్రకాశం జిల్లాలో 4.24 ఎకరాలలో సాగర్ క్రింద భూములను సాగు చేస్తున్నాం. ఉన్న కాంట్రాక్టర్లను తొలగించి, కొత్త కాంట్రాక్టర్లను నియమించి పనులు చేయిస్తారో లేదో తెలియజేయవలసిందిగా కోరుతున్నారు.

ముఖ్యమైన కాంట్రాక్టర్లు ఎవరూ పనిచేయడం లేదు. అనుభవం లేని సబ్-కాంట్రాక్టర్లతో పనులు చేయించడం, అరకొర మిషనరీలతో సాగర్ కాలువలపై పనిచేయడం జరుగుతున్నది. నాసిరకం పనులు జరుగుతున్నాయి. సాగర్ కాలువలకు లైనింగ్ అయిన తరువాత చివరి భూములకు నీరు వస్తాయని రైతులు ఆశించారు. నాసిరకం పనుల వల్ల ఉన్న నీరు పోయాయి. రావలసిన నీరు కూడా రైతులకు అందడం లేదు. ఈ సంవత్సరం రైతులు నాలుగు, ఐదు సార్లు రోడ్లపై వచ్చి ధర్నాలు చేసిన మాట వాస్తవము కాదా?

MR.SPEAKER: Yes, come to the point.

శ్రీ గొట్టిపాటి రవికుమార్: ఈ సమస్య చాల ముఖ్యమైనది, నాలుగైదు లక్షల మంది రైతులకు సంబంధించిన సమస్య అధ్యక్షా. మా జిల్లాకు వచ్చే నీటి వాటా రీడింగ్ మీటర్లు పెట్టలేదు. పవర్ ప్రాజెక్టు వారి దగ్గరకు వెళ్ళి వారి మీటర్లలో రీడింగ్‌లు చూసుకొని మాకు చెప్పే

పరిస్థితిలో ఎన్ఎస్పీ శాఖ వారికి వచ్చింది. అలాగే సాగర్ కెనాల్ క్రింద 30 సంవత్సరాల క్రితం నిర్మించిన బ్రిడ్జిలన్నీ పడిపోతున్నాయి. ఇటీవల మామిళ్లపల్లి గ్రామంలో సాగర్ కాలువలో పడి దాదాపు 10 మంది పిల్లలు చనిపోయారు. ఆ బ్రిడ్జీలన్నీ పునఃనిర్మాణం జరగాలి. ప్రతి నాలుగు కిలోమీటర్లకు ఒకచోట వ్యవసాయ భూములకు వెళ్లడానికి ఫుట్బ్రిడ్జీలు నిర్మించాలని రైతులు అడుగుతున్నారు.

MR.SPEAKER: Please conclude.

శ్రీ గొట్టిపాటి రవికుమార్ః మేజర్ కెనాల్స్పై షట్టర్స్ లేవు. షట్టర్స్ ఉన్న పై ప్రాంతంలోనున్న రైతులకు నీరు అందలేనపుడు షట్టర్స్ పగలగొట్టే సంస్కృతి బాగా పెరిగిపోయింది. పైన ఉన్న ప్రాంత రైతులు షట్టర్స్ పగలగొట్టి నీరు తీసుకోవెళుతుంటే క్రింద ప్రాంతంలోనున్న రైతులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఒక్క కాలువపైన కూడా ఒక్క షట్టర్ కూడా లేదు. షట్టర్స్ను వెంటనే బిగించాల్సిన అవసరం ఉంది. షట్టర్స్ పగలగొట్టకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.

MR.SPEAKER: Suresh garu.

శ్రీ ఆదిమూలపు సురేష్ (సంతనూతలపాడు)ః అధ్యక్షా, ఎన్ఎస్పి ప్రాజెక్టుపై ఆధునీకరణ పనులు it is not possible to compare with ordinary works. ఎందుకంటే సంవత్సర కాలం పాటు పనుల చేయాల్సిన అవసరం లేదు. సంవత్సరంలో కేవలం 70 నుంచి 76 రోజులు మాత్రమే పనులు జరుగుతాయి. ఆ రోజులలోనే పనులు చేయాల్సిన అవసరం ఉంటుంది. Otherwise, we need to give drinking water and irrigation water to both farmers and other people. జరిమానాల విధింపులో నీటిపారుదల శాఖ మీనమేషాలు లెక్కపెడుతుందని దినపత్రికలలో వార్తలు వస్తున్నాయి. సాధారణ నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటే కుదరదు. 2016 జూలైలోపుల ప్రాజెక్టు పూర్తి చేస్తామంటున్నారు. By doing this, they are not going to achieve any big thing. The dead line for this project as envisaged by the World Bank comes to an end by October, 2016. అక్టోబర్ 2016లోపుల ప్రాజెక్టు పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. కాని జూలై 2016కు పూర్తి చేస్తామంటున్నారు. దీనిపై స్పష్టమైన హామి మంత్రి గారి నుంచి అడుగుతున్నాను. వారిపై ఫైనాన్స్ పనిష్మెంట్ ఇవ్వకుండా, పనులు పూర్తి చేస్తామంటే ఎలా అవుతుంది. ఏడు సంవత్సరాల కాలంలో అరవై శాతం పనులు పూర్తి చేశారు. ఇప్పుడు కేవలం రెండు కాలాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ రెండు సీజన్లలో నలభై శాతం పనులు ఎలా పూర్తి చేస్తారని అడుగుతున్నాను.

రెండవది కృష్ణా డెల్టా నీరుకు సంబంధించి మంత్రి గారు సమావేశాలు ఏర్పాటుచేసి జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ ఎన్ఎస్పి ప్రాజెక్టుపై ఇప్పుడు రెండు సీజన్లు మాత్రమే మిగిలి ఉన్నాయి కనుక ఈ విషయాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉంది. Periodical review is very much required. ప్రపంచ బ్యాంకు నుంచి 58 శాతం నిధులు మనకు వచ్చాయి. వీటిని పూర్తిగావినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నిధులను ఉపయోగించుకోలేకపోతున్నామన్న దాఖలాలు మనం చూస్తున్నాం.

(బెల్)

What I would like to know from the Hon'ble Minister is that he has given an elaborate reply consisting of 21 pages. He has also mentioned about both financial progress as well as physical progress. Details pertaining to main canal, branch canal and distributory canals are also given. I would like to submit that let the concerned MLAs. take care of the branch canals and distributory canals. We are worried about the main canal. మేము దిగువ కెనాల్ ప్రాంతానికి చెందిన వారం. మెయిన్ కెనాల్ పూర్తి చేస్తే గాని మాకు నీరు రాదు. గుంటూరు, ప్రకాశం జిల్లాలు గత ఐదు సంవత్సరాలుగా. Many number of discussions must have taken place between the two District Collectors. సమన్వయ కమిటీ ఎన్ఎస్పి కెనాల్పై ఏదైనా సమాచారం కావాలంటే.. Whatever the Hon'ble Minister is showing as physical progress, they are absolutely inflated figures. It is only to safeguard the interests of the contractor and to keep the contract alive, the figures are inflated. This is not correct. For seven years, we could do only complete 40-50%: then how can we expect Sir?

Let the Minister give an assurance to the House.

MR.SPEAKER: Narendra garu.

శ్రీ ధూళిపాళ నరేంద్రకుమార్ (పొన్నూరు)ః అధ్యక్షా, గౌరవసభ్యులు అడిగిన ప్రశ్నకు గౌరవమంత్రి గారు సంపూర్ణమైన సమాచారాన్ని సభ ముందు ఉంచారు. ఆధునీకరణ చేయడం వల్ల రైతుకు టెయిల్ఎండ్ ప్రాంతాలలోనున్న రైతులకు నీరు వెళుతాయి అన్న సంకల్పంతో ఆధునీకరణ చేయడం జరుగుతుంది. గత ప్రభుత్వం తీసుకున్న ఈ ఆధునీకరణ కార్యక్రమంలో కొంత మంది కాంట్రాక్టర్లకు వరంగా మారింది. నకెరెకల్లు నుంచి వినుకొండ ప్రాంతం సాగర్ ప్రాజెక్టు వరకు మా జిల్లా గౌరవ శాసనసభ్యులు కాలువల గుండా వెళితే, కొంతమంది వినుకొండ ప్రాంతంలోనున్న కాంట్రాక్టర్ల పనులు చూస్తే, ఏదైతే లైనింగ్ వేశారో దానిని ఒక కర్రతో కొడితే పగిలిపోతుంది. కాంట్రాక్టర్లు అంత నాసిరకం పనులు చేశారు. మేము అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా, క్వాలిటీపరమైన పనులు జరగనందున అలా జరిగిందన్నారు. కొంతమంది వంద శాతానికి మించి పనులు జరిగినట్లు రిపోర్ట్లలో చూపించారు. ఆ విషయం

నాకు అర్థం కాలేదు, 102 శాతం, 109 శాతం పనులు జరిగాయని చూపించారు. అంచనా విలువ కన్నా ఎక్కువ పనులు జరిగినట్లు మంత్రి గారి సమాధానంలో ఉంది.

...

ఇవి శాశ్వతమైన నిర్మాణాలు కాబట్టి నాణ్యతలో రాజీ లేకుండా పనులు జరిగే విధంగా చూడాలని, ఎవరైతే కాంట్రాక్టర్లు  నాణ్యత లేకుండా పనులు చేస్తారో వాళ్ల మీద కూడా తక్షణ చర్యలు తీసుకోవలసిందిగా మంత్రిగారిని కోరుతున్నాను. రెండోది 2016 నాటికి ప్రాజెక్టు పూర్తి చేస్తామని మంత్రిగారు చెబుతున్నారు.  కాని చాలా మంది కాంట్రాక్టర్లు పనులు మొదలుపెట్టని వారు, ఆరు, ఏడు సంవత్సరాలు గడిచిన  కొంతమంది కాంట్రాక్టర్లు  5శాతం, 6శాతం, 7 శాతం, 8శాతం చేసిన వాళ్లు ఉన్నారు. దీనిని బట్టి  2016 నాటికి ప్రాజెక్టు పూర్తవుతుందని నేను అనుకోవడం లేదు. కాబట్టి నేను మంత్రిగారిని కోరేది గతంలో ఇ.పి.జి. అంటే కొంతమందికి పండగ. కాబట్టి ప్రభుత్వం మారింది, పాలకులుగా మనం మారాము కాబట్టి ఎవరైతే కాంట్రాక్టర్లు పనులు చేయని వారున్నారో, వారి మీద తక్షణమే చర్యలు తీసుకుని, వాటిని తిరిగి పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటారా? ఎప్పుడులోపు ఇవన్నీ పూర్తి చేస్తారో చెప్పవలసిందిగా నేను మంత్రి గారిని కోరుతున్నాను.

(బెల్)

శ్రీ పోతుల రామారావు(కందుకూరు): అధ్యక్షా, ప్రకాశం జిల్లాలో ఆరు డిస్ట్రిబ్యూషన్ కెనాల్‌లు ఉన్నాయి.  దీంట్లో ఇప్పుడు సగానికి లోపే పనులు జరిగాయి.  మన సోదర శాసనసభ్యులు చెప్పినట్లుగా  అది ముందుకు జరగాలంటే ప్రాజెక్టులకు సంబంధించి రివ్యూ కమిటీలు వెయ్యవలసిన అవసరం ఉంది. ఈ రివ్యూ కమిటీలో అక్కడ ఉన్న అధికారులతోబాటు, అక్కడ ఉన్న స్థానిక శాసనసభ్యులను కూడా వేసి ఒకటిన్నర సంవత్సరంలోపే పనులు పూర్తి చేయాలి.  తరువాత ప్రపంచ బ్యాంకు నిధులు కూడా మురిగి పోయే ప్రమాదముంది. అందువల్ల రివ్యూ కమిటీస్ వేస్తారా అని మంత్రి గారిని అడుగుతున్నాను?  ఇంకొక విషయం ఏమంటే ఈ ప్రాజెక్టులో సాంకేతిక సిబ్బంది కూడా చాలా తక్కువగా ఉన్నారు. అందువల్ల పనులు చాలా నిదానంగా జరుగుతున్నాయి; దానిని గమనించి మంత్రిగారు తగు చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నాను.  (బెల్)  ఈ రైట్ కెనాల్ ఒరిజినల్‌గా మన మూసీ దగ్గర ఆగిపోయింది.  ప్రకాశం జిల్లాలో కందుకూరు, కొండపి అలాగే నెల్లూరు జిల్లాలో ఆత్మకూరు,కావలి, ఉదయగిరి అంటే పెన్నా దాకా రావాల్సిన 2వ ఫేజ్ ఆగిపోయింది. భవిష్యత్తులో ఈ పోలవరం ప్రాజెక్టు వస్తుంది కాబట్టి ఈ రైట్ కెనాల్‌ను మూసీ నుంచి మల్లేరు వరకు, మల్లేరు నుంచి పెన్నా వరకు పొడిగించే ఆలోచన మంత్రిగారి దగ్గర ఏమైనా ఉందా అని అడుగుతున్నాను?  ప్రభుత్వం నాగార్జున సాగర్ 2వ ఫేజ్ మీద సమాధానం ఇవ్వవలసిందిగా కోరుతున్నాము.

మిస్టర్ స్పీకర్: ప్రసాద్‌గారు మాట్లాడండి.

శ్రీ రాజేంద్ర ప్రసాద్(తెనాలి): అధ్యక్షా, ఇది ప్రశ్నకు సంబంధించిన అంశం కాదు, కానీ మంత్రిగారు పరిశీలించవలసిన అవసరం ఉంది. ఎందుకంటే ఈ కాంట్రాక్టర్లు ప్రాజెక్టు చేపట్టిన తరువాత ఏం జరుగుతోందంటే నిర్వహణకు వచ్చేటప్పటికి చిన్న చిన్న పనులు కూడా ప్రాజెక్టు క్రిందకి వస్తున్నాయి. కాబట్టి ఎన్ఎస్‌పి వారు పనులు చేయట్లేదు. అందుకనే ఈ నిర్వహణలో ఏ చిన్న చిన్న పనులు జరగాలన్న కూడా ప్రాజెక్టు క్రిందకే వస్తుంది కాబట్టి కొంతమంది కాంట్రాక్టర్లు కనీసం 5శాతం కూడా చేయని ప్రాజెక్టులు ఉన్నాయి. ఆ ప్రాజెక్టులో ఏది అవసరమైనా కూడా అంటే రైతుకి సంబంధించిన అంశాలు అంటే రైతుకి ఏ కష్టం వచ్చినా ఎవరు దానిని తీర్చే విధంగా లేరు. అందుకనే ఆ ప్రాజెక్టు క్రింద నిర్వహణకు వచ్చే పనులకు విడిగా నిధులు విడుదల చెయ్యాల్సిందిగా మంత్రిగారిని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్: మంత్రిగారు మాట్లాడండి

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు (మైలవరం):అధ్యక్షా, గౌరవ శాసనసభ్యులు తెలియచేసిన ఆవేదన కానీ, వాస్తవాలు అన్నీ కూడా పరిశీలనలోకి తీసుకుంటాము. ఈ రోజు శాసనసభ్యులు కానివ్వండి, పార్లమెంటు సభ్యులు కానివ్వండి, శాసనమండలి సభ్యులు కానివ్వండి, గ్రామ స్థాయి, మండల స్థాయి ప్రజాప్రతినిధులు అందరూ కూడా వచ్చారు. ఇన్ని వేల కోట్ల ప్రాజెక్టు, ఇంతమంచి కార్యక్రమం తీసుకునేప్పుడు గతంలో వీరందరిని కూడా కూర్చోబెట్టి వీళ్ల సలహాలు, సూచనలు తీసుకున్నట్లైతే ఇవాళ ఈ పరిస్థితి వచ్చేది కాదు. అందుకనే ఈ నెలలోనే గుంటూరు, ప్రకాశం జిల్లాలకు సంబంధించిన ప్రజాప్రతినిధులందరికి కూడా ఈ నెల 4వ వారంలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి జరిగిన అవకతవకలు – అంటే నిర్లక్ష్యంగా తప్పు చేసిన వారి మీద చర్యలు తీసుకునే ఇ.పి.సి వ్యవస్థను ఒకటి ఏర్పాటు చేస్తాం. గత ప్రభుత్వం ఇష్టారాజ్యంగా కాంట్రాక్టులు కట్టబెట్టి, ఇవాళ రైతాంగానికి నీళ్లు రాక రోడ్డు ఎక్కే పరిస్థితిని తీసుకురావడం జరిగింది. ఇవాళ నాగార్జునసాగర్ కాలవ చివరి భూముల రైతులందరికి, అంటే నందిగాం ప్రాంతం గాని, మైలవరం ప్రాంతం గాని, అట్లాగే అద్దంకి గాని, ప్రకాశం జిల్లా గాని రామారావు గారు చెప్పిన, సురేష్ గారు చెప్పిన, రవికుమార్ గారు చెప్పిన, నరేంద్ర గారు, రాజేంద్రప్రసాద్ గారు గౌరవసభ్యులు చెప్పినవన్నీ కూడా ఇవాళ జరిగిన లోపాలు గాని, పాపాలు గాని గమనించి గట్టి చర్యలు తీసుకోవాలి. ఇవాళ 2,832కోట్లలో 810కోట్ల పనులు జరిగాయి. దాని మీద పూర్తి స్థాయిలో ఏవైతే ఆరోపణలు వచ్చాయో అటు పత్రికల్లో వాటి మీద, ప్రజాప్రతినిధులు తెలియచెప్పిన వాటి మీద కూడా విచారణ జరిపిస్తున్నాం. సమయం తక్కువగా ఉంది కాబట్టి రేపు సమావేశంలో కూడా వీళ్లందరి సలహాలు, శాసనసభ్యుల బాధని, రైతాంగం కష్టాలని చెప్పాలని వీళ్లందరిని కూడా కోరుతున్నాను. నేను స్వయంగా ఈ విషయాలపై గుంటూరు, ప్రకాశం జిల్లాలో పర్యటించాను. అధ్యక్షా, నీటి

పారుదల శాఖమంత్రిగా గతంలో పని చేసిన మీకు మరియు నాగార్జునసాగర్ కాలవ రైతుగా అనుభవం ఉన్న మీకు ఈ విషయాలన్నీ తెలుసు. అధ్యక్షా , అందుకని ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ ఖర్చు పెట్టిన డబ్బు రూ.810కోట్లలో జరిగిన తప్పులు, లోపాలు, సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తీసుకోవడం ఒక భాగమని మీ ద్వారా ఈ సభకు తెలియజేస్తున్నాను.

రెండవ భాగం 2,021కోట్ల పనులకు సంబంధించినది, మనం వీటిని జాగ్రత్తగా ఖర్చు పెట్టుకోవలసిన అవసరం ఉంది. సుమారు 692కోట్లు డబ్ల్యూ.ఎస్ క్రింద అందుకు దగ్గర దగ్గర రైట్ కెనాల్ క్రింద 203 కి.మీలు మెయిన్ కాలవ వెడుతోంది. బ్రాంచ్ మరియు డిస్ట్రిబ్యూటర్‌లు 5,312కి.మీలు వెడుతున్నాయి, ఫీల్డ్ చానల్స్14,400 కి.మీలు వెడుతున్నాయి. ఈ రూ.2,000కోట్లను చాలా జాగ్రత్తగా ఖర్చుపెట్టాలి. ఇవి కాకుండా డాలర్ రేట్లో వచ్చిన (ఎక్స్‌గ్రేషియా) హెచ్చు సుమారు 500కోట్లు. ఎందుకంటే ఒప్పందం చేసుకున్నప్పుడు డాలర్ రేటు రూ.45 ఇవాళ డాలర్ రేటు రూ.60 కాబట్టి ఈ తేడా సుమారు 500కోట్లు మనకు కలిసి వచ్చే అవకాశం ఉంది. ఈ డబ్బు సద్వినియోగం కావాలంటే క్రింది స్థాయిలో రైతు సంఘాలు కాని, ఓటర్ల విజన్ అసోసియేషన్ కాని, ప్రజా ప్రతినిధులు అందరూ పాల్గొనాలి. ఏ రైతు కూడా కాలవ మీదికి వెళ్లకుండా నాగార్జునసాగర్ డామ్ క్రింద చిట్ట చివరి భూములకు కూడా నీరు అందించాలని ఈ ప్రభుత్వ లక్ష్యం. ఏవైతే గతంలో జరిగిన లోపాలు, పాపాలన్ని సరిదిద్ది, జరగబోయే పనులలో ప్రజాప్రతినిధుల సలహాలను అనుసరించి అన్ని జాగ్రత్తలు తీసుకుని, భవిష్యత్తులో ఏ ఏజెన్సీ కూడా ఈ కాంట్రాక్టు వ్యవస్థ, ఈ ఇ.పి.జి వ్యవస్థ, ఒక కాంట్రాక్టరు తీసుకుని, వేరొక కాంట్రాక్టరుకిచ్చి, వారు మరియొక కాంట్రాక్టర్లలకు ఇచ్చి – ఈ పాపాలన్నీ కూడా తొలగించి మీ అందరి సలహాలతో తప్పకుండా క్రింది రైతుల చిట్ట చివరి భూములకు నీళ్లు అందేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటాం. సుమారు 100టి.ఎమ్.సిలలో ఒక 60టి.ఎమ్.సిలు గుంటూరు జిల్లాలో, ఒక 35-40, టి.ఎమ్.సిలు ప్రకాశం జిల్లాలో తీసుకువచ్చినప్పటికీ కూడా క్రింద చివరి భూముల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అవన్నీ సరిదిద్దవలసిన బాధ్యత ప్రభుత్వం యంత్రాంగం మీద, ఎన్.ఎస్.పి. అధికారుల మీద ఉంది. ఖచ్చితంగా ఆ బాధ్యతను మా ప్రభుత్వం తీసుకుంటుంది. వెంటనే ఈ నెల చివరి వారంలోనే ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి అందరి సలహాలు తీసుకుని క్రింది స్థాయిలో తప్పులను సరిదిద్ది జరగబోయే పనులలో కూడా ఇటువంటి తప్పులు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకుంటాము. అట్లాగే మార్చి 31 వరకు పంటలను కాపాడేందుకు నీళ్లు కూడా చిట్ట చివరి భూములకు అందించే వరకు నేనే స్వయంగా రెండు రోజులు కాలవల మీద తిరుగుతాను. కాబట్టి గుంటూరు, ప్రకాశం జిల్లాలలోని ప్రజాప్రతినిధులందరిని ఆహ్వానిస్తున్నాను. మనం రెండు రోజులు టైలెండ్ చివరి భూములలో తిరుగుదాం, ఆ రెండు రోజులు తిరిగిన తరువాత సమావేశాన్ని ఏర్పాటు చేస్తాను. అప్పుడు వాస్తవాలన్నీ బయటికి వస్తాయి. తప్పు జరిగిన ఏజెన్సీలన్నీ కూడా బట్టబయలవుతాయి. కాగితాలను బట్టి, ఫీల్డ్‌లో చూసిన దానిని బట్టి జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంది. కాబట్టి ప్రజాప్రతినిధులందరూ

కూడా ఈ నెల 27,28 తేదీలలో గుంటూరు, ప్రకాశం జిల్లాల కాలవల మీదకి రండి, మనమందరం కలిసి తిరుగుదాము. తప్పకుండా గత 6,7 సంవత్సరాలలో ఎవరైతే కాంట్రాక్టులు, టెండర్లు చేజిక్కించుకుని, పనులు అలసత్వం చేస్తూ ఈ రైతులను ఇబ్బంది పాలు చేస్తున్నారో వాళ్ల మీద గట్టి చర్యలు తీసుకుందాం. టైలెండ్ భూములకు నీళ్లు పంపిద్దాం. ఖర్చు పెట్టే ఈ వేల కోట్ల రూపాయలను సద్వినియోగం చేసుకుందాం. చివరి ఆయకట్టు, చివరి టైలెండ్ భూములకు నీళ్లు ఇవ్వాలి. అదేవిధంగా మరి రామారావు గారు కూడా చివరి భూములకి నాగార్జునసాగర్ రెండవ ఫేజ్ గురించి కూడా మాట్లాడారు. వీటన్నిటి మీద కూడా ముఖ్యమంత్రిగారు ఆలోచన చేస్తున్నారు. ఏ విధంగా ఎట్లా ఈ టైలెండ్ భూములకి, ఇటు రాయలసీమ కరవు పీడిత ప్రాంతంలో తాగునీటి కోసం వాళ్లు ఏ విధంగా ఎదురుచూస్తున్నారో, అట్లాగే ప్రకాశం జిల్లాలో వెలుగొండ క్రింద గాని, నాగార్జునసాగార్ ఆయకట్టు క్రిందగాని వాళ్లు పడుతూన్న ఇబ్బందులు అన్నీ దృష్టిలో పెట్టుకుని సముద్రంలోకి పోతున్న నీరుని ఎట్లా సద్వినియెగం చేసుకోవాలి, ఆ నీళ్లని ఏ విధంగా అంటే వర్షపాతం తక్కువగా ఉన్న జిల్లాలు గాని, లేకపోతే రాయలసీమలో చిత్తూరు, కడప, నెల్లూరు, కర్నూలు జిల్లాలు, ఇటు ప్రకాశం జిల్లాలు అట్లాగే ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం గాని, విజయనగరం గాని ఈ ఏడు జిల్లాలు కూడా వర్షపాతం ఇబ్బందులు కాని, చివరి భూముల టైలెండ్ ఇబ్బందులు ఉన్నాయి. తప్పకుండా వాటన్నింటిమీద ప్రభుత్వం సమగ్ర ఆలోచన చేస్తూ ఉంది. వేరే ఫోరమ్‌లో కూడా వాటన్నింటికి సమాధానం చెబుతానని సభకి తెలియచేస్తున్నాను. గౌరవ శాసనసభ్యులందరు చెప్పినదానిని తీసుకుని వెంటనే ఫీల్డ్‌లో తిరిగి సమావేశాన్ని ఏర్పాటు చేసి పనులు వేగవంతం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటాము.

…

మిస్టర్ స్పీకర్: మినిస్టర్ గారూ, చిన్న సూచన. నాగార్జున సాగర్ ఆయకట్టుకి కృష్ణా జలాల లభ్యత ప్రశ్నార్థకవుతున్న నేపథ్యంలో రూ. 2,000 కోట్లకు పైగా వచ్చిన వరల్డ్ బ్యాంకు నిధులనేవి ఒక గోల్డెన్ ఆపర్చునిటీ లాంటిది. అనేక సంవత్సరాలుగా ఖర్చు కాకుండా పడివున్నాయి. ఇంకా ఎక్కువ టైం లేదు వాటిని వాడుకోవడానికి. ఏడెనిమిది సంవత్సరాల బట్టి, పది సంవత్సరాల బట్టి కెనాల్ వ్యవస్థ నాశనమైపోయింది. డ్రాప్స్ కాని, షట్టర్స్ కాని, బండ్స్ కాని మొత్తం చెడిపోయిన నేపథ్యంలో వాటి పనులు చేయడానికైనా, చేసిన పనులను పరిశీలన చేయడానికైనా టైమ్ లిమిటెడ్‌గా ఉంటుంది. ఎందుకంటే కెనాల్ క్లోజ్ చేసిన టైమ్‌లోనే వీటిని చేసుకోవాల్సి ఉంటుంది. డ్రింకింగ్ వాటర్ ఎమర్జెన్సీ వస్తే మధ్యలో వదిలిపెట్టాల్సిన పరిస్థితి ఉంటుంది. కాబట్టి ఆ టైమ్ లిమిటెడ్‌గా ఉంటుంది. మనకు వచ్చిన డబ్బును సక్రమంగా వినియోగించుకోవాల్సి ఉంటుంది. అలా వినియోగించుకోకపోతే ఇంకోసారి అలాంటి నిధుల లభ్యత వుండదు. కాబట్టి మీరు పనులను మానిటర్ చెయ్యాలి, పనిచేసే వారిని మానిటర్ చెయ్యాలి. వేగంగా పని చెయ్యాలి. డబ్బు సరిగా ఖర్చు పెట్టాలి. లేకపోతే 11 లక్షల ఎకరాల ఆయకట్టు, ఆ రైతాంగం మొత్తం సర్వనాశనమవుతుంది. I request you to take proper

action in time; to spend the money; to set right the canals, and save all the farmers of Nagarjunasagar Right Canal.

శ్రీ దేవినేని ఉమా మహేశ్వర రావుః అధ్యక్షా, తప్పకుండా మీరు చెప్పిన సూచనలు, సభ్యులు చెప్పిన సూచనలు పరిగణనలోకి తీసుకొని 27, 28 తేదీలలో కాలువల పరిశీలనకు వెళ్లి తగిన చర్యలు తీసుకుంటాము.

శ్రీ గొట్టిపాటి రవి కుమార్ః సార్ ప్రాజెక్టు పనులు 2016 నాటికి పూర్తి చేసే పరిస్థితులు కనపడడం లేదు. ప్రపంచ బ్యాంకు నిధులు మురిగిపోకుండా దాని కాలపరిమితిని ఎక్స్‌టెండ్ చేసే అవకాశమేమైనా ఉందా చెప్పాలని మంత్రి గారిని మీ ద్వారా కోరుతున్నాను. అట్లాగే మా అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కి సంబంధించి 30కిలోమీటర్ల పరిధి ఉన్నప్పటికీ కేవలం నాలుగు కిలోమీటర్ల వరకు మాత్రమే లైనింగ్‌కు పెట్టారు. అది కూడా అవసరం లేని రీచుల దగ్గర లైనింగ్‌కు పెట్టి సీపేజ్‌లు ఉన్న చోట్ల, అవసరమున్న చోట్ల లైనింగ్‌కు పెట్టలేదు. ఇది ఏ విధంగా పెట్టారో అర్థం కావడం లేదు. ఆ 30కిలోమీటర్లలో కూడా పూర్తి స్థాయిలో బెడ్స్ లైనింగ్, సైడ్ లైనింగ్ చేయాలని అధికారులకు పలుమార్లు లెటర్ రూపంలో ఇవ్వడం జరిగింది. పైనున్న గుంటూరు జిల్లాలో మాత్రం 30 కిలోమీటర్లు లైనింగ్ పెట్టారు. మా ప్రకాశం జిల్లాలో మాత్రం పెట్టలేదు. మా జిల్లాలో కూడా పూర్తి లైనింగ్ పెట్టాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావుః అధ్యక్షా, ఎలాగూ క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్తున్నాము కాబట్టి అన్ని విషయాలూ పరిశీలించి పనులు వేగవంతంగా జరిగేలా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

**MR.SPEKER: Question NO. (33)479 is postponed at the request of the Member.**

**Now, Question No.558 (34)**

**LAQ No.558 (34)**

**Notice give by**
**Sri Buggana Rajendranadh Reddy**
**Sri Alla Rama Krishna Reddy**
**Sri Rajanna Dora Peedika**
**Sri Chirla Jaggi Reddy**
**Sri Gadikoti Srikanth Reddy**

Will the Minister for Rural Development be pleased to State:

a) Whether it is a fact that the Government has decided to allot 25% of sand mines to DWACRA Women Groups in the State;

b) If so, the district-wise and Mandal-wise details of DWACRA Groups to which permission has been accorded in the State; and

c) Whether the Government are aware that the Supreme Court has imposed restrictions on sand mining and if so, the modalities framed by the Government on sand mining?

**PANCHAYAT RAJ AND RURAL DEVELOPMENT (RD.II) DEPARTMENT :(SMT.K.MRUNALINI).**

a) No sir, it has been decided to allot 100% of sand mines to DWACRA Groups in the State.

b) Mandal wise and District wise details of DWACRA Groups which permission has been accorded is enclosed.

c) Yes sir, Modalities were framed by the Government in Sand Mining vide the Following Government Orders.

i) G.O.Ms.No. 94, Industries & Commerce (Mines-IV) Department, dt.28.08.2014
ii) G.O.Ms.No. 95, I&C (Mines-IV) Dept.,07.10.2014
iii) G.O.Ms.No. 97, I&C (Mines-IV) Dept., dt. 21.10.2014.
iv) G.O.Ms.No. 99, I&C (Mines-IV) Dept., dt. 21.10.2014
v) G.O.Ms.No. 101, I&C (mines-IV) Dept., 06.11.2014.
vi) G.O.Ms.No. 207, I&C (Mines-IV) Dept., 17.12.2014.
vii) G.O.Rt.No. 382, I&C (mines-IV) Dept., dt. 09.12.2014.

శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి (డోన్)ః  అధ్యక్షా, శాండ్ ఇంపార్టెన్స్ గురించి చెప్పనక్కర లేదు.  ముఖ్యంగా ఇసుక లభ్యత గురించి  శాండ్ ప్రాసెస్ గురించి  జారీ చేస్తున్న జీవోలు  ఎన్నో సంవత్సరాలుగా రకరకాల కాంట్రవర్సీలతో ఉంటున్న విషయం మనందరకీ తెలిసిందే. ఇన్ని సంవత్సరాలుగా ఇష్యూ చేస్తున్న జీవోలలో రకరకాలుగా మార్పులు, చేర్పులు చేస్తూ వచ్చి చివరగా అరైవ్ అయ్యిందేంటంటే డ్వాక్రా గ్రూపులకు శాండ్ క్వారీయింగ్ ఇవ్వాలన్నది చూసినట్లయితే ఎంతవరకు డ్వాక్రా గ్రూపులు చేస్తున్నారు, ఎంత వరకు వాళ్లు చేయడానికి అవకాశముందని గమనించినట్లయితే వివిధ జిల్లాలలో కూడా ఇది  ఎప్పుడూ కాంట్రవర్సియల్ సబ్జెక్టే.  ఇటీవల ఆంధ్ర జ్యోతి పేపర్లో వచ్చిన వార్త చూసినట్లయితే...  నిశీధిలో సైకతం .... పెట్రేగిపోతున్న ఇసుక మాఫియా......  పగటిపూట డ్వాక్రా సంఘాల విక్రయం ఎనిమిది గంటలు రాత్రి వేళ మాఫియాల విక్రయం పది గంటలు.....  అదేవిధంగా ఇసుక షాక్......  ఎస్ఎస్ఆర్‌కు మించిన తాజా ధర బలహీనవర్గాల ఇళ్లకు మరుగుదొడ్లకు భారం.....  కాంట్రాక్టర్లు....

ఈ విధంగా ప్రతి ఒక విషయంలో మనం గమనించినట్లయితే పేరుకు మాత్రం వాళ్లు శాండ్ క్వారీయింగ్ చేస్తున్నారని తెలియజేస్తున్నాను. కాని అన్ని జిల్లాలలో ఎవరికైతే అధికార పార్టీ ఆశీస్సులున్నాయో.... మా కర్నూలు జిల్లాలో అయితే చెప్పనవసరం లేదు. అధికార పార్టీ ఆశీస్సులున్న వారు మాత్రం రాత్రిపూట చాలా చక్కగా చేస్తున్నారు. ఏ విధంగా చేస్తున్నారన్నది కూడా మీ ద్వారా మంత్రి గారికి తెలియపరుస్తాను. ఫస్ట్ పాయింట్ ఏమిటంటే డ్వాక్రా మహిళలకు అలా చేసే సామర్థ్యం కాని ఎక్విప్‌మెంట్స్ కాని ఉన్నాయా? వాళ్లు పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్, డిఆర్‌డిఏ, డ్వామా తదితర ప్రభుత్వ యంత్రాంగ శాఖల సహాయం ద్వారా చేయడానికి ఎక్కడైనా ప్రాపర్ మెకానిజమ్ ఉందా అని నేను అడుగుతున్నాను. అసలు డిస్ట్రిక్ట్ లెవెల్ శాండ్ కమిటీ అంటారు కాని ఒక వ్యక్తికి, ఒక ఆర్గనైజేషన్‌కు, ఒక ఆఫీసుకు ఇలా ఎవరికో ఒకరికి ఇస్తే రెస్పాన్సిబిలిటీ కంప్లీట్‌గా ఉంటుంది కాని ఇలా తాత్కాలికంగా నాలుగైదు డిపార్ట్‌మెంట్ల నుండి కొంత మందిని తాత్కాలిక ప్రాతిపదికన పొచప్ చేసినందువల్ల వాళ్లు ఎంతవరకు కరెక్ట్‌గా చేయగలుగుతారని మీ ద్వారా నేను మంత్రి గారిని అడగదలచుకున్నాను.అదేవిధంగా డ్వాక్రా మహిళలకు శాండ్ మాఫియాను ఎదుర్కొనడానికి, వాళ్ల నుంచి తప్పించుకోవడానికి ఎంత వరకు రక్షణ ఉందని అడుగుతున్నాను.

అదేవిధంగా శాండ్ ధర రెండేళ్ల క్రితం 2012లో It was fixed as Pit mouth rate should not exceed 20% on SSR. Sand price is fixed as more than SSR price. For fixation of sand… ఎస్ఎస్ఆర్‌ను బేస్ చేసుకుంటున్నారు. నిజం చెప్పాలంటే శాండ్ ప్రైస్ ఫిక్సేషన్ కోసం ఎస్ఎస్ఆర్‌ను బేస్ చేసుకోకూడదు. ఎందుకంటే కొత్త ఆంధ్ర రాష్ట్ర రాజధాని నిర్మాణంలో ఇసుకకు అంత ఇంపార్టెన్స్ ఉన్నప్పుడు దానికి వచ్చే రెవిన్యూస్ ఎంత అని మనం చూస్తున్నామే కాని ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఇదే ఇసుక మన అభివృద్ధికి ఎంత ఇబ్బందులు కలిగిస్తున్నదో మనం గమనించాల్సిన అవసరముంది. ఎంత ఆశ్చర్యకరమైన రేట్లు అయ్యాయంటే వేరే రాష్ట్రాలలో గమనించినట్లయితే ప్రతి ప్రభుత్వం కూడా ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఒక ప్రభుత్వం రూపాయకే కిలో బియ్యం, ఒక ప్రభుత్వం రూపాయకే కిలో గోధుమలు, ఇంకొక ప్రభుత్వం రూపాయకే కిలో జొన్నలు ఇలా ఇస్తున్నారు. కాని ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో రూపాయకే కిలో ఇసుక ఈ రోజు మార్కెట్లో వుంది. ఇలాంటి పరిస్థితుల్లో డ్వాక్రా సంఘాల నిర్వహణను మనం దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరముంది. ఆ ఇసుక రీచులను గమనించినట్లయితే ఎక్కడ చూసినా శాండ్ క్వారీయింగ్ డ్వాక్రా సంఘాల మహిళలు చేస్తున్నారని వుంటుంది. వాస్తవానికి ఆ రీచుల విషయంలో ఒక్కొక్క విలేజ్ ఆర్గనైజేషన్ నుంచి పది/పన్నెండు మందిని సెలెక్ట్ చేస్తున్నారు. ఆ సెలక్షన్ విషయంలో కూడా అధికార పార్టీ వాళ్ల ఇంటర్‌ఫియరెన్స్ ఎంత వుందనేది గమనించాల్సిన అవసరముంది. చివరికి ఏ స్టేజ్‌కొచ్చిందంటే పేర్లు ఇక్కడ చెప్పకూడదు కాని రాజమండ్రికి సంబంధించి ఇద్దరు శాసనసభ్యులు నావాళ్లుండాలంటే నావాళ్లుండాలని పబ్లిక్‌గా కొట్లాడుకున్నారు. అన్నీ పద్ధతి ప్రకారం జరిగినప్పుడు, పద్ధతి ప్రకారం విలేజ్ ఆర్గనైజేషన్స్

నుంచి సెలెక్షన్ జరిగినప్పుడు, ఇలా ఏందుకు జరిగిందో మనం అర్థం చేసుకోవాల్సిన అవసరముంది.

శ్రీమతి కె.మృణాళిని (చీపురుపల్లి)ః సర్, ఇది క్వశ్చనవర్. డిస్కషన్ కాదు. మీరు అలౌ చేయకండి.

...

ఏదైనా ఉంటే మీరు స్పష్టంగా అడగండి. నేను సమాధానం చెబుతాను. Sir, it is not a long discussion. Don't allow him. It's a question hour.

శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ః అధ్యక్షా, నేను ఎందుకు మనవి చేస్తున్నానంటే డ్వాక్రా సంఘాలకు అన్ని రకాల వసతులు కల్పించారా లేదా అని వివరణ ఇవ్వమని అడుగుతున్నాను.

మిస్టర్ స్పీకర్: రాజేంద్రనాథ్ రెడ్డి గారు, మీరు ఇసుకలో కావచ్చు, ఇంకోకదానిలో కావచ్చు అవినీతి జరిగితే నిజంగా పాయింట్ ఔవుట్ చేయవచ్చు. దానిని ఎవరూ కాదనలేరు. అయితే, పెదవి దాటితే పృథివి దాటిపోతుంది అని అంటారు. నిన్న మీరు మాట్లాడుతూ ఆంధ్రవాళ్లు దేవుడికి కూడా లంచం పెట్టారని, ఆంధ్రవాళ్లు అంతా లంచగొండులు అని అన్నారు.

శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిః అధ్యక్షా, లేదు, లేదు. I would like to clarify.

MR.SPEAKER: Kindly remember, ఆంధ్రావాళ్లు వెళ్లి కాంట్రాక్టు వేశారనే పద్ధతిలో మీరు చెప్పారు.

శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ః అధ్యక్షా, I would like to clarify….

మిస్టర్ స్పీకర్: రాజేంద్రనాథ్ రెడ్డి గారూ వినండి, మీరు నేను మాట్లాడమన్నపుడు మాట్లాడండి. The House heard the remarks and the same were recorded. ఆంధ్రావాళ్లకి ఒకప్పుడు ప్రపంచ వ్యాప్తంగా క్రెడిబులిటీ ఉన్నది. For some reasons it has gone back. దానిని మీరు ఒక sweeping remark గా చేయడం కరెక్టు కాదు. అది ఒక బాధ్యతారాహిత్యం. ఎందుకంటే, ఇక్కడ House proceedings will be visible throughout the world. మీరు ఆంధ్రా వ్యక్తిగా ఈ సభలో కూర్చుని ఆంధ్రవాళ్లంతా 'corrupt' అని ఒక మాట, భావం వచ్చేలా మీరు మాట్లాడటం మంచిది కాదు. ఎక్కడైనా అవినీతి ఉంటే మీరు వేలెత్తి చూపవచ్చు. Concerned person will take action on that. Kindly, don’t make sweeping remarks.

శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిః అధ్యక్షా, ఆంధ్రవాళ్లకి సంబంధించినంతవరకూ నేనెప్పుడూ ఆ అర్థం వచ్చేలా అనలేదు. నేను ఒక కథలో భాగంగా స్థానికంగా ఉన్న ఒక కంపెనీ అని అన్నాను.

మిస్టర్ స్పీకర్ః ఆంధ్రా కంపెనీ అన్నారు.

శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ః లేదు అధ్యక్షా! కొంత మంది దానిని డైవర్ట్ చేశారు.

మిస్టర్ స్పీకర్: దయచేసి ముగించండి.

(ఈ సందర్భంలో శ్రీమతి కిమిడి మృణాళిని మాట్లాడటానికి అవకాశం ఇవ్వమని కోరారు.)

మిస్టర్ స్పీకర్: మినిస్టర్ గారూ, దయచేసి ఒక నిమిషం కూర్చోండి.

శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ః అధ్యక్షా, డ్వాక్రా మహిళలు అన్ని రకాల పర్యవేక్షణ చేసున్నారని అంటున్నారు. అధికార పార్టీ వాళ్లకు సంబంధించిన వాళ్లు నేరుగా బిల్లులు కూడా రాస్తున్నారు. డ్వాక్రా మహిళలు ఏవిధంగా చేస్తున్నారు, వాళ్లని ప్రభుత్వం ఎంత సమర్థవంతులుగా తయారు చేశారనే విషయాన్ని గమనిస్తే నెం.1 మీ-సేవ లో తీసుకున్న ఇసుక కూపన్లు పెట్టుకొని అదే కూపన్లు పదే పదే ఎన్నిసార్లని వాడతారు? నెం. 2 ఎవరైతే ట్రాక్టర్లలో, లారీలలో ఇసుక తీసుకుపోతున్నారు దానికి వెయ్‌మెంటుకి ఎంత కట్టించుకుంటున్నారు? ఇవన్ని కూడా లోటు పాట్లు ఉన్నాయి.

MR.SPEAKER: Please put your question.

శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ః అధ్యక్షా, ఇవన్ని కాకుండా చివరి ప్రశ్న ఏమిటంటే రూల్ ప్రకారంగా all reaches in the state should be covered and should have MOUF clearance. ఎన్ని రీచ్‌లకు MOUF clearance ఉందని గౌరవ మంత్రివర్యులను అడుగుతున్నాను.

శ్రీమతి కిమిడి మృణాళినిః అధ్యక్షా, Irregularities అన్నారు Irregularities అనేవి ఇసుక మాఫీయా, ఇసుక కుంభకోణాలు, కోట్లాది రూపాయల కుంభకోణాలు ఇవ్వన్నీ కూడా గత ప్రభుత్వంలోనే జరిగాయి. ఇవ్వన్నీ గౌరవ సభ్యులందరికి తెలుసు. ఇవ్వన్నీ తెలిసే ఈ విధంగా మాట్లాడుతున్నారు. ఇసుక మాఫియాలు, ఇసుక కుంభకోణాలు కోట్లాది రూపాయల ఆర్జన, అక్రమార్జన ఇవ్వన్ని కూడా గత 10సంవత్సరాల కాలంలోనే, గత ప్రభుత్వం హయాంలోనే జరిగింది. రెండవది proper mechanism అంటున్నారు. Proper mechanism ఉంది.

District level Sand Committee అనేది ఉంది. జిల్లా కలెక్టర్, ఎస్పీ, జేసీ, డీపీఓ, పీడీ డిఆర్‌డిఎ, పీడీ ద్వామా వీళ్లందరూ సభ్యులుగా డిస్ట్రిక్ట్ లెవల్ శాండ్ కమిటీ ఉంటుంది. వీళ్లు ఇసుక రీచెస్‌ని గుర్తిస్తారు. ఏవైనా అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వస్తే వెంటనే వాటి మీద చర్యలు తీసుకుంటారు. అదేవిధంగా District Level Sand Mining Facilitating Agency ఉంది. ఇందులో కలెక్టర్ ఛైర్మన్‌గా, పీడీ డిఆర్‌డిఎ సెక్రటరీగా వ్యవహరిస్తారు. ఆ విధంగా జిల్లాలో ఈ డ్వాక్రా సంఘాలు, డ్వాక్రా మహిళలను గుర్తింపు చేయడం జరుగుతుంది. ప్రధానంగా ప్రపంచంలోనే, దేశంలోనే ప్రప్రథమంగా ఈ ఇసుక అనేది డ్వాక్రా సంఘాలకు ఇవ్వడం, వాళ్ల ద్వారా ఈ కార్యక్రమం జరపటం అనేది మన రాష్ట్రంలోనే ప్రప్రథమంగా జరిగింది. మహిళలకు సాధికారత కల్పించాలని, మహిళలకు అధిక ఆలంబన ఇచ్చి మహిళలను ముందుకు తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ప్రారంభించడం జరిగింది. ఈ విధంగా ఏదైతే facilitating agency ఉందో ఈ ఏజెన్సీ డ్వాక్రా మహిళలకు capacity building గాని, ఆర్థిక, పరిపాలన, సాంకేతిక మద్దతుని ఇస్తూ వాళ్లని తీర్చిదిద్దడం జరిగింది. ఈ రోజు డ్వాక్రా సంఘ మహిళలు చేయలేని కార్యక్రమం లేదు. ఈ రోజు ఎంతో చక్కగా ఈ కార్యక్రమాలన్ని నిర్వహించడం జరుగుతోంది. ఈ విధంగా చక్కగా జరిగే కార్యక్రమాలని వేలెత్తి చూపించడం అనేది సమంజసం కాదు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా అధికారులొచ్చి ఏవిధంగా ఈ కార్యక్రమాలు చేస్తున్నారు అనేది పరిశీలించి, వాళ్ల రాష్ట్రాలలో కూడా ప్రారంభించాలనే విధానంలో ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ముందుకు వస్తున్నాయి. అదే విధంగా ISLకి గానీ, పేదవాళ్లకి ఇచ్చే ఇళ్లకు గానీ ఇసుక ధరలు ఏవిధంగా ఉన్నాయని సభ్యులు అడిగారు. గౌరవ ముఖ్యమంత్రిగారు ఇప్పటికే ఒక నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఏవైతే individual sanitary latrines ఉన్నాయో ఏదైతే పేదవాళ్లకి ఇళ్లు మనం కడుతున్నామో వీటికి సంబంధించి SSR ధరలలోనే ఇసుక ధరలు కూడా ఇనుమడింపజేయటం జరుగుతుంది. ఈ ఇసుక ధరలు కూడా ప్రభుత్వ పరంగానే లబ్దిదారులకు ఇవ్వడం జరుగుతుంది. అదేవిధంగా ఇసుక ధర గురించి అడిగారు? ఇసుక ధర నాణ్యతను బట్టి నిర్ణయించడం జరిగింది. 4th & 5th Order రీచెస్‌లో అయితే చాలా నాణ్యమైన ఇసుక ఇవ్వడం జరుగుతోంది. దాని ధర ఒక క్యూబిక్ మీటర్‌కి రూ.650 ఉంటుంది. అదే విధంగా 3rd order రిచెస్‌లో అయితే నాగావళి, వంశధారల వద్ద ఒక క్యూబిక్ మీటరు రూ.500 ఉంది. చిత్తూరు జిల్లాలో అయితే ఒక క్యూబిక్ మీటరు రూ.320 ఉంది. ఈ విధంగా ఇసుక ధర నిర్ణయించడం జరిగింది. అయితే ఈ అనుమతులన్నీ WALTA Act ప్రకారంగా, ఏదైతే నీరు, భూమి, చెట్లు ఉన్నాయో వీటన్నింటినీ పరిరక్షించే విధంగా సుప్రీంకోర్టు ఏవైతే ఆదేశాలు ఇచ్చిందో, ఆ ఆదేశాలకు అనుగుణంగానే ఈ రోజు రీచెస్‌ను గుర్తించడం గాని, రీచెస్ అనుమతులు ఇవ్వడం గాని రీచెస్ నుండి ఇసుకను తీయడం జరుగుతుంది. ఇదంతా కూడా యాక్టు ప్రకారం జరుగుతుంది.

శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి : అధ్యక్షా, నేను మంత్రి గారిని మీద్వారా అడిగిన ప్రశ్నేమంటే ఈ రీచ్‌లలో ఎన్ని రీచ్‌లకు వాస్తవంగా సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం MOUF క్లియరెన్సులు ఉన్నాయో స్పష్టంగా చెప్పండి? అన్నింటికీ ఉన్నాయని అంటున్నారు గానీ ఎన్ని అనేది స్పష్టంగా చెప్పాలని కోరుతున్నాను. రెండవది డ్వాక్రా మహిళలకు సంబంధించి మొత్తం ఎన్ని గ్రూపులున్నాయి? ఊళ్లల్లోకి వెళుతుంటే ప్రతీ ఒక్కరూ తమకు అవకాశం ఉంటుందనుకుంటున్నారు కానీ రాష్ట్రమంతా వెతికినా ఒక 50 లేదా 100 గ్రూపులకు మించి అవకాశం ఉండదు. ఇవన్నీ ఎందుకు చేస్తున్నారంటే మనం ఎన్నికల ముందు మనం డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ అని చెప్పి ఇప్పుడు దానిని డీవియేట్ చేయడానికి డ్వాక్రా మహిళలు అని చెబుతున్నారు తప్ప ఎంతమంది డ్వాక్రా మహిళలకు ఇక్కడ ఉపాధి లభిస్తోంది? ఇప్పటికి కూడా 25శాతం ఆదాయం మ్యాక్స్‌కు పోతుందని అంటున్నారు. మ్యాక్స్‌కు వెళ్లే 25శాతం ఆదాయాన్ని ఏ విధంగా డిస్ట్రిబ్యూట్ చేయాలి, ఎవరికి ఇవ్వాలి, ఏవిధంగా దానిని వాడుకోవాలని ఎక్కడా స్పష్టత లేదు. మొత్తం ఆదాయం 25శాతం అంటే దానికి కోట్లాది రూపాయలు అవుతుంది. దానికి ఇంతవరకు స్పష్టత లేదు. (బెల్) అదేవిధంగా ఎద్దులబండిలో.....

(మైకు కట్ అయింది).

శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి (రాజమండ్రి రూరల్): గౌరవ సభ్యులు రాజేంద్రనాథ్ రెడ్డిగారు మాట్లాడుతూ రాజమండ్రి శాసనసభ్యులు ఏదో ఇసుక మాఫియా కోసం కొట్లాడుకున్నారు అన్న అర్థంలో వారు మాట్లాడారు. దీనిని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. 40సంవత్సరాలుగా నా రాజకీయ జీవితంలో ఎన్నడూ అవినీతికి, అక్రమాలకు పాల్పడలేదు, ఒక్క రూపాయి కక్కుర్తి పడలేదు, ఎవరి దగ్గర చేయి చాచలేదనే విషయాన్ని రాజేంద్రనాథ్ రెడ్డి గారు తెలుసుకోవలసిన అవసరం ఉంది. ఈ సందర్భంగా నేను మనవి చేసేది ఏమిటంటే 40సంవత్సరాలుగా పడవల మీద జీవిస్తున్న సొసైటీ వాళ్లు అక్కడున్నారు. పడవల మీద గోదావరిలోకి వెళ్లి రెక్కలు కష్టంతో తెచ్చి వడ్డున వచ్చి వ్యాపారం చేసుకొనే వాళ్లకు సంబంధించి కొత్తగా వచ్చిన సొసైటీ వాళ్లు నిన్న మొన్న హడావిడిగా నమోదు చేసుకొని వచ్చిన వాళ్లకి, పాత వాళ్లకి తగాదా జరిగిన విషయంలో మేము అక్కడకు వెళ్లడం జరిగింది గాని మేము వ్యాపారం కోసం గానీ మరొకటి గానీ కాదు. 40సంవత్సరాలుగా ఉన్నవాళ్లు దానిలో మీ పార్టీలో వాళ్లు, కాంగ్రెసు పార్టీలో వాళ్లు, తెలుగుదేశం పార్టీ వాళ్లు కూడా ఉన్నారు. దానికోసం మేము వెళితే మేము కావాలని వెళ్లినట్లుగా చెప్పారు. మేము స్పష్టంగా చెబుతున్నాము. మహిళా సాధికారత కోసం చంద్రబాబు నాయుడుగారు ప్రవేశపెట్టిన ఈ పథకం భారతదేశానికే ఆదర్శం కాబోతున్నది.

...

ఇవాళ వారు చెబుతున్నారు. ఆ విధంగా వచ్చిన మొత్తం కామన్ ఫండ్‌లోకి వెళుతుంది. ఆ మొత్తం రాష్ట్రంలోని అన్ని మహిళా గ్రూపులకు ఆఖరికి రాజేంద్రనాథ్‌రెడ్డిగారి

నియోజకవర్గంలోని గ్రూపులకు కూడా వెళుతుంది. అక్కడ ఎవరైతే కష్టపడి పనిచేస్తున్నారో ఆ సమాఖ్యలలోని సభ్యులకు మాత్రమే జీతాలు ఆ మొత్తం నుంచి ఇస్తాయి. అక్కడ కొంతమంది మాత్రమే పని చేస్తారు కాబట్టి వారికి మాత్రమే జీతాలు వస్తాయి కావున గౌరవసభ్యులు ఇలా మాట్లాడడం సరైనది కాదని మీ ద్వారా తెలియజేస్తున్నాను.

శ్రీమతి కె.మృణాళినిః గౌరవసభ్యులు వేసిన మొదటి ప్రశ్నకు సమాధానంగా అన్ని రీచ్‌లలో సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి పర్యావరణ అనుమతి వచ్చిన తరవాత వాల్టా చట్టం మేరకు ఇసుక తవ్వకాలు ప్రారంభించడం జరిగింది. ఇప్పటికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో దాదాపు 200 రీచ్‌లను, 200 మ్యాక్ సొసైటీలను కూడా గుర్తించి 638 విలేజ్ ఆర్గనైజేషన్స్‌కు ఇవ్వడం జరిగింది. అందులో 15,201 స్వయం సహాయక సంఘాలు రీచ్‌లను గుర్తించాయి. అయితే గౌరవసభ్యులకు అర్థమయ్యే రీతిలో చెబుతున్నాను. ఆయా రీచ్‌ల పరిధిలోని మ్యాక్ సొసైటీలన్నీ దానిలోకి వస్తాయి. కాబట్టి మ్యాక్ సొసైటీలో ఉన్న గ్రూప్స్ అన్నీ పనిచేస్తాయి. ఆ సొసైటీల ద్వారా ఇప్పటివరకు తవ్విన ఇసుక 14,00,351 క్యూబిక్ మీటర్లు కాగా ఇప్పటివరకు వచ్చిన మొత్తం రవాణా చార్జీలతో కలిపి రూ.94,94,56,000. ఇసుక రవాణా చార్జీలు రూ.3,59,00,000 తీసివేస్తే మిగిలిన మొత్తం రూ.91,34,87,000. ఆ మొత్తాన్ని రాష్ట్రంలో ఉండే మహిళా సంఘాలకు గానీ, పేదవారికి గానీ ఖర్చు చేయాలనే దృక్పథంతో ముఖ్యమంత్రిగారున్నారు. ఇంకా మెరుగ్గా ఏమి చేయాలనేది నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది.

**ప్రశ్న నెం. 569 (35)**

**శ్రీ ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ, ఎమ్మెల్యే.**

గౌరవనీయులైన సాగునీటి శాఖ మంత్రిగారు దయచేసి ఈ కింది సమాచారం తెలియజేస్తారా;

అ) తూర్పు గోదావరి జిల్లాలోని ముసురుమిల్లి ప్రాజెక్టు యొక్క పురోగతి వివరాలేమిటి?

ఆ) ఇప్పటివరకు ఖర్చు చేసిన నిధులు ఎంత?

ఇ) ఎప్పటిలోగా ఆ ప్రాజెక్టును పూర్తి చేయడమవుతుంది?

**సాగునీటి శాఖ మంత్రి (శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు)ః**

అ) కాంక్రీట్ స్పిల్‌వే, కాంక్రీట్ నాన్–ఓవర్‌ఫ్లో డ్యామ్, ఎర్త్ డ్యామ్, ప్రధాన తూము నిర్మాణంతో కూడిన ప్రధాన పనులు 83 శాతం పూర్తి చేయడమయింది. గేట్లను తయారుచేసి స్థాపించవలసిఉంది. మొత్తం కాలువ వ్యవస్థను పూర్తి చేయడమవుతుంది. తగు రీతిగా స్పిల్‌వే యొక్క క్రెస్ట్ స్థాయి వరకు నీటిని నిల్వ చేస్తూ 22,643 ఎకరాల ఆయకట్టు ప్రాంతానికి నీటిని విడుదల చేయడమవుతున్నది.

ఆ) నవంబర్, 2014వరకు పథకంపై ఖర్చు చేసిన వ్యయం రూ.196.457 కోట్లుగా ఉంది.

ఇ) ఈ ప్రాజెక్ట్‌ను 30.06.2015 తేదీనాటికి పూర్తి చేయాలనే కార్యక్రమాన్ని రూపొందించడమయింది.

శ్రీ ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ(పిఠాపురం)ః అధ్యక్షా, ఈ ప్రాజెక్టు నిర్మాణం పది సంవత్సరాల క్రితం ప్రారంభించినా ఇప్పటివరకు పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీరందడం లేదు. ఆ ఆయకట్టు కింద 22వేల ఎకరాలకు రెండో పంటకు నీరందించాల్సిన బాధ్యత ఉంది. రెండో పంటకు నీరు ఎపుడు ఇస్తారు? ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో ఎపుడు నీరు నిల్వ చేస్తారో మంత్రిగారు చెప్పాల్సిన అవసరముంది. ఈ ప్రాజెక్టు పూర్తి వ్యయం రూ.200కోట్లు. ఈ ప్రాజెక్టు కూడా జలయజ్ఞం పథకంలో ప్రారంభించిన ప్రాజెక్టు. పది సంవత్సరాల నుంచి రూ.200కోట్లు వెచ్చించినా ఈ ప్రాజెక్టును పూర్తి చేయలేని పరిస్థితుల్లో అప్పటి ప్రభుత్వాలున్నాయి. అంతేగాకుండా ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా కాలువల త్రవ్వకం పూర్తి చేసినా హెడ్‌వర్క్స్ పెండింగ్ ఉన్నాయి. కేవలం కాలువల త్రవ్వకానికి కాంట్రాక్టర్లను ముందుకు పంపిన అప్పటి ప్రభుత్వాలు హెడ్‌వర్క్స్ పూర్తిగా వదలివేశాయి. మంత్రిగారికి వాటన్నింటి మీద మంచి అవగాహన ఉంది. అలాగే ఏలేరు రెండో దశ ఆధునీకరణ, సుద్దగడ్డ ప్రాజెక్టులలో వర్షాకాలం వస్తే మా నియోజకవర్గంలోని మండలాలన్నీ మునిగిపోతున్నా గత పది సంవత్సరాల నుంచి వాటినెవరూ పట్టించుకోలేదు. ప్రభుత్వం ఈ రెండు పనులను ఎప్పుడు ప్రారంభిస్తుందని అడుగుతున్నాను. ఈ ప్రాజెక్టుల విషయంలో గత పది సంవత్సరాలుగా మేం మోసపోవడం జరిగింది. ఏలేరు, సుద్దగడ్డ ప్రాజెక్టుల విషయమై గత ప్రభుత్వాలు అనేకసార్లు హామీలు ఇచ్చినప్పటికీ, శంకుస్థాపనలు చేసినప్పటికీ ఈ రోజువరకు మా నియోజకవర్గంలో వాటిని పూర్తి చేయలేదు. కాబట్టి ఈ ప్రాజెక్టుల విషయంపై సరైన సమాధానం ఇవ్వవలసిందిగా మంత్రిగారిని మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ జ్యోతుల నెహ్రూ (జగ్గంపేట)ః అధ్యక్షా, ముసురుమిల్లి పూర్తిగా ప్రాజెక్టు గిరిజన ప్రాంతంలో ఉంది. ఈ ప్రాజెక్టును గత ప్రభుత్వాలు ఫీజిబిలిటీ లేదని చెప్పినా, జలయజ్ఞంలో భాగంగా నిబంధనలను పక్కనపెట్టి గిరిజనులకు మేలు చేసేందుకు దివంగత నేత రాజశేఖరరెడ్డిగారు ఈ ప్రాజెక్టును ప్రారంభించారు, నిధులు మంజూరు చేశారు. అయితే ఈ

ప్రాజెక్టులో గొప్పతనమేమంటే ఒక టన్నెల్ తవ్వితే ఇంచుమించు 18,000 ఎకరాలు. మా నియోజకవర్గంలోని గోకవరం మండలంలో అందులోనూ పూర్తిగా గిరిజనుల భూములు ఆయకట్టు పరిధిలోకి వస్తుంది. సహచర సభ్యులు చెప్పినట్లుగా దానిని పూర్తి చేయాల్సిన అవసరముంది. ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ పూర్తి చేసినట్లయితే పూర్తి స్థాయిలో 22,316 ఎకరాలకు నీరందించడమేగాకుండా, దానికి ఎక్స్‌టెన్షన్ కెనాల్ కేవలం ఆరు కిలోమీటర్లు తవ్వితే మొల్లేరు, పిడతమామిడి, శ్రీరంగపట్నం గ్రామాలలోని గిరిజనులకు చెందిన మరో రెండువేల ఎకరాలకు నీరందించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ముఖ్యంగా మల్లవరం గ్రామంలో మరో 1800 ఎకరాలకు నీరందే పరిస్థితి ఉంటుంది. ఈ ప్రాజెక్టుకు నిధుల కొరత లేదు. సుమారు రూ.14కోట్లు ఇందుకు కేటాయించబడి ఉన్నాయి. కానీ, ఆ ప్రాజెక్టులో మిగిలిన పనులు పూర్తి చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాని పరిస్థితి ఉంది. కానీ విచిత్రమేమంటే, స్టీలు, సిమెంట్‌కు ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం ప్రభుత్వం చెల్లిస్తున్నది. కానీ, ప్రస్తుత చర్చనీయాంశమైన ఇసుక రేట్లు బాగా పెరగడంవలన ఇసుక, మెటల్ రేట్లు పెంచమని కాంట్రాక్టరు అభ్యర్థించారు. వాస్తవానికి ఆ కాంట్రాక్టరు ఎవరో నాకు తెలియదు. పెరిగిన ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం ఈ ప్రాజెక్టుకు నిధులు ఇవ్వడానికి ఆమోదించినట్లయితే ప్రాజెక్టు నిర్మాణం పూర్తై గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందడానికి, వారు రెండు పంటలు పండించుకోవడానికి అవకాశముంది కాబట్టి ఆ రకంగా చేయడానికి మంత్రివర్యులు నిర్ణయం తీసుకోవాలని మీ ద్వారా కోరుతున్నాను.

...

శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి: అధ్యక్షా, గిరిజన ప్రాంతంలో మూడు ప్రాజెక్టుల నిర్మాణాన్ని మా దగ్గర చేపట్టారు. శ్రీ నెహ్రూ గారు ఆనాడు మా పార్టీలో ఉన్నప్పుడు అందరం కలిసి ఒక ప్రాజెక్టు రిపోర్టును ప్రభుత్వానికి అందించడం జరిగింది. ఆ నివేదికను జలయజ్ఞం కార్యక్రమంలో పరిగణనలోకి తీసుకున్నప్పటికీ ఫలితాలకొచ్చేసరికి జీరో అయింది. సూరంపాలెం, భూపతిరాజుపాలెం, ముసురుమిల్లి ప్రాజెక్టుల పరిధిలో ఎక్కడైతే ఉద్దేశించబడిందో అక్కడ ఆయకట్టు రావడం లేదు. అందుకు కారణాలను కూడా ఒకసారి వెరిఫై చేయాల్సిన అవసరాన్ని గౌరవ మంత్రి గారి దృష్టికి తీసుకువస్తున్నాను. ఎందుకంటే రాజమండ్రి దగ్గర చాగలనాడు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. సుమారు రూ.80.00 కోట్లు ఆ ఎత్తిపోతల పథకానికి ఖర్చు చేసినప్పటికి కనీసం 200 ఎకరాల పంట భూమికి కూడా నీరు అందడం లేదు. కేవలం 150 గుడిసెలను తప్పించి అక్కడి వారికి పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం ఆనాడు ఫైలూర్ కావడం వల్ల 30వేల ఎకరాలకు నీరు అందించాలనే ప్రభుత్వ టార్గెట్‌కు కేవలం 200ఎకరాల పంట భూమికి కూడా నీరు అందకపోవడం వల్ల సాగులోకి రాలేకపోయింది. అదే విధంగా సూరంపాలెం గానీ, భూపతిరాజుపాలెం గానీ, ముసురుమిల్లి క్రింద ఉన్న గిరిజన ప్రాజెక్టుల పరిధిలోని భూమిని ఎందుకు సాగులోకి తీసుకురాలేకపోతున్నారో అర్థం కావడం లేదు. గత పాలకుల పది సంవత్సరాల కాలంలో జలయజ్ఞాన్ని ధనయజ్ఞంగా మార్చారేగాని ప్రయోజనం కల్గలేదు. దయచేసి అన్నింటిపైన సమగ్రంగా విచారణ జరిపి గిరిజన ప్రాంతాల్లోని

ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తిగావించి ఆయకట్టుకు నీరందించవల్సిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు: అధ్యక్షా, శాసనసభ్యులు వర్మ గారు, జ్యోతుల నెహ్రూ గారు మరియు పెద్దలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి గారు తూర్పు గోదావరి జిల్లాలో ఇ.పి.సి. నీటిపారుదల ప్రాజెక్టుల క్రింద జరుగుతున్న లోపాలన్నింటినీ ఎత్తిచూపించారు.

అధ్యక్షా, రాష్ట్రంలోని 13 జిల్లాల్లో ఎక్స్‌పర్ట్ కమిటీలను ఏర్పాటు చేసి అందులో సర్వశ్రీ చెరుకూరి వీరయ్య గారు, రోశయ్య గారు, సుబ్బారావు గారు, ఐ.ఎస్.ఎన్.రాజు గారు, ఆర్. సత్యనారాయణ గారు, ఎస్. సత్యనారాయణ గారు అట్లాగే రహమాన్ గారు, బషీర్ గారు మరియు బి.ఎస్.ఎన్. రెడ్డి తదితర ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు కృష్ణా డెల్టా, గోదావరి డెల్టా, పెన్నా డెల్టా, రాయలసీమలోని నాలుగు జిల్లాల ప్రాజెక్టులు మరియు ఉత్తరాంధ్రలోని విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని ఇరిగేషన్ ప్రాజెక్టులకు పరిశీలిన నిమిత్తం పంపడం జరిగింది. ఏవైతే జలయజ్ఞంలోని ప్రాజెక్టులకు ప్రాధాన్యత ప్రకారం టెండర్లను పిలిచి పనులు చేసి ఉన్నట్లైతే ఇవాల్టికి పద్నాల్గు కోట్ల రూపాయల నుంచి ఇరవై వేల కోట్ల రూపాయల వరకు పనులు జరిగి ఉండేవి. కానీ గత పాలకులు కమీషన్లకు కక్కుర్తి పడి ఒకేసారి ప్రాజెక్టులన్నింటికి టెండర్లు పిలవడం వల్ల ఆనాడు ఇ.పి.సి.లో ఇష్టానుసారంగా సంతకాలు చేయడం వల్ల మేమే ల్యాండ్ ఇస్తామని, అన్ని క్లియరెన్స్‌లను మేమే ఇస్తామనే మాయ మాటలు చెప్పి సంతకాలు పెట్టడం వల్ల ఇవాళ ఏజెన్సీలన్నీ ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపుతున్నాయి. ఆనాడు ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణం నిమిత్తం భూమి ఇవ్వకపోవడం వల్ల, సకాలంలో క్లియరెన్స్‌లు ఇవ్వకపోవడం వల్ల జాప్యం జరిగిందనే ఆరోపణలను సదరు ఏజెన్సీలు గత పాలకుల పైన, గత పది సంవత్సరాల ప్రభుత్వాల పైన దుమ్మెత్తిపోస్తున్నాయి. ఆ కారణంగా ఏజెన్సీలు పది వేల కోట్ల రూపాయల విలువచేసే ప్రాజెక్టు పనులను పక్కన పెట్టి జి.వో. నంబర్ 13క్రింద చేపట్టాల్సిన పనులను ప్రక్కనపెట్టడం జరిగింది. ఇ.పి.సి.లో జరిగిన లోపాలను ఏజెన్సీలన్ని కూడా ఎక్స్‌పర్ట్ కమిటీ ముందుంచడం జరిగింది. పెద్దలంతా కూర్చోని, ఈనాడు విధి నిర్వహణలో ఉన్న ఇంజనీరింగ్ అధికారులందరు మరియు ఏజెన్సీ యాజమాన్యాలను పిలిపించి మాట్లాడడం జరుగుతోంది. ఉదాహరణకు ముసురుమిల్లి ప్రాజెక్టు విషయంలో అదే తంతు జరిగింది. గిరిజన ప్రాంతంలోని ఆ ప్రాజెక్టును సకాలంలో పూర్తిచేయాల్సి ఉంది. ఆ ప్రాజెక్టుకు సంబంధించిన సమస్యలు కొన్ని కోర్టు పరిధిలో ఉన్నాయి. ఎక్స్‌పర్ట్ కమిటీ ఇచ్చే నివేదికను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని సత్వరమే గిరిజన ప్రాంతంలోని గౌరవ సభ్యులు ప్రస్తావించిన ముసురుమిల్లి తదితర ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తిచేయడం జరుగుతుందనే విషయాన్ని గౌరవ సభ్యులకు తమరి ద్వారా తెలియజేస్తున్నాను. వచ్చే సంవత్సరం జూన్ మాసం లోపల ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తిచేసి రబీ పంటకు నీరు అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. అదే విధంగా ఇన్‌టేక్ కాలువల విషయంలో ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో

అన్నింటిని ప్రభుత్వం పరిశీలించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందనే విషయాన్ని సభకు తెలియజేస్తున్నాను. ఏలేరు మాడ్రనైజేషన్ ఫేజ్ 2 క్రింద పనులను మొదలు పెట్టే ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద పరిశీలన నిమిత్తం ఉన్నాయి. నేను స్వయంగా జనవరి మాసం మొదటి వారంలో జిల్లా పర్యటనకు ప్రాజెక్టుల పరిశీలన నిమిత్తం వెళ్లాలని అనుకుంటున్నాను. ఆ సమయంలో గౌరవ సభ్యులను సంప్రదించి వారిచ్చే సలహాలను, సూచనలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుంటుందనే విషయాన్ని మరొకసారి సభ దృష్టికి తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఏలేరు ప్రాజెక్టు పరిధిలోని కాలువలనన్నింటిని స్వయంగా పర్యవేక్షించి సత్వరమే గిరిజన ప్రాంతంలో, వెనుకబడిన ప్రాంతంలో కచ్చితంగా పూర్తిస్థాయిలో రెండు పంటలకు నీరందించడం జరుగుతుందనే విషయాన్ని సభకు తెలియజేస్తూ, ప్రభుత్వపరంగా అన్ని చర్యలను తీసుకుంటుందనే విషయాన్ని మరొకసారి సభకు తెలియజేస్తున్నాను.

**MR SPEAKER: Next Question No. 412 (36) Minister for Panchayat Raj**

**ప్రశ్న నంబర్: 412 (36)** శ్రీ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,ఎమ్మెల్యే

**గౌరవనీయులైన పంచాయతీరాజ్ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:-**

అ) జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించిందా;

ఆ) అయితే, వారిపై తీసుకున్న చర్యలేమిటి;

ఇ) దుర్వినియోగపర్చిన మొత్తాన్ని రికవరీ చేయడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటి?

**పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి (శ్రీ చింతకాయల అయ్యన్నపాత్రుడు) గారి సమాధానం:**

అ) లేదండి, అవినీతి కేసులను కనుగొన్నప్పుడల్లా సామాజిక ఆడిట్ విభాగంలో వీటిని కనుగొనిన మీదట అట్టి కార్యకలాపాలను నిరోధించడానికి ఒక పటిష్టమైన యంత్రాంగం

ఉంది. ఎన్ఆర్ఇజిఎస్- ఏపి లోని అన్ని పనులలో సామాజిక ఆడిట్ విభాగం విస్తృత తనిఖీని చేపడుతున్నది.

ఆ) సామాజిక ఆడిట్ విచారణలో కనుగొన్న విషయాలు మరియు ఇతర అవినీతి/ ఉల్లంఘన ఆరోపణల ఆధారంగా ఎన్ఆర్ఇజిఎస్ అమలులో పథకం ప్రారంభం నుండి గత 8సంవత్సరాలలో 3222 మంది క్షేత్ర సహాయకులను ప్రభుత్వం తొలగించింది.

ఇ) అవినీతి కారణంగా దోషిగా గుర్తించిన క్షేత్ర సహాయకులపై క్రిమినల్ కేసులను దాఖలు చేయడమే కాకుండా క్రమశిక్షణ చర్య, ఆర్థికపరంగా రికవరీ చేయడం, పారితోషికం/ వేతనం నుండి దుర్వినియోగపరిచిన మొత్తాన్ని మినహాయించడం మరియు రెవెన్యూ రికవరీ చట్టాన్ని అమలు పరచడం వంటి చర్యలను ప్రభుత్వం తీసుకుంటున్నది. ప్రభుత్వం పై చర్యల ద్వారా రూ.5,10,22,118/- (సుమారు రూ. 5.11 కోట్లు) ల మొత్తాన్ని రికవరీ చేసింది.

శ్రీ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి(అనపర్తి): అధ్యక్షా, జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద రాష్ట్ర వ్యాప్తంగా అనేక వందల కోట్ల రూపాయల పనులు జరుగుతున్నాయి. ఒక్కొక్క మండలంలోనే సుమారు ఐదారు కోట్ల రూపాయల పనులు జరుగుతున్న నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్స్ గానీ, టెక్నికల్ అసిస్టెంట్స్ గానీ, ఇంజనీరింగ్ కన్సల్‌టెంట్స్ గానీ అదే విధంగా ఏ.పి.ఓస్. గానీ, ఏ.పి.డిస్. గానీ ఉన్నప్పటికీ సరైన పర్యవేక్షణ కొరవడిన కారణంగా అవినీతి అక్రమాలు ఉపాధి హామీ పథకంలో జరుగుతున్నాయి. ప్రధానంగా గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా ఉపాధి హామీ పథకంలో అవినీతి అక్రమాలు జరిగాయి.

అధ్యక్షా, సామాజిక తనిఖీ క్రింద సోషల్ ఆడిట్ చేస్తున్నామని ఇందాక గౌరవ మంత్రి గారు సభలోచెప్పారు గానీ సక్రమంగా జరగడం లేదు. ఉపాధి హామీ పథకంలో టాప్ టు బోటం వరకు అధికారులు ఇన్వాల్వ్ అయిన కారణంగా అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేసే నాథుడేలేకుండా పోయారు. తద్వారా సామాజిక తనిఖీ కూడా సరైన రీతిలో జరగడం లేదనేది నగ్న సత్యం. ప్రధానంగా ఐ.ఎస్.ఎన్.ఎస్., గానీ, ఇందిరమ్మ పచ్చ తోరణం గానీ, మహాత్మాగాంధీ ప్లాంటేషన్ వంటి మూడు కార్యక్రమాల్లో తీవ్రమైన అవినీతి అక్రమాలు జరుగుతున్నాయి. క్షేత్ర స్థాయిలో జరిగిన అవినీతికి గానీ, సోషల్ ఆడిట్‌లో బయటకు వచ్చిన వాస్తవాలకు గానీ ఎటువంటి సంబంధం ఉండడం లేదు. అదేవిధంగా సామాజిక తనిఖీలో గుర్తించిన అవినీతి సిబ్బందిని సస్పెండ్ చేసి మళ్లీ ఒకటి, రెండు మాసాల వ్యవధిలోనే తిరిగి పోస్టింగ్స్ ఇవ్వడం జరుగుతోంది. ఆ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి కట్టుదిట్టమైన చర్యలను తీసుకోవాల్సిన అవసరముంది.

అధ్యక్షా, ప్రధానంగా మా నియోజకవర్గ పరిధిలో జరిగిన అవినీతి అక్రమాలపైన రెవెన్యూ రికవరీకి ప్రపోజ్ చేసినా, సదరు అవినీతిపై ఫీల్డ్ అసిస్టెంట్స్‌కు ఇంతవరకు ఇచ్చిన షోకాజ్ నోటీస్‌లపైన సరైన సమాధానం రాకపోవడం వల్ల ఐదారు మాసాల నుంచి ప్రభుత్వం ఎటువంటి చర్యలు అవినీతికి పాల్పడిన ఉపాధి హామీ పథకంలోని సిబ్బందిపైన తీసుకోలేదు. ఇప్పటికైనా సరే గౌరవ మంత్రి గారు ప్రత్యేక దృష్టి సారించి ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడిన సిబ్బందిపైన ప్రభుత్వ చర్యలు తీసుకోవాల్సిందిగా తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి: అధ్యక్షా, పథకంలో పచ్చ చొక్కా వాళ్లను జోడించడానికి అవినీతి ముద్ర వేసి సిబ్బందిపైన ఆరోపణలు చేస్తున్నారు. సిబ్బంది వారి విధి నిర్వహణను వారు నిర్వహిస్తున్నారు. కేవలం అధికార సభ్యులు రాజకీయ కోణంలో ఆలోచించి వారి పార్టీ కార్యకర్తలను పథకంలో చేర్చుకోవడానికే రాజకీయం చేస్తున్నారు తప్ప మరొకటి కాదు. అకారణంగా ఉన్నటువంటి ఉద్యోగస్తులనందరినీ అవినీతి నెపంతో తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. సోషల్ ఆడిట్ జరుగుతోంది. సోషల్ ఆడిట్ జరుగుతున్న సందర్భంలో వాళ్ల పార్టీ కార్యకర్త ఒకరు వెళ్లి మాకు పని చేయలేదని ఒక వ్యక్తి ఇచ్చినటువంటి ఫిర్యాదు ప్రకారం యాక్షన్ తీసుకుంటూపోతే ఎట్లా? అవినీతి అక్రమాలపైన విచారణ చేయండి. తప్పు చేసిన సిబ్బంది పైన చర్యలు తీసుకోండి. అంతేగానీ, తప్పు చేయని సిబ్బంది పైన కూడా అన్యాయంగా రాజకీయ కారణాలతో విధి నిర్వహణ నుంచి తొలగించడం ఎంతవరకు సమంజసమో కూడా ప్రభుత్వం ఆలోచన చేయాల్సిన అవసరముందనే విషయాన్ని సభ దృష్టికి తీసుకువస్తున్నాను.

శ్రీ చింతకాయల అయ్యన్నపాత్రుడు (నర్సీపట్నం): అధ్యక్షా, జాతీయ ఉపాధి హామీ పథకం కేంద్ర ప్రభుత్వం అమలు చేసినటువంటి పథకం. అయితే ఈ పథకం పేరు నిజానికి జాతీయ ఉపాధి హామీ పథకమైనప్పటికి రాజశేఖరరెడ్డి గారి హయాంలో ఆ పథకం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఉపాధి హామీ పథకమైంది.

(ప్రతిపక్షపార్టీ సభ్యులచేత సభకు అంతరాయం)

ఉపాధి హామీ పథకం కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఉపాధి కల్పించడం కోసమే ఈ పథకాన్ని అమలు చేయడం జరిగిందనేది సత్యం. ఆ విధంగానే ఆ పథకాన్ని గత ప్రభుత్వం దుర్వినియోగం చేయడం జరిగింది. కానీ, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని జాతీయ ఉపాధి హామీ పథకం యొక్క ప్రధాన లక్ష్యం రాష్ట్రంలో కూలీ దొరకని నిరుపేదలకు కూలీ లభించి తద్వారా ఉపాధి కల్పించాలని,కూలీలకు పని కల్పించాలనే ఒక మంచి ఉద్దేశంతో పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది.

అయితే, గత ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకం క్రింద కేవలం గుంతలు త్రవ్వి మట్టిని ప్రక్కకు నెట్టడం తప్ప వేరే ఇతర కార్యక్రమాలు జరగలేదనేది వాస్తవం. ఆ పథకంలో మార్పు చేసి పేదలకు కూలీ పని లభించి ఉపాధి కల్పించాలని, ప్రజలకు పనికొచ్చే కార్యక్రమాలను చేయాలని, తద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి అసెట్స్ క్రియేట్ చేయాలనే సంకల్పంతో గత ఏడు నెలలుగా ప్రభుత్వం ఆలోచన చేసి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన తరువాత చర్చించి, తద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ఈనాడు ఆ పథకం క్రింద కొన్ని కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడం జరిగింది. అందులో ముఖ్యమైనదేమిటంటే, గౌరవ ముఖ్యమంత్రి గారు రాష్ట్రంలో "నీరు - చెట్టు" కార్యక్రమానికి జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద వచ్చే నిధులను వాడుకోవాలని సంకల్పించడం జరిగింది. ఈ విషయం సభ్యులందరికి తెలిసిందే. అదే విధంగా హార్టికల్చర్ శాఖకు సంబంధించి నిరుపేద రైతులను రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించి వారికి కొబ్బరి, మామిడి మొక్కలను అందించడమే గాకుండా మూడు సంవత్సరాల కాలం వరకు కూడా ఆయా మొక్కలను సంరక్షించే బాధ్యతను ఆ పథకం క్రింద తీసుకోవడం జరిగిందనే విషయాన్ని తెలియజేస్తున్నాను. అంతేగాకుండా పంచాయతీ భవన నిర్మాణాలను, అంగన్‌వాడి భవన నిర్మాణాలను, సి.సి. రోడ్లను వేయడం గానీ, రైతులు పొలాల్లో వరి పంటను తూర్పు పట్టడానికి గాను అవసరమైన టార్పాలిన్లను అందించడానికి గాను పథకం క్రింద కేంద్రం నుంచి వచ్చే నిధులను ఉపయోగించుకోవడం జరిగిందనే విషయాన్ని తెలియజేస్తున్నాను. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా ఆస్తులను క్రియేట్ చేయాలనేదే ప్రధానోద్దేశం.

అధ్యక్షా, గతంలో చంద్రబాబునాయుడు గారి హయాంలో జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద గ్రామాల్లో ప్రభుత్వ ఆస్తులను క్రియేట్ చేయడం జరిగింది. కానీ గత కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రభుత్వ ఆస్తులను క్రియేట్ చేయడం కాదు, కేవలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆస్తులను క్రియేట్ చేయడానికే ఉపాధి హామీ పథకం నిధులను వెచ్చించడం జరిగింది. నేను వాస్తవాలను మాత్రమే వెల్లడిస్తున్నాను.

అధ్యక్షా, జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద జరుగుతున్న కార్యక్రమాల గురించి మనం ఒకసారి ఆలోచన చేస్తే, ఇప్పటి వరకు పథకానికి సంబంధించి ప్రభుత్వ దృష్టికి వచ్చిన ఫిర్యాదుల సంఖ్య 18,946. అందులో విచారణ పూర్తి అయినవి 17,817. ప్రభుత్వానికి అందిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని, విధుల నుంచి తొలగించిన సిబ్బంది సంఖ్య 3,222. పెనాల్టీస్ వేసిన వాటి సంఖ్య 12,028. అందులోనూ 2,561 మంది నిర్దోషులుగా తేలారు. సోషల్ ఆడిట్‌లో నిర్దోషులుగా తేలిన వారిని విడిచిపెట్టడం జరిగింది.

...

ఇప్పటివరకు 18,946 ఫిర్యాదులు ప్రభుత్వానికి వచ్చాయి. ఆ ఫిర్యాదుల్లో ఎక్వైరీని పూర్తి చేసినవి 17817 కాగా, ఆ ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకొని 3222 మందిని జాబుల నుండి ఇప్పటివరకు తొలగించడం జరిగింది. పనిష్మెంట్ ఇచ్చినవి, పనిష్మెంట్ అంటే పెనాల్టీస్

వేసినవి12028. సోషల్ ఆడిట్‌లో 2,560మంది నిరుద్యోగులుగా తేలారు. వారిని విడిచిపెట్టడం జరిగింది. ఎఫ్ఐఆర్ కేసులను బుక్ చేసినవి 36. ఛార్జ్ షీట్ దాఖలు చేసినవి 18 ఉన్నాయి. ఇంకా 1129 మంది పైన పెండింగు కేసులు ఉన్నాయి. వాటి మీద కూడా ఎంక్వైరీ చేయాల్సిన అవసరం ఉంది. ఈ కేసుల్లో సోషల్ ఆడిట్ జరిగిన తర్వాత, ఎంక్వైరీ చేసిన తర్వాత సుమారు రూ.17 కోట్లు అవినీతి జరిగిందని అంచనా వేసి, ఇప్పటి వరకు మేము రూ.5 కోట్ల రూ.10 లక్షలను వసూలు చేయడం జరిగింది. ఇంకా రూ.11కోట్లను వసూలు చేయాల్సి ఉంది. రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం వాళ్ల ఆస్తులను జప్తు చేసైనా ఏదో విధంగా వసూలు చేయాలని మేము ప్రయత్నం చేస్తున్నాం. దీంట్లో ఒక్క విషయాన్ని నేను సభాముఖంగా మనవి చేస్తున్నాను. దీంట్లో జరుగుతున్న అవినీతి పైన దృష్టిపెట్టడం జరిగింది. అవసరమైతే విధివిధానాలను మార్చడానికి కూడా ప్రయత్నం చేస్తున్నాం. దీనిని బ్రహ్మాండంగా అమలు చేయడం కోసం అందరూ సహకరించాల్సిందిగా కోరుతున్నాను.

రెండవదిగా నేను మనవి చేసేదేమంటే చాలా మంది సభ్యులు ఇక్కడ సభలో ఉన్నారు. సభ్యులందరూ కూడా బాధ్యతగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఎక్కడైనా మన ప్రాంతాల్లో ఇటువంటి కార్యక్రమాలు జరుగుతున్నప్పుడు శాసనసభ్యులు కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. దీంట్లో సీక్రేట్ ఏమి లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సోషల్ ఆడిట్ ఏ విధంగా జరుగుతుంది, సోషల్ ఆడిట్‌లో ఎన్ని కేసులు బుక్ అయ్యాయి, ఆ కేసులు తాలుకు పరిస్థితి ఏమిటీ అనేది మేము వెబ్‌సైట్లో పొందుపరచడం జరిగింది. ఆ వెబ్‌సైట్‌ను మీరు పరిశీలించి, ఎక్కడైనా మీ ప్రాంతాల్లో ఇటువంటి అవినీతి కార్యక్రమాలు జరుగుతున్నట్లు మీరు గమనించినట్లయితే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినట్లయితే తప్పకుండా చర్యలు తీసుకుంటామని తమరి ద్వారా గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను.

శ్రీ జి.శ్రీకాంత్‌రెడ్డి : అధ్యక్షా, అయ్యన పాత్రుడు గారు మంచి అనుభవం కలిగిన మంత్రివర్యులు. తను ఎందుకు కన్ఫ్యూజ్ అయ్యారో నాకు అర్థం కావడం లేదు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ఎందుకు ప్రవేశపెట్టిందంటే, వలస వెళ్లకుండా కూలీలకు స్థానికంగా ఉపాధిని కల్పించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన పథకం ఇది. తాను మరి గతంలో ఉన్న వివరాలను పూర్తిగా చూసుకున్నారో లేదో, కరువు ప్రాంతాల్లో విపరీతంగా వలసలు ఉన్నాయి. ఈరోజు కరువుతో అలమటిస్తున్న జిల్లాల్లో రైతులు కూడా ఆ కూలి పనులకు వెళ్లే పరిస్థితి కనిపిస్తోంది. అటువంటి పథకాన్ని తనేదో మట్టి తీసి అటు వేయాలి, ఇటు వేయాలి అన్న దాని మీద పర్మనెంట్ స్ట్రక్చర్ జరగాలని గతంలో రాజశేఖరరెడ్డి గారు కూడా సిసి రోడ్లు, ఒహెచ్ఎస్‌ని నిర్మించాలని ఆలోచన చేశారు.

(అంతరాయం)

దానిని వీళ్లు తప్పుత్రోవ పట్టించే విధంగా మాట్లాడటం ఎంత వరకు సమంజసమో అనేది వాళ్లకే ఒదిలేస్తున్నాను. సోషల్ ఆడిట్ విషయంలో పారదర్శకంగా చేయండి. అవినీతి చేసిన వాళ్లను తొలగించండి. అంతేగాని, ఆ ముసుగులో మీరు దూరి అవినీతి చేయాలని ఆలోచన చేయడం శ్రేయస్కరం కాదు. అదే విధంగా ఎన్ఆర్ఇజిఎస్‌కి సంబంధించిన వాటిల్లో మరుగుదొడ్లు అంటున్నారు. అది మంచి స్కీం దానిని ప్రోత్సహించండి. దానికి వచ్చే నిధులను కేటాయించే విధంగా చూడండి. దానితోబాటు మీరు స్పష్టంగా చెప్పాల్సిందేమంటే ఉపాధి హామీ పథకాన్ని కూలీలకు లేకుండా చేయాలని మీరు ఆలోచన చేస్తున్నారా? సమాధానం చెప్పాల్సిందిగా గౌరవ మంత్రి గారిని తమరి ద్వారా కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ : శ్రీకాంత్‌రెడ్డి గారు మీరు కార్మికుల తరఫున మాట్లాడితే సంతోషం. కానీ ఫీల్డ్ అసిస్టెంట్స్‌ని టచ్ చేయకూడదు, వాళ్లంతా చాలా నీతిమంతులు అనే విధంగా మాట్లాడారు. ఎందుకంటే, because we are also there looking after the programme. ఎందుకంటే వలసలు వెళ్లకుండా కార్మికులకు పని కల్పించడం తప్పు కాదు కరెక్ట్ అది. కానీ ఒకప్పుడు asset creation is also equally important. ఇప్పుడు మీరు ఏమంటున్నారంటే ఎసెట్ క్రియేషన్ లాస్ట్ ప్రయారిటీ వాళ్లకు పని కల్పించడం ఫస్ట్ ప్రయారిటీ అంటున్నారు. దానితో ఎసెట్ క్రియేషన్ సఫర్ అవుతుంది. కార్మికులకు పని కల్పించాలి, కానీ వాళ్ల మీద పెత్తనం చేసే ఫీల్డ్ అసిస్టెంట్లు ఆపర్చ్యునిటీని ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్నారనేది సర్వత్రా వినబడుతున్న వాస్తవం.

శ్రీ సి.హెచ్.అయ్యన్నపాత్రుడు : అధ్యక్షా, శ్రీకాంత్ రెడ్డి గారు చెప్పిన దానిని నేను డిస్ప్యూట్ చేయడం లేదు. పేదవాడికి పని కల్పించాలనేది పథకం తాలుకు ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశం. మా ఆలోచన ఏమంటే పేదవాళ్లకు పని కల్పిస్తూ ఆస్తులను కూడా క్రియేట్ చేయాలన్నది మా ఉద్దేశం. ఆ దిశగా మేము ప్రయాణం చేస్తున్నాం. ఇవాళ ఆ దిశగా మేము ప్రయాణం చేస్తున్నప్పుడు సోషల్ ఆడిట్ గురించి చెప్పారు. సోషల్ ఆడిట్‌ను ఏవిధంగా చేస్తున్నామనే వివరాలను ఇంటర్‌నెట్‌లో పెట్టాము. దానిని మీరు పరిశీలన చేయండి. ఏదైనా ఉంటే మా దృష్టికి తీసుకురండి పరిష్కరించడానికి మేము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తమరి ద్వారా మనవి చేస్తున్నాను.

**ప్రశ్న నెం.486 (37)**

**సర్వశ్రీ ఎస్.మోహన్‌రెడ్డి,**
**కె.వి.ఆర్.మూర్తి,**
**భూమా అఖిల ప్రియ,**
**డా.బి.జయనాగేశ్వరరెడ్డి, ఎంఎల్ఏలు**

గౌరవనీయులైన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) తెలంగాణ ప్రాంతంలోని బుడగ జంగాల కులాన్ని సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీలుగా గురించిన విషయం వాస్తవమేనా?

ఆ) రాష్ట్ర విభజన తర్వాత మన రాష్ట్రంలో వారిని ఎస్సీలుగా గుర్తించే ప్రతిపాదన ఏదైనా ప్రభుత్వం దగ్గర ఉందా?

ఇ) అయితే, ఈ విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటి?

ఈ) మన రాష్ట్రంలో బుడగ జంగాల కులానికి చెందిన ప్రజలు ఎంత మంది ఉన్నారు?

ఉ) ఇప్పటి వరకు వారికి ప్రభుత్వం ఏవేని కుల ధృవపత్రాలను జారీ చేసిందా?

గౌరవనీయులైన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి (శ్రీ రావెల కిషోర్‌బాబు)

అ) అవునండీ.

బుడగ జంగం లేదా బెడ జంగం అనే వారిని 1956కి ముందు రెండు రాష్ట్రాలుగా ఉన్నప్పుడు నైజాం స్టేట్, మద్రాస్ ప్రెసిడెన్సీ ఉన్నప్పుడు నైజాం స్టేట్‌లో 1950వ సంవత్సరం ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ద్వారా బుడగ జంగాలను ఎస్సీలుగా గుర్తించడం జరిగింది. ఆ తర్వాత రెండు రాష్ట్రాలు కలిపి ఒక రాష్ట్రంగా 1956వ సంవత్సరంలో ఏర్పడిన తర్వాత, ఈ బుడగ జంగాలు లేదా బెడ జంగాల వారిని ఎస్సీలుగా కేవలం తెలంగాణ ప్రాంతంలో ఉన్న జిల్లాలకు మాత్రమే పరిమితం చేశారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన జిల్లాల్లో వీరిని ఎస్సీలుగా గుర్తించలేదు. ఆ తర్వాత 1976లో 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌కి లేదా 1956లో వచ్చిన అమెండ్‌మెంటు ఆర్డర్‌కి మరలా అమెండ్‌మెంటు జరిగింది. అప్పుడు ఈ రిస్ట్రిక్షన్‌ని ఎత్తివేశారు. ఈరోజున ఉన్న రెండు రాష్ట్రాలకు సంబంధించిన జిల్లాల్లో వీరిని ఎస్సీలుగా గుర్తించడం జరిగింది. ఆ తర్వాత వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ ప్రొవిజన్‌ని మిస్‌యూజ్ చేస్తున్నారని భావించి 2002లో మరలా మరొక అమెండ్‌మెంటు జరిగింది. ఆ తర్వాత మరలా ఈ రిస్ట్రిక్షన్‌ని అనగా తెలంగాణా జిల్లాల్లో మాత్రమే బుడగ జంగాలు లేదా బెడ జంగాల వారిని ఎస్సీలుగా గుర్తించడం అన్న రిస్ట్రిక్షన్‌ని రీఇంపోజ్ చేశారు. అంతకు ముందేమో మొత్తం ఆంధ్రప్రదేశ్‌కి ఉండేది మరలా తెలంగాణా జిల్లాలకు మాత్రమే పరిమితం చేశారు. ఆ తర్వాత 2014లో మొన్న వచ్చిన రీఆర్గనైజేషన్ యాక్ట్‌లో మరలా బుడగ జంగాల వారిని తెలంగాణా రాష్ట్రంలోనే ఎస్సీలుగా గుర్తించడం జరిగింది. క్రొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బుడగ జంగాల వారిని ఎస్సీలుగా గుర్తించలేదు.

ఆ మరియు ఇ) బుడగ జంగం, బెడ జంగాల వారిని ఎస్సీలుగా గుర్తించే అంశాన్ని పరిశీలించడానికి ఒక వన్ మేన్ కమీషన్‌ని ప్రభుత్వం వేస్తుంది. ఆ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

ఈ) 2001 జనాభా లెక్కల ప్రకార వారి యొక్క జనాభా 16,113 మంది ఉన్నారు.

ఉ) లేదండీ.

శ్రీ ఎస్.వి.మోహన్‌రెడ్డి(కర్నూలు) : అధ్యక్షా, బుడగ జంగాల వారి సమస్య చాలా తీవ్రమైన సమస్య. ఇందాక మంత్రి గారు కూడా చెప్పారు. వాళ్లకు ఎటువంటి సర్టిఫికెట్లను ఇవ్వడం లేదు. వాళ్లందరూ సంచార జాతులుగా ఉన్నారు. వాళ్లందరూ కూడా యాచకత్వం మీద ఆధారపడి జీవనం సాగించే వారు. వాళ్లను 2002 వరకు ఎస్సీలుగా గుర్తించారు. 2002 నుండి 2008 వరకు కూడా వాళ్లకు సర్టిఫికెట్లను ఇచ్చారు. తర్వాత ఓంగోలు జిల్లా సంతనూతలపాడు ఎమ్మెల్యే సాంబయ్య గారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2008 నుంచి స్టాప్ చేయడం జరిగింది. ఆ రోజు 1950లో, కేవలం 10 జిల్లాలకే పరిమితమై ఉన్నారంటే, ఆరోజు 13 జిల్లాల వారు మద్రాసు రాష్ట్రంలో కలిసి ఉన్నారు కాబట్టి, ఆరోజు లేదు తర్వాత కలపడం జరిగింది. మంత్రి గారు కూడా ఆ విషయాన్ని చెప్పడం జరిగింది. తర్వాత 2010లో కూడా ఈ సమస్య మీద మోతీలాల్ నాయక్ అనే రిటైర్డ్ జడ్జ్ గారి ఆధ్వర్యంలో ఒక కమిటీని వేశారు. కానీ ఆ కమిటీ ఇంతవరకు ఎటువంటి పర్యటనలు చేయలేదు, ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

...

తరువాత దీని మీద 2012వ సంవత్సరంలో నారా చంద్రబాబు నాయుడు గారు అప్పుడున్న ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి గారికి ఒక లేఖ రాశారు. మహబూబ్‌నగర్ జిల్లా కర్నూలు జిల్లాకి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. అలాగే మిగతా ప్రాంతాలన్నింటిలో బుడగ జంగాలు యాచకత్వం మీద ఆధారపడే వాళ్లున్నారు. వాళ్లందర్నీ ఎస్సీ కులంలో కలపాలని స్వయంగా చంద్రబాబు నాయుడు గారే కిరణ్ కుమార్ రెడ్డి గారికి లేఖ రాశారు. కాబట్టి ఈ కమిటీల ద్వారా కాలయాపన చేయకుండా చంద్రబాబు నాయుడు గారు అపారమైన అనుభవం ఉన్న నాయకుడు కాబట్టి అన్ని ఆలోచించి, అన్నీ క్షుణ్ణంగా పరిశీలించే లేఖ రాసి వుంటారు కాబట్టి మరలా దాని మీద కమిటీ వేయాల్సిన అవసరం లేకుండా వారిని ఎస్సీల్లో చేర్చడానికి అనుమానం ఉందా, ఒకవేళ వాళ్ల నాయకుని అనుభవం మీద వాళ్లకేమన్నా అనుమానం ఉందా తెలియచేయాలి.

శ్రీ పి.విష్ణుకుమార్ రాజు(విశాఖపట్నం-నార్త్): అధ్యక్షా, మందల కమ్యూనిటీ అని వాళ్లు కనీసం 20 సంవత్సరాల నుంచి ఆ కమ్యూనిటీని కూడా ఎస్టీలో చేర్చమని వారు

విన్నవించుకోవడం జరిగింది. అన్ని ప్రభుత్వాలకి కూడా వారి విన్నపాలు రీచ్ కాలేదు. గౌరవ మంత్రివర్యులను కన్సిడర్ చేయాలని తమరి ద్వారా కోరుతున్నాను.

శ్రీ గొల్లపల్లి సూర్యారావు(ధర్మవరం): సార్, బుడగ జంగాలనే ఈ కులస్తుల జీవన విధానం చూస్తే చాలా దుర్భరమైన, హృదయవిదారకమైన పరిస్థితిలో జీవించే ఒక జీవన విధానం కలిగిన కులస్తులు. మంత్రి గారు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఈ బుడగజంగాల స్థితిగతుల్ని గమనించి అప్పుడున్న ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఎస్సీలుగా గుర్తించిన విషయం వాస్తవం. అదే విధంగా 1976వ సంవత్సరంలో ఈ తెలంగాణ ప్రాంతం, ఆంధ్ర ప్రాంతం అనే రెండు ప్రాంతాల్లో ఆంధ్ర ప్రాంతంలో ఉన్న వారిని గుర్తించకపోవడం అదే విధంగా తెలంగాణ ప్రాంతంలోని బుడగజంగాలను షెడ్యూల్డ్ కులాలుగా గుర్తించడం ఇది జరిగిన పరిణామం. మంత్రి గారు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బుడగ జంగాల యొక్క స్థితిగతుల్ని గమనిస్తూ వాళ్లని ఏ రకమైన కేటగిరిలో పెట్టాలనే ఆలోచనతో ఉంది. సింగిల్ మేన్ కమిటీని వేశామన్నారు. నేను ఏమంటున్నానంటే రాజోలు నియోజక వర్గంలో కూడా ఈ బుడగజంగాలు సుమారు రెండు వేల మంది ఉన్నారు. పిల్లలు స్కూలులో చదువుకునే సందర్భాల్లో ఇతరత్రా సందర్భాల్లో ప్రభుత్వం నుంచి ఏమైనా రాయితీలు ఇవ్వాల్సిన సందర్భాల్లో వాళ్లు చాలా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. అందువలన త్వరితగతిన ఏ మాత్రం కాలయాపన చేయకుండా ప్రభుత్వం తగిన డైరెక్షన్స్ సింగిల్ మేన్ కమిటీకి ఇచ్చి వెంటనే రిపోర్టుని రప్పించుకుని ప్రభుత్వం ఏమైతే ఆలోచిస్తుందో ఆ ఆలోచనని తప్పకుండా వీరిపట్ల సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాను.

శ్రీ రావెల కిషోర్ బాబు(ప్రత్తిపాడు): అధ్యక్షా, గౌరవ శాసన సభ్యులు చెప్పిన విధంగా సింగిల్ మేన్ కమీషన్ ద్వారా వచ్చే రిపోర్టులని పరిశీలించి వెంటనే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాము. ఇది కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న అంశము.

**MR.SPEAKER: Question No.494 (38) is postponed at the request of the Member.**

**Next Question No.472 (39) Minister for Finance.**

**ప్రశ్న నెం.472 (39)**

సర్వశ్రీ /శ్రీమతి కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి, ఆర్.కె.రోజా, గౌరు చరితా రెడ్డి, రాజన్నదొర పీడిక, భూమా నాగిరెడ్డి, వెంకట సుజయ కృష్ణ రంగారావు, ఎం.ఎల్.ఏ.లు,

గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారు దయచేసి ఈ క్రింద సమాచారం తెలియజేస్తారా ;

అ) ప్రభుత్వ సంక్షేమ పథకాల క్రింద ప్రయోజనాలు అందించేందుకు అర్హత గల వ్యక్తులను ఎంపిక చేయడానికి కొంత మంది అనధికార వ్యక్తులను సభ్యులుగా నియమించిన విషయం వాస్తవమేనా ;

ఆ) ప్రభుత్వం నియమించిన అట్టి కమిటీలకు రాజ్యాంగ చెల్లుబాటు ఉన్నదా ;

ఇ) ప్రభుత్వ కమిటీలలో అనధికార వ్యక్తుల నియామకం వల్ల అర్హత గల లబ్ధిదారులకు అన్యాయం జరుగుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా ;

ఈ) కమిటీలు సక్రమంగా పనిచేసేలా చూసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటి ?

**ఆర్థిక శాఖ మంత్రి (శ్రీ యనమల రామకృష్ణుడు) : (గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారి తరఫున)**

అ) అవునండీ.

ఆ) అవునండీ.

రాష్ట్ర ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వం నిర్దిష్టపరచిన కార్యక్రమ పథకం మార్గదర్శకాల ప్రకారం వారిని నియమించడమైనది.

ఇ) లేదండీ.

ఈ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి(నెల్లూరు రూరల్)ః అధ్యక్షా, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు అనధికార వ్యక్తులను నియమించారా అని అడిగితే మంత్రి గారు లేదండీ అని సమాధానమిచ్చారు. అధ్యక్షా, ఈ శాసన సభలో "సత్యమేవ జయతే" అన్న సూక్తి నాకంటే మంత్రి గారికి బాగా కనబడుతున్నది. ఆ సూక్తిని చూస్తూ కూడా అసత్యాలను మంత్రి గారు ఈ సభకు చెప్పారు. వ్యక్తులుగా మనం శాశ్వతం కాదు, పదవులు శాశ్వతం కాదు, అధికారులు శాశ్వతం కాదు. వ్యవస్థ శాశ్వతం. రేపటిరోజు వాళ్లు ఇటు రావచ్చు, మేము అటు వెళ్లవచ్చు. కానీ, ఈ శాసనసభలో మనం నెలకొల్పే సాంప్రదాయాలు శాశ్వతం. దుస్సాంప్రదాయాలకి మనం తెరతీయకూడదు. ఈ శాసన సభలో మనం నెలకొల్పే సాంప్రదాయాలు వ్యవస్థని కుప్పకూల్చకూడదు. ఈరోజు అధికార వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ రెండూ వేరు వేరు వ్యవస్థలు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఏవైతే సాధారణ

సభ్యత్వాలున్నాయో చాలా పద్ధతిగా ఉంటాయి. నేను చాలా మందికి చెబుతుంటాను. తమిళనాడులో డిఎంకే పార్టీ, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ ఈ రెండూ రాజకీయ పార్టీలు కార్యకర్తలకు సమాచార సేకరణ, వారికి గుర్తింపు కార్డు ఇచ్చే విషయంలో చాలా పకడ్బందీగా ఉంటుందని భావించాను. ముఖ్యమంత్రి గారి పక్షాన సమాధానమిచ్చిన మంత్రి గారిని నేను అడిగేది ఒక్కటే ఈరోజు సామాజిక కార్యకర్తల ముసుగులో, సామాజిక కార్యకర్తల పేరుతో మీరు నియమించిన ప్రతీ కార్యకర్త తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక సభ్యులు కాదా? కాదని మంత్రి గారు చెప్పగలిగితే ఆ విధంగా మంత్రి గారు నిరూపించగలిగితే మీరు ఏ చర్య తీసుకున్నా నేను సిద్ధం. కానీ ఈరోజు సామాజిక కార్యకర్తల ముసుగులో మీరు నియమించిన ప్రతీ ఒక్క కార్యకర్త తెలుగుదేశం పార్టీ కార్యకర్త. ఈరోజు దీని వలన వ్యవస్థకి చాలా నష్టం జరుగుతున్నది. ముఖ్యంగా గ్రామాల్లో అశాంతి, అరాచకం ఏర్పడుతుంది. దీని వలన వాళ్లకు కూడా ఉపయోగం లేదు. ఎందుకంటే ఆ గ్రామాల్లో ఎవరైతే ఎంపిక కాలేదో వాళ్ల శాపనార్థాలు తప్ప వాళ్లకేమీ మిగలదు. ఈరోజు రాష్ట్రంలో దేవస్థాన కమిటీలున్నాయి, మార్కెట్ కమిటీలున్నాయి. ఇంకా అనేక పదవులున్నాయి. జెండా మోసిన కార్యకర్తలకి ఆ పదవులు ఇచ్చేందుకు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా ఎందుకు ఆలస్యం చేస్తున్నదో నాకు అర్థం కావడం లేదు. కానీ ఇలాంటి వ్యవస్థలని కుప్పకూల్చడంలో ఇలాంటి వ్యవస్థల్లో అధికార వ్యవస్థకి, రాజకీయ వ్యవస్థకి మధ్య ఉండే ఒక గీతని పూర్తిగా చెరిపేసి వ్యవస్థలో ఒక కొత్త దుస్సంప్రదాయాన్ని దయచేసి... (మైకు కట్ చేయబడింది)

మిస్టర్ స్పీకర్ః రాజన్న దొరగారూ....

శ్రీ పీడిక రాజన్నదొర (సాలూరు) ః అధ్యక్షా,

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిః అధ్యక్షా, ఒక్క మాట చెబుతాను.

మిస్టర్ స్పీకర్ః ఇప్పటికే 10.30 గం.లు అయింది. మీరు కోఆపరేట్ చేయకపోతే ఎట్లా? Please conclude.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిః అధ్యక్షా, నేను చివరిగా ఒక మాట చెబుతున్నాను. సామాజిక కార్యకర్తల పేరుతో ప్రభుత్వం నియమించిన ప్రతీ ఒక్కరూ తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్తలే. కాదని ముఖ్యమంత్రి గారి తరఫున చెప్పిన మంత్రి గారిని చెప్పమనండి.

శ్రీ పీడిక రాజన్నదొర(సాలూరు)ః అధ్యక్షా, నేను కోరేది ఒక్కటే. మీరు కమిటీలు వేసేటప్పుడు సామాజిక కార్యకర్తలుంటున్నారు. సమాజ సేవ చేసే వాళ్లున్నారు. అనేక మంది ఉంటున్నారు. వాళ్లను పెట్టుకుని ఒక కమిటీ ఏర్పాటు చేసి ఆ కమిటీ ద్వారా అటు హరిజనులు

కావచ్చు, గిరిజనులు కావచ్చు, బీసీలు కావచ్చు, ఎస్సీ కార్పోరేషన్ కావచ్చు, ఎస్టీ కార్పోరేషన్ కావచ్చు, బీసీ కార్పోరేషన్ కావచ్చు వీటన్నింటి ద్వారా మనం లోన్లు ఇస్తాము కాబట్టి చేసే కార్యక్రమం వారి ద్వారా చేస్తే బాగుంటుంది. ఈ మధ్యన హైకోర్టు కూడా దానిని restrain చేసింది. ప్రభుత్వం ఉన్నత న్యాయస్థానం కూడా మందలించే పరిస్థితికి వెళ్లిందంటే ఒకసారి గౌరవ ముఖ్యమంత్రి గారు, ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరముంది. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే లోన్ల విషయంలో కూడా ఆయా కార్పోరేషన్లలో కనీసం ఒక్క ఎస్సీ, ఎస్టీ మెంబర్లు ఉండటం లేదు. మా నియోజక వర్గంలో కూడా ఆ పరిస్థితి ఉంది. నేను చెప్పింది తప్పైతే నేను రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నాను.

...

మిస్టర్ స్పీకర్ ః మినిస్టర్ గారు..

(ఈ దశలో ప్రతిపక్ష సభ్యులు శ్రీమతి ఆర్.కె.రోజా మట్లాడేందుకు మైకు ఇవ్వాల్సిందిగా కోరుతూ తమ స్థానం నుండి లేచి నిలుచున్నారు )

శ్రీ యనమల రామకృష్ణుడు (ఆర్థిక శాఖా మంత్రి) ః అధ్యక్షా, గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పాము. అనుబంధ ప్రశ్న విషయమై, ఈ కమిటీలను ప్రభుత్వం వేసింది. ప్రభుత్వం అంటే ఇది రాజ్యాంగ పరంగా ఎన్నిక కాబడిన ప్రభుత్వం. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం, పనిచేయవలసిన ప్రభుత్వం మరియు పని చేయించవలసిన ప్రభుత్వం కూడా ఈ ప్రభుత్వం. అందుచేత పనిచేయించడం ఎట్లా అనేది చూసిన తరువాత ఈ కమిటీలను వేయడం జరిగింది. అంతకు ముందు చాలా కమిటీలు వేశారు వాటన్నింటి జోలికి నేను పోదలచుకోలేదు. గౌరవ సభ్యులు మాట్లాడుతూ చాలా వేదాంతం మాట్లాడారు. వేదాంతాల్లోకి వెళితే చాలా మాట్లాడాల్సి వస్తుంది. అదంతా అనవసరం. కమిటీలు వేశాం ఆ కమిటీల్లో గ్రామ సర్పంచ్ అధ్యక్షులుగా ఉంటారు. ఆ ఊరు సర్పంచ్ ఏ పార్టీ అయినా సంబంధం లేదు. ఆ సర్పంచ్ ఆ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారు. ఆయన ఎస్‌సీ, కావచ్చు, ఎస్టీ కావచ్చు, మహిళా సర్పంచ్ కావచ్చు బీసీ కావచ్చు అందులో డిస్ప్యూట్ ఏమిలేదు. తరువాత ఎంపీటీసీలను, జడ్పీటీసీలను కూడా వేయడం జరిగింది. కానీ గౌరవ సభ్యులు అడిగేదేమంటే ఎంపీటీసీలు, జడ్పీటీసీలను మా వాళ్లను వేస్తేనే అనే ఆర్గ్యుమెంట్ సరైంది కాదు. ప్రభుత్వానికి సర్వ హక్కులు ఉన్నాయి. కావల్సినటువంటి వాళ్లను అక్కడ పనిచేసే వారిని ప్రజలలో ఉంటూ ప్రజలకు సహకారం చేసేటువంటి వాళ్లను మాత్రమే వేయడం జరిగింది. ఇందులో రెండవ ఆలోచన ఏమి లేదు. మాకుండేటువంటి అధికారాన్ని ఉపయోగించుకున్నాం.

**MR.SPEAKER : Question No.461 (40) Minister for Forests**

(ఈ దశలో ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం)

MR.SPEAKER : Please be seated.

శ్రీ జ్యోతుల నెహ్రూ(జగ్గంపేట) : అధ్యక్షా సామాజిక కార్యకర్తల నియామకం గురించి మంత్రి గారు చాలా చక్కగా చెప్పారు. ప్రభుత్వం మాది, ప్రభుత్వానికి సర్వ హక్కులు ఉన్నాయి అన్నారు. ప్రభుత్వం మీది కాదు మనది. మనది అనే భావానికి మీరు వస్తే ఈ సమస్యలు ఉత్పన్నం కావు.

(అధికార పక్ష సభ్యులచే అంతరాయం )

వినండి, మనది అనే భావాని మీరు వస్తే ఈ సమస్యలు ఉత్పన్నం కావు. జడ్పీటీసీలను వేశామన్నారు. మీరు జడ్పీటీసీలను ఎవరిని వేశారు. గ్రామ కమిటీలల్లో సర్పంచ్‌ను వేశారు మంచిది. సర్పంచ్‌తో సరిపెడుతూ, సామాజిక కార్యకర్తలు అనే ముసుకులో తెలుగు దేశం పార్టీ, ఎన్నికల్లో పోటీ చేసి ప్రజలు తిరస్కరించి వ్యక్తులు, కనీసం వార్డు మెంబరుగా కాని వ్యక్తులను వీరు ఈ కమిటీల్లో సభ్యులుగా వేశారు.

MR.SPEAKER : OK. Express your protest.

శ్రీ జ్యోతుల నెహ్రూ : చెప్పనీయండి సార్, నేను ఎందుకు ప్రొటెక్ట్ చేస్తున్నానో కూడా చెప్పనీయండి. ఈ కమిటీలనే వ్యవస్థలను స్థానిక సంస్థల్ని నిర్వీర్యం చేయడానికి ఉద్దేశకపూర్వకమైన ఆలోచనతో మీరు చేసిన కార్యక్రమం తప్పా వేరేది కాదు. ఇది కోర్టులో ఉంది. కోర్టులు కూడా ప్రభుత్వాన్ని కామెంట్ చేసిన పరిస్థితి ఉంది. దీనిని సామాజిక కార్యకర్తలు అనే విధానంతో పచ్చ చొక్కాలకు అవకాశం కల్పిస్తూ స్థానిక సంస్థల్ని నిర్వీర్యం చేయడానికి చేసే కార్యక్రమంగా మేము దీనిపై నిరసన తెలియజేస్తూ, సభ నుండి వాక్ అవుట్ చేస్తునాం.

(ఈ సందర్భంలో ప్రతిపక్ష సభ్యులు సభనుండి బయటకు వెళ్లారు.)

శ్రీ యనమల రామకృష్ణుడు : అధ్యక్షా పచ్చచొక్కా వాళ్లతో కమిటీలు వేస్తే రాష్ట్రం అంతా పచ్చగా ఉంటుంది కాబట్టి వేశాం. కానీ దోపిడీ దార్లతో కమిటీలు వేస్తే దోపిడీ చేస్తారు. దోపిడీ దారులందరినీ తీసివేసి తెలుగుదేశం పార్టీకి సంబంధించిన వారిని కానీ సోషల్ వర్కర్స్ ప్రజల సేవ చేసే వారందరితో కమిటీలు వేయడం జరిగింది.

**MR.SPEAKER : Question No.461 (40) Minister for Forests.**

**ప్రశ్న నం. 461 (40).**
**సభ్యులు శ్రీ అయితాబత్తుల ఆనందరావు.**

**గౌరవనీయులైన అడవులు, పర్యావరణం, శాస్త్ర మరియు సాంకేతిక విజ్ఞానశాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా.**

అ) ఓఎన్‌జిసి, జిఏఐఎల్, సిఏఐఆర్ఎస్ మరియు జిఎస్‌పిసి వంటి ఆయిల్ కంపెనీలు చేపడుతున్న కార్యకలాపాల కారణంగా కోనసీమలో అనేక గ్రామాలకు కలుగుతున్న వివిధ రకాల కాలుష్యాలపై ప్రభుత్వానికి ఏదైనా నివేదికను సమర్పించడమయిందా.

ఆ) అయితే, ఆ వివరాలేమిటి.

ఇ) సదరు కాలుష్యంపై అనేక ప్రజా సంస్థలు ఆందోళనను వ్యక్తపరుస్తున్నందున ప్రభుత్వం ఈ విషయంలో సమగ్ర విచారణ జరుపుతున్నదా.

ఈ) గత పది సంవత్సరాలలో ఈ విషయం గురించి గత ప్రభుత్వం ఏమైనా చర్యలను తీసుకున్నదా?

**అడవులు, పర్యావరణం, శాస్త్ర మరియు సాంకేతిక విజ్ఞాన శాఖ మంత్రి శ్రీ బి.గోపాలకృష్ణారెడ్డి గారి సమాధానం**

అ) లేదండీ.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఇ) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆయిల్ కంపెనీలను నిరంతరంగా పర్యవేక్షిస్తున్నది.

ఈ) లేదండీ.

మిస్టర్ స్పీకర్ ః ఆనందరావు గారు..

శ్రీ అయితాబత్తుల ఆనందరావు(అమలాపురం) ః మా కోనసీమ ప్రాంతంలో గడచిన 30సంవత్సరాలుగా ఆయిల్ కంపెనీలు వారి కార్యక్రమాలు కొనసాగిస్తున్నాయి. ఇది చాలా ప్రాముఖ్యత కలిగిన విషయం. క్రాప్ హాలిడే సందర్భంలోనూ మీరు చూశారు, దానితో కూడా సంబంధం ఉంది. మంత్రి గారిని నేను కోరేది ఏమనగా దీనిపై దృష్టి సారించాల్సిందిగా

కోరుతున్నాను. ఓఎన్‌జీసి వారు కమీషన్‌గా ఉన్నప్పుడు కొంత మేర నాణ్యతా ప్రమాణాలతో కార్యక్రమాలు చేపట్టే వారు. ఓఎన్‌జీసీ కార్పోరేషన్‌గా ఏర్పడిన తరువాత లాభ నష్టాలు బేరీజు వేసుకొని షేర్ మార్కెట్‌గా వారు వెళ్లిన తరువాత లాభాలను దృష్టిలో ఉంచుకొని నాసి రకపు పనులు చేపట్టడం జరుగుతోంది. తద్వారా అనేక రకాలైన కాలుష్యాలు మా ప్రాంతంలో నెలకొన్నాయి.

(ఈ సందర్భంలో ప్రతిపక్ష సభ్యులు తిరిగి సభ లోపలికి ప్రవేశించారు.)

ముఖ్యంగా చెప్పాలంటే ఎప్పుడైతే Oil Exploration Policy వచ్చిందో ఈ పాలసీలో ఎవరికైతే ప్రభుత్వం చమురు త్రవ్వకాలకు కాంట్రాక్ట్ ఇస్తుందో ఆ కాంట్రాక్ట్ ఇచ్చే వారికి తీసుకునే వారికి తప్ప ఆ ప్రాంతాల్లోని భూములు, పనిదినాలు కోల్పోయే రైతులు, కార్మికులు కానీ తద్వారా వచ్చే కాలుష్యం గురించి కానీ ఈ Oil Exploration Policy లో పొందు పర్చలేదు. అలానే సముద్ర జలాలపై అమలాపురం మిగిలిన నియోజక వర్గాల్లోని కోనసీమలో ఈనాడు చమురు కంపెనీలు రిగ్స్ ద్వారా డ్రిల్లింగ్స్ చేస్తున్నాయి.

డ్రిల్లింగ్ సమయంలో వచ్చే ముడి చమురునంతటిని సముద్ర జలాల్లోకి వదిలిపెడుతున్నారు. తద్వారా పొల్యూషన్ బారినపడి మత్స్యసంపద చనిపోతున్నాయి. తదనుగుణంగా మత్స్యకారులకు చేపలు దొరకడం లేదు. అలాగే ఇటువంటి కార్యక్రమాలు చేపట్టిన కారణంగా కోనసీమ ప్రాంతంలో 30 నుండి 40 వరకు బావులు సముద్రంలో ఉండగా వాటికి సంబంధించి చమురు కంపెనీల బోట్స్ రాకపోకల కారణంగా మత్స్యకారుల వేట కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడుతోంది.

సముద్ర జలాలతోపాటుగా ఏవైతే సముద్రంలో నుండి వడ్డుకు ఉన్నటువంటి పైప్‌లైన్స్ వలన సముద్ర నీటి ప్రవాహం గతి తప్పి సముద్రజలపు ప్రవాహం చేత నేల కోతకు గురౌతోంది. అలాగే రైతులు కూడా కోనసీమలోని రైతుల పొలాల్లో మీటరు నుండి రెండు మీటర్ల లోతున గ్యాస్ పైప్‌లైన్స్, క్రూడాయిల్ పైప్‌లైన్స్ ఉన్నాయి. (బెల్ )

ఆ పైప్‌లైన్స్ లీకేజ్ అవుతున్న కారణంగా, అందుకు ఉదాహరణ ఇటీవల నగరంలో జరిగిన పెద్ద బ్లాస్టింగ్ సంభవించి 20మంది చనిపోయారు. కంపెనీల లాభాపేక్షతో ప్రైవేట్ భాగస్వామ్యంతో ముందుకు వెళుతున్న కారణంగా పర్యవేక్షణ నాణ్యతను విస్మరించిన కారణంగానే ఇలా జరిగింది. రైతు పొలాల్లో బాంబింగ్ చేస్తారు, బాంబింగ్ చేసి వదిలివేసిన కారణంతో వచ్చే ముడి చమురు వలన భూమి కలుషితమై పోతుంది. సముద్ర జలాలపై కానీ రైతుల భూముల పొల్యూషన్‌పై కాని పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వారు దృష్టి ఉంచని కారణంగా

పొల్యూషన్‌తో నష్టం ఏర్పడుతోంది. వీటన్నింటిపై సరైన దృష్టి ఉంచాల్సిందిగా గౌరవ మంత్రిగారిని తమద్వారా కోరుతున్నాను.

MR.SPEAKER : Please conclude.

శ్రీ అయితాబత్తుల ఆనందరావు: R&B రోడ్లు గాని, పంచాయతీరాజ్ రోడ్లు గాని.. ఇవాళ రోడ్డు వేయాలంటే ఒక కిలోమీటరకు కోటి రూపాయలు అవుతుంది. రావులపాలెంలో భారీ యంత్రాలు ప్రవేశించి అమలాపురం శివార్లలో ఉన్న సముద్రం వైపుకు వెళ్లేటప్పటికి 20, 30 కిలో మీటర్లు అవుతుంది. రావులపాలెం నుంచి 60 కిలోమీటర్లు రోడ్డు వేయాలంటే ఒక కిలోమీటరుకు కోటి రూపాయల చొప్పున సుమారుగా రూ.50కోట్లు అవుతుంది. ఇవాళ ఇచ్చే CSR Funds చూస్తే చాలా తక్కువ ఇస్తున్నారు. దానికి, దీనికి పొంతన ఉండటం లేదు.

అధ్యక్షా, ఆరోగ్య సమస్య అన్నది అతి ముఖ్యమైనది. ఎందుకంటే ఇవాళ కోనసీమ ప్రాంతంలో ఎప్పుడూ కూడా క్యాన్సర్ వ్యాధి ఉండేది కాదు. గత 10 సంవత్సరాల క్రిందట క్యాన్సర్ వ్యాధి గ్రస్తులు చాలా తక్కువుగా ఉండేవారు. అటువంటిది ఇప్పుడు ప్రతీ గ్రామంలో 10 మంది వరకు కేన్సర్ వ్యాధిగ్రస్తులు ఉంటున్నారు. అలానే హెపటైటిస్-సి, లివర్ వ్యాధితో కూడా బాధపడుతున్నారు. దీనికి కారణం ఏమంటే, ఈ బాంబింగ్ వల్ల మా ప్రాంతంలో ఉన్న గ్రౌండ్‌వాటర్, నీరు, గాలి మొత్తం కాలుష్యమైపోతున్నాయి. నేను గౌరవ మంత్రిగారిని ఒకటే కోరుతున్నాను. తప్పకుండా ప్రభుత్వం కమిటీని వేసి పొల్యూషన్ కంట్రోల్ బోర్డుతో సమగ్రమైన విచారణ జరిపిస్తే, అనేక వాస్తవాలు బయటకు వస్తాయి. మేం కూడా ఒక ప్రజాప్రతినిధిగా తగిన సమాచారం ఇస్తాం.

(సభ్యులు శ్రీతోట త్రిమూర్తులు గారు మైకు ఇవ్వమన గౌరవ సభాపతిని కోరారు)

మిస్టర్ స్పీకర్: త్రిమూర్తులుగారు.

శ్రీ తోట త్రిమూర్తులు(రామచంద్రాపురం): అధ్యక్షా, మీరు తొందరగా కూర్చోండి అని అనకుండా కొంచెం సమయం ఇవ్వమని కోరుతున్నాను. ఇది చాలా ముఖ్యమైన విషయం. కోనసీమ ప్రాంతంలో గత 15, 25 సంవత్సరాల క్రితం ONGC వాళ్ల డ్రిల్లింగ్ వలన గ్యాస్, ఆయిల్ ఇవన్నీ వస్తున్నాయంటే సముద్ర ప్రాంతంలో, మిగతా ప్రాంతంలో ఉన్న మేమంతా చాలా సంతోషించాము. ఒకప్పుడు ఇటువంటి సంస్థలు రావడం వలన ఆదాయం వస్తుందని, ఈ ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుందని చాలా ఆశగా ఎదురు చూసేవాళ్లం.

అధ్యక్షా, ప్రసుత్తమున్న పరిస్థితులను చూస్తే ONGC, GAIL, CAIRN అనేక సంస్థలు కోనసీమ ప్రాంతంలో డ్రిల్లింగ్ చేయటం వలన ఆ ప్రాంతమంతా తీవ్రంగా నష్టపోతుంది.

ఈరోజు ఆ ప్రాంతమంతా భయాందోళనలు చెందుతోంది. కోనసీమ ప్రాంతం అంటే చాలా పచ్చని, ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. ఇప్పుడు ఆ పరిస్థితి నుంచి నిత్యం భయపడే పరిస్థితి వచ్చింది. ONGC లాంటి రకరకాల సంస్థల ద్వారా ఈ కోనసీమ ప్రాంతమంతా పైపు లైన్స్ వ్యాపించడంతో ఏ పైపులైన్ ఎప్పుడు ఎక్కడ లీకౌతుందో తెలియక భయాందోళనగా ఉంది.

నేడు గ్యాస్, ఆయిల్ తీసేటప్పుడు కొన్ని రకాల విషవాయువులు వ్యాపించడం వలన, అక్కడ చుట్టుపక్కల ఉన్న చాలా గ్రామాల్లో గర్భస్రావం జరగడం, అనేక రోగాలు రావడం వలన ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. కొన్ని ప్రాంతాలలో భూమి కూడా క్రుంగిపోతుంది. అభివృద్ధి చెందిన ఇతర దేశాలలో ONGC గ్యాస్‌ని బయటికి తీస్తున్నప్పుడు దీనికి సమాంతరంగా వేరే మెటీరియల్‌ను భూమిలోకి పంపించి ప్రమాదాలు రాకుండా చేస్తున్నారని నిపుణులందరూ చెబుతున్నారు. అటువంటప్పుడు ఇక్కడ అటువంటి నియమనిబంధనలు పాటించకుండా చాలా దారుణంగా చేయటం వలన, ఈమధ్య కాలంలో సముద్రం మూడు అడుగులు లోపలికి దిగిపోయిందని కూడా చెప్పడం జరిగింది. ఇది మేం చెప్పిన విషయం కాదు. దీనికి ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీ వెంకటేశ్వరరావు హైకోర్టులో రిట్ పిటిషన్ ఫైల్ చేయడం జరిగింది. ఈరకంగా గ్యాస్, ఆయిల్ తీస్తున్నప్పుడు వీటికి సమాంతరంగా వేరే మెటీరియల్‌ను లోపలికి పంపకపోవటం వలన ఈవిధంగా జరుగుతుంది. ఇది చాలా దారుణం. దీనివలన భయాందోళనకు గురౌవుతున్నారు. ఇది కాకుండా దీని వలన ఉప్పాడ నుంచి అంతర్వేది వరకు ఒక కిలోమీటరు సముద్ర తీరం కోతకు గురయింది. సముద్రం ముందుకొచ్చి రోడ్లు, ఆ ప్రాంతంలో ఉన్నవన్నీ కొట్టుకుపోయాయి. దీనివలన చాలా నష్టం జరిగింది. ఇవన్నీ చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి.

అప్పట్లో ఇంటింటికి ఫ్రీగా వంట గ్యాస్ ఇస్తానని చెప్పారు. ఎక్కడా ఆ రకమైన పరిస్థితులు లేవు సరి కదా మన ప్రాంతంలో ఉన్న గ్యాస్‌ని గుజరాత్‌కి తరలించి, ఆ గుజరాత్ ప్రభుత్వం ఇంటింటికి గ్యాస్‌ను సరఫరా చేస్తుంది. అక్కడున్న పరిశ్రమలన్నిటికీ 24 గంటలు కరెంట్ ఇచ్చేవిధంగా పవర్ ప్రాజెక్టులను నిర్మించుకుంటుంటే మన దగ్గర మాత్రం గతంలో పనిచేసిన ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోలేదు.

MR. SPEAKER: Please conclude.

శ్రీ తోట త్రిమూర్తులు(రామచంద్రాపురం): అధ్యక్షా, మేం అడిగాము కదా అని సమాధానం చెప్పడం కాకుండా, దీనిని చాలా తీవ్రమైన సమస్యగా పరిగణించి, ఒక ప్రత్యేక కమిటీని వేసి అక్కడ జరుగుతున్న అన్నిటిపైన వాటికి సంబంధించిన రిపోర్టును తెప్పించాలని మీద్వారా కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్: మినిష్టరు గారు.

శ్రీ బొజ్జల గోపాల కృష్ణారెడ్డి (శ్రీకాళహస్తి): అధ్యక్షా, ఇంటింటికి గ్యాస్ గాని, లేదా గుజరాత్ రాష్ట్రానికి గ్యాస్ తరలింపు విషయం మీద కాని హౌస్ కమిటీ వేస్తారా వేయరా అనేది మీ ఇష్టం. అది మాకు సంబంధించినది కాదు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకి సంబంధించినది. దానికి ఆనందరావుగారు, తోట త్రిమూర్తులుగారు నిపుణుల కమిటీ వేయమని సలహా ఇచ్చారు. నిపుణుల కమిటీ వేసి, నాసిరకం పైపులు వేస్తున్నారా, రూల్స్‌ను ఎక్కడైనా వాయిలేట్ చేస్తున్నారా అనేది ఆ కమిటీ పరిశీలించి Preliminary Report వచ్చిన తర్వాత కావాలంటే House Committee వేస్తే బాగుంటుంది. తప్పు చేస్తున్నారా లేదా అన్నది నిర్ధారణ కాకుండా హౌస్ కమిటీ వేయడం అన్నది కరెక్ట్ కాదు. There is no need for apprehensions or fears. ఎవరికీ భయపడాల్సిన పని లేదు. అది కూడా ప్రభుత్వ సంస్థ, ఏమైనా ఉంటే తగిన చర్యలు తీసుకొంటాం.

(సభ్యులు శ్రీ తోట త్రిమూర్తులు మైకు ఇవ్వమని గౌరవ సభాపతిని కోరారు)

మిస్టర్ స్పీకర్: మాట్లాడండి.

శ్రీ తోట త్రిమూర్తులు(రామచంద్రాపురం): అధ్యక్షా, ఏరకంగా నష్టం జరుగుతుందో నేను చెప్పక్కర్లేదు, మీ అందరికీ తెలుసు. వర్షాకాలం వచ్చేటప్పటికి కోనసీమ ప్రాంతంలో పులస చేపల సీజను వచ్చేసరికి హైదరాబాదులో ఉన్న మా స్నేహితులకు, బంధువులకు పులస చేపను పంపిస్తూ ఉంటాం. ప్రత్యేకించి ఆ చేప పేరే ఎందుకు చెబుతున్నానంటే ఆ చేప పేరు తెలియనివారెవరూ ఉండరు. ఈరోజున ఆ పులస చేపను చూద్దామంటే కనపడని పరిస్థితి. మత్స్య సంపదంతా నాశనం అయిపోయింది. ఈ ఆయిల్‌తో వచ్చిన తెట్టువల్ల చాలా తీవ్రంగా నష్టం జరుగుతుంది. కాబట్టి ఖచ్చితంగా దీనిమీద హౌస్ కమిటీని వేసి, ఆ కమిటీలో అధికారులను, మమ్మల్ని కలిపి సభ్యులుగా ఉంచి ఒక రిపోర్ట్‌ను తెప్పించి న్యాయం చేయాలని కోరుతున్నాను.

(సభ్యులు శ్రీ జ్యోతుల నెహ్రూ మాట్లాడటానికి అవకాశం ఇవ్వమని గౌరవ సభాపతిని కోరారు)

మిస్టర్ స్పీకర్: మాట్లాడండి.

శ్రీ జ్యోతుల నెహ్రూ: అధ్యక్షా, సోదర సభ్యులు జీరో అవర్‌లో రెయిజ్ చేసిన ఇష్యూలో...

మిస్టర్ స్పీకర్: జీరో అవర్ కాదు ఇది.

శ్రీ జ్యోతుల నెహ్రూః ఇంకా క్వశ్చన్ అవరే అవుతుందా? సారీ, మేం బయటికెళ్లిన సమయంలో జీరో అవర్ ప్రారంభమయింది అనుకున్నాను.

మిస్టర్ స్పీకర్ః ఫర్వాలేదు మాట్లాడండి.

శ్రీ జ్యోతుల నెహ్రూ(జగ్గంపేట)ః అధ్యక్షా, సోదర సభ్యులు ప్రశ్నోత్తరాల సమయంలో అడిగిన విషయం చాలా సమంజసమైనది. ప్రశాంతమైన కోనసీమ ప్రాంతంలో నేడు భయానక వాతావరణంలో జీవనం గడుపుతున్నారు. మొన్న నగరంలో జరిగిన విషయం మీ అందరకూ తెలుసు. మైనింగ్ ల్యాండ్స్ ఉన్నట్టుగా ఎక్కడ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. దీనిమీద ఏ ప్రభుత్వం ఏం చేసిందన్న వాస్తవాలు గాని... మనదగ్గరున్న సహజసంపదను వాడుకుని ఉంటే ఇవాళ మన రాష్ట్రం మిగులు విద్యుత్‌తో ఉండేది. ఈరోజు గ్యాస్ తెచ్చుకోలేని పరిస్థితిల్లో ప్రాజెక్టులు నిరూపయోగమై ఉన్నాయి. అక్కడ ప్రాజెక్టులు నిర్మాణమై ఉన్నాయి. వాళ్లకి ప్రభుత్వం నజరానాలు చెల్లిస్తున్నాయి. కాబట్టి ఈ గ్యాస్‌ను సాధించుకొనే విషయంలో గాని, గత ప్రభుత్వాలు ఎవరు ఏం చేశారన్న దాని మీద కాని, హౌస్ కమిటీ వేసి చాలా క్లియర్‌గా నిగ్గు తేల్చవలసిన అవసరం ఉంది. మన అవసరాలను మనం పరిరక్షించుకోవడానికి కేంద్రప్రభుత్వంతో అవసరమనుకొంటే పోరాటం చేసైనా సరే సాధించుకోవలసిన అవసరం ఉంది.

మిస్టర్ స్పీకర్ః మినిష్టరు గారు.

శ్రీ బొజ్జల గోపాల కృష్ణారెడ్డిః అధ్యక్షా, అక్కడ కామన్‌గా ఉండే ప్రజలు ఎటువంటి apprehensions, ఎటువంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదు. ఈ గ్యాస్ గురించి జిల్లా కలెక్టరుకు ఆదేశాలిచ్చి అన్ని జాగ్రత్తలు తీసుకోమని, ఏమైనా ఉంటే చర్యలు కూడా తీసుకోమని చెబుతాం.

...

(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

MR.SPEAKER : Now, Zero Hour. Rajeswari garu

## జీరో అవర్

శ్రీమతి వంతల రాజేశ్వరి(రామప్పచోడవరం)ః అధ్యక్షా, తమరు నాకు కొంత ఎక్కువ సమయాన్ని కేటాయించవలసిందిగా కోరుతున్నాను. మా రంపచోడవరం నియోజక వర్గంలో

చాలా సమస్యలున్నాయి. 7మండలాలతోపాటు, 4మండలాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విలీనం చేశారు. విలీనం చేసిన మండలాల్లో ఇప్పటికీ ఆంధ్రా అధికారులను ఎవ్వరినీ నియమించలేదు. తెలంగాణ అధికారులే ఉన్నారు. తెలంగాణ అధికారులు ఉండడం వల్ల అక్కడి గిరిజనులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వాళ్ళు అక్కడి గిరిజనులతో మేము తెలంగాణ అధికారులము. మేము మీ పనులను చేయలేము అని అంటున్నారు. మా గిరిజనులు చాలా నిస్సహాయ స్థితిలో ఉన్నారు. కావున, ప్రభుత్వం తగువిధమైన చర్యలు తీసుకుని, ఆంధ్రా అధికారులను నియమించి, పూర్తి న్యాయం చేయవలసిందిగా కోరుతున్నాను.

(ప్యానల్ ఛైర్మన్ శ్రీమతి డి.ఎ. సత్యప్రభగారు అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

అధ్యక్షా, అంతేకాదు. మా 4గిరిజన మండలాల్లో ఆరోగ్య, విద్య, విద్యుత్ మరియు త్రాగునీటి సమస్యలు అధికంగా ఉన్నాయి. అక్కడి పాఠశాలలకు ఉపాధ్యాయులు కూడా సక్రమంగా వెళ్ళడంలేదు. తెలంగాణ సర్టిఫికేట్లు ఇస్తున్నారు. ఆంధ్ర సర్టిఫికేట్లు తెచ్చుకుంటే గానీ వీలుపడట్లేదని చెప్తున్నారు. మా 7మండలాల్లో 1958 జనన, మరణ రిజిస్టర్ల ప్రకారం సర్టిఫికేట్లు తెచ్చుకోమంటున్నారు. ఎప్పుడో ఉన్న రిజిస్టర్ల ప్రకారం అంటే మా గిరిజనులకు సాధ్యం కావట్లేదు. కాబట్టి, ప్రభుత్వం ఈ విషయమై స్వయంగా పరిశీలించి, గిరిజన సర్టిఫికేట్లు త్వరగా ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. దీనివల్ల మా ప్రాంతం విద్యాపరంగా కూడా కుంటుపడుతోంది. ఎందుకంటే, స్కాలర్‌షిప్‌లు పొందాలంటే సర్టిఫికేట్లు తప్పనిసరిగా ఉండాలి. మా గిరిజన విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

అలాగే మాకు ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. క్రింద రోడ్లు రూ.126కోట్లుతో మా గిరిజన ప్రాంతాల కొరకు మంజూరయ్యాయి. ఈ తారు రోడ్లు ఫారెస్ట్ క్లియరెన్స్ లేకపోవడం వల్ల నిలచి పోయాయి. ఫారెస్ట్ అధికారులతో, మా ఐ.టి.డి.ఎ. ప్రాజెక్ట్ ఆఫీసర్ గారి సమన్వయంతో ఫారెస్ట్ అధికారుతో మాట్లాడి, ఈ విషయమై క్లియరెన్స్ ఇప్పించాలని, తదనుగుణంగా చర్యలు తీసుకో వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. (బెల్)

మా గిరిజన ప్రాంతాల్లో కరెంటు సమస్య కూడా చాలా ఎక్కువగా ఉంది. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నాను.

మా గిరిజన ప్రాంతాల్లో గిరిజనులు బాగుపడాలంటే తారు రోడ్లు, వాటర్ ట్యాంకులను బాగు చేయించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. అదేవిధంగా రోడ్లు ఎంత త్వరగా వేయించి, మా గిరిజనుల జీవన స్థితిగతులను మెరుగుపరచాలని కోరుతున్నాను.

(బెల్)

మరొక్క ముఖ్యమైన విషయం. కొత్తగా పెళ్ళయిన గిరిజనులకు తెల్ల రేషన్ కార్డులను త్వరగా ఇప్పించాలని కోరుతూ, తద్వారా మా గిరిజన కుటుంబాలు బాగుపడతాయని తెలియజేసుకుంటున్నాను.

పింఛన్ల విషయంలో కమిటీని నియమిస్తే, వాళ్ళు మాతో సమన్వయంతో పనిచేయడంలేదు. దానివల్ల, ఇప్పటిదాకా పింఛన్లు వచ్చే వాళ్ళకు కూడా పింఛన్లు రాకుండా పోయాయి. వారికి పింఛన్లను తిరిగి ఇప్పించడంతోపాటు, కొత్త వాళ్ళకు కూడా పింఛన్లు ఇప్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నాను. నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు అధ్యక్షుల వారికి ధన్యవాదాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

గౌరవ చైర్మన్ః మంత్రిగారు.

**శ్రీ కింజరపు అచ్చెన్నాయుడు (టెక్కలి)ః అధ్యక్షా, సభ్యులు అన్ని శాఖలకు సంబంధించిన విషయాలను తెలియపరిచారు. అన్నింటినీ, నోట్ చేసుకున్నాను. సంబంధిత శాఖల మంత్రులకు తెలియజేసి న్యాయం చేస్తాము.**

గౌరవ చైర్మన్ః కె.ఎస్.జవహర్ గారు.

శ్రీ కె.ఎస్.జవహర్ (కొవ్వూరు)ః నమస్కారం అధ్యక్షా. నా నియోజకవర్గంలోని అనేక నీటిపారుదల డ్రైనులు మోడ్రనైజేషన్‌కు నోచుకోకుండా ఉన్నాయి. వెంటనే అటువంటి వాటిని నోటిఫై చేసి, డ్రైన్లు మంజూరు చేయవలసిందిగా కోరుతున్నాను. మా నియోజకవర్గంలో ఏరియా ఆసుపత్రి పేరుతో ఒక ఏరియా ఆసుపత్రి ఉంది. మంత్రిగారు రాష్ట్రం మొత్తం కూడా చాలా బాగా కొవ్వూరు పుష్కరాలను ఆధారం చేసుకుని, అక్కడ ఆసుపత్రి అవసరాలు కూడా ఉన్నాయి కనుక, ఆ ఏరియా ఆసుపత్రికి స్టాఫ్ పాటర్న్ ద్వారా ఉద్యోగులను నియమించి, దానితోపాటు దాదాపు కోటి రూపాయలతో వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయడానికి దాతలు ముందుకు వచ్చారు. అంతేకాకుండా, ఆ ఆసుపత్రిలో దాదాపు 6 నెలలనుండి ఎలక్ట్రీషియన్ లేకుండా, ఓ.పి. రాసేటువంటి వ్యక్తులకు జీతాలు కూడా లేని పరిస్థితి ఉంది. వాటిని తమ ద్వారా మంత్రిగారిని వెంటనే పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నాను.

గౌరవ చైర్మన్ః మంత్రి గారు.

**శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావుః అధ్యక్షా, నోట్ చేసుకున్నాను. సదరు విషయమై తప్ప కుండా చర్యలు తీసుకుంటాము.**

గౌరవ చైర్మన్ః జయరాములు గారు.

శ్రీ త్రివేది జయరాములు(బద్వేల్) ః అధ్యక్షా, మా బద్వేలు నియోజకవర్గములో ఎక్కువగా పసుపు పండించే రైతులు ఉన్నారు. కడప, కర్నూలు జిల్లాల్లో మరియు నెల్లూరు జిల్లాలో కొంతమేర పసుపు పంటను సాగుచేసే రైతులు ఎక్కువగా ఉన్నారు. ఇది ఎక్కువ ఖర్చుతో కూడినటువంటి పంట ఇది. ఎకరానికి దాదాపు రూ.1,00,000/- ఖర్చు అవుతోంది. రైతులకు గిట్టుబాటు ధర తక్కువగా ఉంది. ఈ పసుపు పంటను హార్టికల్చర్ క్రింద పరిగణించిన ప్పటికీ, మిగతా పంటలవలె, ఈ పంటను కూడా క్రైటీరియాగా తీసుకుని రుణమాఫీ క్రింద సుమారు ఎకరానికి రూ.20,000/- వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతు న్నాను.

గౌరవ చైర్మన్ః మంత్రి గారు.

**శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడుః అధ్యక్షా, నోట్ చేసుకున్నాను. సంబంధిత మంత్రిగారికి తెలియజేస్తాను.**

గౌరవ చైర్మన్ః జయనాగేశ్వర రెడ్డి గారు.

శ్రీ బి.జయనాగేశ్వర రెడ్డి(ఎమ్మిగనూరు)ః నమస్కారం అధ్యక్షా, మా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో బేడ బుడగ జంగాలు భిక్షాటన చేస్తూ, కొన్ని వేలమంది ఉన్నారు. ఈ విషయమై ప్రశ్నోత్తరాల సమయంలో తగినంత సమయం లేనందువల్ల చెప్పలేకపోయాను. ఈ బేడ బుడగ జంగాలు ఒక ప్రక్క బుర్రకథలు చెప్పుకుంటూ, సంచార జీవనం సాగిస్తూ తీవ్రమైన ఇబ్బందులతో కష్టపడుతున్న తరుణంలో, వీరి యొక్క బిడ్డల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. వీరి జీవితాలను ప్రభావితం చేస్తున్న ప్రభుత్వ ఉత్తర్వు నెం.144 ను వెంటనే రద్దు చేయాలని గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారిని కోరడం జరిగింది. వారు ఒక కమీషన్‌ను ఏర్పాటు చేసి, ఈ బేడ బుడగ జంగాలకు కుల ధృవీకరణ పత్రాలు ఇస్తామని చెప్పడం జరిగింది. కాబట్టి, ఆ చర్యలను వేగవంతం చేయవలసిందిగా సభాముఖంగా మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

గౌరవ చైర్మన్ః మంత్రి గారు.

**శ్రీ కామినేని శ్రీనివాస రావుః అధ్యక్షా, నోట్ చేసుకున్నాను. సంబంధిత మంత్రి గారికి తెలియజేస్తాను.**

గౌరవ చైర్మన్ః విష్ణుకుమార్ రాజు గారు.

శ్రీ పి.విష్ణుకుమార్ రాజుః అధ్యక్షా, విశాఖపట్నం గిరిజన ప్రాంతాల్లో మొత్తం మన ఆంధ్ర రాష్ట్రంలోనే ఒక విచిత్రకరమైన పరిస్థితి ఉంది. అక్కడ వర్షాకాలంలో విపరీతమైన వానలు పడతాయి. ఎండాకాలంలో చెమట పట్టదు. అందుకే, అందరు అక్కడకు పిక్‌నిక్‌కు వెళతారు. చలికాలంలో మహాఘోరంగా ఉంటుంది. అక్కడున్న లంబసింగిలో, చింతపల్లిలో, అరకులో, పాడేరులలో పిల్లలు పాఠశాలకు వెళ్ళాల్సిన సమయం ఉదయం 8.00 గంటలకు. అక్కడ చలి విపరీతంగా ఉంటుంది. దాదాపు మైనస్ 2డిగ్రీలకు వెళ్తోంది. ఎండ వచ్చేటప్పటికి మధ్యాహ్నం 11.00 గంటలవుతుంది.

...

ఆ ప్రాంతంలో పిల్లలు చలికి గజగజ వణుకుతూ స్కూల్‌కు వెళుతున్నారు. మానవతాధృక్పదంతో గిరిజన పిల్లలకు ప్రభుత్వం స్వెట్టర్స్ సమకూర్చవలసిందిగా కోరుతున్నాను. ఆ ప్రాంతంలోనున్న ప్రజలకు ఇంటికి ఒక రగ్గు ఇస్తే బాగుంటుంది. పిల్లలు మంటలు వేసుకొని స్కూల్‌కు వెళ్లడం మానివేస్తున్నారు. దీనిని తీవ్రంగా పరిగణించి చర్యలు చేపట్టవలసిందిగా కోరుతున్నాను.

ఛైర్మన్ః మంత్రి గారు.

**శ్రీమతి కిమిడి మృణాళినిః అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాలు నోట్ చేసుకోవడం జరిగింది. దానిపై తగిన చర్యలు తీసుకుంటాం.**

శ్రీ గుమ్మనూర్ జయరాం (ఆలూరు)ః అధ్యక్షా, నాది కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం. మా జిల్లాలో 54 మండలాలు ఉన్నాయి. జిల్లాలో 12 కరువు మండలాలను మాత్రమే ప్రకటించారు. అనంతపురం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించారు. అనంతపురం జిల్లాకు నా నియోజకవర్గం మూడు కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉంది. నా నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ఎక్కువగా రైతులే ఉన్నారు. ఆరు మండలాలను కరవు మండలాలుగా ప్రకటించాలని కోరుతున్నాను. హైస్కూల్, కాలేజ్, పాలిటెక్నిక్ కాలేజీలు నా నియోజకవర్గంలో నడుపబడుతున్నాయి. వాటికి సొంత భవనాలు నిర్మించాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఛైర్మన్ః మంత్రి గారు.

**శ్రీ నిమ్మకాయల చిన రాజప్ప (పెద్దాపురం): అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాలు నోట్ చేసుకోవడం జరిగింది. సంబంధింత మంత్రివర్యులకు తెలియజేయడం జరుగుతుంది.**

శ్రీ పి.నారాయణమూర్తి (గన్నవరం): అధ్యక్షా, నా నియోజకవర్గం మాథ్యంలో ఉన్న పి.గన్నవరం. మూడు నదుల మధ్యన నా నియోజకవర్గం ఉంది. నదుల మధ్య ఉండడం వల్ల ప్రతి సంవత్సరం వరదలు రావడం, భూములు ఇసుకతో కప్పబడిపోవడం, ఆ భూములలో రైతాంగం ఏమీ పండించలేని పరిస్థితులలో ఉన్నారు. లంక భూముల రైతాంగం అందరూ కలిసి ఆ ఇసుక దిబ్బలను వారే అమ్ముకునే విధంగా మరలా పంట పండించేందుకు అవకాశం ఇవ్వాలని సంబంధిత మంత్రివర్యులను కోరుతున్నాను.

పనికి ఉపాధి పథకం అనేది ఎక్కడో రోడ్డు ప్రక్కన మట్టి ఎత్తివేయడం కాదు. రైతాంగానికి కూలీలు దొరకలేని పరిస్థితి ఉంది. ఈ పథకాన్ని రైతుకు అనుసంధానం చేయమని సంబంధిత మంత్రి గారిని అడుగుతున్నాను.

అనేక రకాల విగ్రహాలకు పుట్టినిల్లు కోనసీమ. ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రతిఒక్కరు విగ్రహాలను పెట్టి వాటిని అవమాన పరిచేవిధంగా కార్యక్రమాలు చేపడుతున్నారు. రానున్న కాలాలలో ప్రభుత్వ అనుమతి ఉన్న చోటే విగ్రహాలను పెట్టాలని సంబంధిత మంత్రి గారిని అడుగుతున్నాను.

ఛైర్మన్: మంత్రి గారు.

**శ్రీ నిమ్మకాయల చిన రాజప్ప: అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాలు పరిశీలించడం జరుగుతుంది. మిగిలిన శాఖలకు తెలియజేస్తాం.**

శ్రీ పి.అనిల్ కుమార్ (నెల్లూరు): అధ్యక్షా, నా నియోజకవర్గంలో గత చాలా కాలం నుంచి ఉచితంగా ఇసుకను తోలుకుంటున్న  సుమారు 1,000 మంది టైరు బండ్ల వారు దాదాపు 600క్యూబిక్ మీటర్లు నిల్వచేసుకోవడం జరిగింది.  ఉదయం ఒక ట్రిప్పు, సాయంత్రం ఒక ట్రిప్పు పెట్టమని శ్రీ పోలంరెడ్డి శ్రీనివాస రెడ్డి గారు అడిగారు. వారు ఇంతకుముందు ఉచితంగా ఎలా తోలుకుంటున్నారో అలాగే కొనసాగించాలని మీ ద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను. ఎందుకంటే ప్రస్తుతం వారు జీవనం కోల్పోయి, ఎద్దులను అమ్ముకోలేక, కసాయివాళ్లకి పంపించుకునే పరిస్థితి  ఈనాడు నెల్లూరు జిల్లాలో ఉంది.

ఇంకొక చిన్న సమస్య, నాలుగు నెలల క్రితం కేంద్ర మంత్రివర్యులు శ్రీ వెంకయ్యనాయుడు గారు, రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ నారాయణ గారు, ముఖ్యమంత్రి

శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు నెల్లూరులో ఒక సమావేశానికి విచ్చేసి రెండు నెలలలోపు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం, ప్రతి ఇంటికి మంచినీరు ఇస్తామని, దానికి గాను రూ.1,500/- కోట్లు మంజూరు చేస్తున్నామని రెండు నెలలో కార్యాచరణలోకి వస్తుందని చెప్పారు. ఆ సమావేశం అయిన తరువాత ఆ హామీ చెత్త కుండీలోకి వెళ్ళిపోయిందో తెలియదు. ఆ ఫైల్‌పై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో, ఆ ఫైల్ ఎక్కడ ఉందో మంత్రివర్యులు శ్రీ పి.నారాయణ గారు తెలియజేయవలసిందిగా కోరుతున్నాను.

ఛైర్మన్ః మంత్రి గారు.

**శ్రీమతి కిమిడి మృణాళినిః అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాలు నోట్ చేసుకోవడం జరిగింది. సంబంధిత మంత్రి గారికి తెలియజేసి తగిన చర్యలు తీసుకుంటాం.**

ఛైర్మన్ః ఎస్.రామకృష్ణా రెడ్డి గారు.

(సభ్యులు సభలో లేనందున మాట్లాడలేకపోయారు)

పార్థసారథి గారు.

శ్రీ బి.కె. పార్థసారథి(పెనుకొండ)ః అధ్యక్షా, నా నియోజకవర్గం మీదుగా బెంగళూరు-హైదరాబాదు జాతీయ రహదారి వెళుతుంది. జాతీయ రహదారి వేసేటప్పుడు పెనుకొండ నుండి అనంతపూర్ వరకు ఎక్కడా ఫ్లైఓర్స్ లేకపోవడం వల్ల దాదాపు 40మంది మరణించారు. ముఖ్యంగా రాప్తాడు, అమ్మవారిపల్లి, పాలసముద్రం, సోమందెపల్లి, పెనుకొండ, సీ.కె.పల్లి ఎక్కడా ఫ్లైఓవర్స్, అండర్ బ్రిడ్జీలు, ఆర్‌యూబీలు గాని లేవు. అందువల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫ్లైఓవర్స్, అండర్ బ్రిడ్జీలు, ఆర్‌యూబీలు నిర్మించాలని మంత్రి గారిని తెలియజేస్తున్నాను. ఈ విషయాన్ని సర్ఫేస్ ట్రాన్స్‌పోర్ట్ మంత్రి గారు కేంద్ర ప్రభుత్వానికి తెలియజేసి సత్వర చర్యలు చేపట్టమని కోరుతున్నాను.

ఛైర్మన్ః మంత్రి గారు.

**శ్రీ కింజరాపు అచెన్నాయుడుః అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాలు నోట్ చేసుకున్నాం. సంబంధిత మంత్రి గారికి తెలియజేసి తగిన చర్యలు తీసుకుంటాం.**

శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి(పంగనూరు)ః అధ్యక్షా, ఇది చాలా ముఖ్యమైన విషయం. ఈ విషయాన్ని నేను, గౌరవ సభ్యులు శ్రీ చింతల రామచంద్రా రెడ్డి ప్రశ్నల రూపంలో ఈ

సెషన్‌లో అడిగాం. చర్చకు రాలేదు కనుక జీరో అవర్‌లో ప్రస్తావిస్తున్నాను. 04-09-2014వ తేదీన శ్రీ చైతన్య టెక్నో స్కూల్, తిరుపతిలో మురళికృష్ణ అనే విద్యార్థి హత్యకు గురైయ్యారు. స్కూల్ యాజమాన్యం హతున్ని వైద్యశాలకు తీసుకోపోవడానికి అలక్ష్యం చేస్తుంటే, సహవిద్యార్థులు ఆ విద్యార్థి ఆటోలో హాస్పిటల్‌కు తీసుకుని వెళితే, యాజమాన్యం మాత్రం స్కూల్‌లో రక్తపు మరకలను శుభ్రపరిచే పనిలో ఉంది. ఆ విద్యార్థి స్కూల్ టాపర్, ఆహత్యపై స్కూల్ యాజమాన్యం స్పందించలేదు. ఆ హత్యపై క్రైం ఎఫ్ఐఆర్ కూడా నమోదు అయ్యింది. క్రైం నంబర్ 381/2014 సెక్షన్ 174 సీఆర్‌పీసీఎఫ్ ఈస్ట్ పోలీస్ స్టేషన్, తిరుపతి. ఈ విషయంపై ఇంతవరకు ఏ విధమైన చర్చలు తీసుకోలేదు. ఈ విషయం అన్ని దినపత్రిలలో రావడం జరిగింది.

(శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొన్ని దినపత్రికల ప్రతిలను తీసుకొని శీర్షికలను చదువుతూ ఉన్నారు)

ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'మోహన్ కృష్ణది కార్పోరేట్ హత్య', 'స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు పెట్టాలి', 'తిరుపతిలో విద్యార్థుల శాంతి ర్యాలి' అని విద్యార్థులు నిరసనలు వ్యక్తపరిచారు. కాని స్కూల్ యాజమాన్యం స్పందించలేదు. ఈ స్కూల్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖా మంత్రి శ్రీ పి.నారాయణ గారిది. మంత్రి గారి స్కూల్ కావడం వలన పోలీసు శాఖ చర్యలు తీసుకోడానికి వెనుకంజ వేస్తున్నారు. దీనిపై విచారణ చేయించి బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని మీ ద్వారా డిమాండ్ చేస్తున్నాను.

**శ్రీ నిమ్మకాయల చిన రాజప్ప: అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాన్ని పరిశీలించడం జరుగుతుంది.**

...

శ్రీ వి. ప్రభాకర్ చౌదరి(అనంతపురం-అర్బన్): అధ్యక్షా, విద్య కోసం, వైద్యం కోసం, ఉపాధి కోసం నిరంతరం అనంతపురం పట్టణానికి ప్రజలు ఎక్కువ సంఖ్యలో వలసలు వస్తున్నందున అనంతపురం పట్టణ జనాభా శరవేగంగా పెరిగిపోతున్న పరిస్థితి దృష్ట్యా జిల్లాలో నేరాల సంఖ్య కూడా పెరిగిపోతూ వుంది. అక్కడ పెరిగిపోయిన ట్రాఫిక్ నియంత్రణ కోసం మరియు శాంతిభద్రతల పరిరక్షణ కోసం అదనపు పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది. అందువల్ల అక్కడ నాలుగవ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయడానికి మీ ద్వారా హోం మంత్రి గారి నుండి స్పష్టమైన హామీని కోరుతున్నాను.

**శ్రీ నిమ్మకాయల చిన రాజప్ప: అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పింది నోట్ చేసుకున్నాను. తప్పకుండా పరిశీలించడం జరుగుతుంది.**

శ్రీమతి ఆర్.కె.రోజా (నగరి): అధ్యక్షా, చిత్తూరు జిల్లాలోని చిత్తూరు మరియు రేణిగుంట సహకార చక్కెర ఫ్యాక్టరీలలో చెరుకు రైతులకు రెండు సంవత్సరాలుగా బకాయిలున్నారు. అది మీకూ తెలుసు. మాకూ తెలుసు. అక్కడి రైతులకు రుణ మాఫీ జరగక, వాళ్లు తీసుకున్న అప్పులు చెల్లించలేక ఇబ్బందులు పడుతూ పెద్దయెత్తున్న ధర్నాలు చేసిన సంగతి మీకూ తెలుసు. సుగర్ ఫ్యాక్టరీల ఎమ్‌డీలు పదిహేను రోజుల్లో ఆ బకాయిలు చెల్లిస్తామని చెప్పినా ఇప్పటి వరకూ చెల్లించలేదు. మొన్న జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు చక్కెర ఫ్యాక్టరీ రైతులకివ్వాల్సిన బకాయిలను పది రోజుల్లోగా క్లియర్ చేస్తామని చెప్పారు. చెప్పి కూడా పది రోజులయింది. ఎప్పట్లోగా చెల్లిస్తారో చెబితే రైతులు సంతోషిస్తారు.

**శ్రీ ప్రతిపాటి పుల్లారావు(చిలకలూరిపేట): అధ్యక్షా, గౌరవ సభ్యురాలు రోజా గారు ప్రస్తావించిన అంశాన్ని నోట్ చేసుకోవడమయింది. పరిశీలించడం జరుగుతుంది.**

శ్రీ వి.హనుమంత రాయ చౌదరి(కల్యాణదుర్గం): అధ్యక్షా, మా కళ్యాణ దుర్గం నియోజకవర్గం పూర్తిగా కరువుతో నిండిన వెనుకబడిన ప్రాంతం. అక్కడ వున్న శ్రీ రామ రెడ్డి నీటి పథకం కింద 1.40ఎమ్‌జీడీల నీరు రావలసి వుండగా కేవలం 0.40 నుండి 0.50 ఎమ్‌జీడీల నీరు మాత్రమే వస్తున్నది. దాని వల్ల చాలా గ్రామాలకు నీరివ్వలేని పరిస్థితి వుంది. పైగా అక్కడి బోర్లలో కూడా నాలుగైదు వందల అడుగులు తవ్వితే కాని నీరు పడడం లేదు. అక్కడి నీటి పథకానికి మంచి పైపులు వెయ్యకుండా నాసిరకం పైపులు వేయడం వల్ల నీటి సరఫరా సక్రమంగా జరగక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి వుంది. కాబట్టి దానిపై తగిన చర్యలు తీసుకొని ప్రజల ఇబ్బందులను తొలగించాలని మీ ద్వారా సంబంధిత మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ దేవినేని ఉమా మహేశ్వర రావు: అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకున్నాము. తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.**

శ్రీ దాడి శెట్టి రామలింగేశ్వరరావు (తుని): అధ్యక్షా, మా తుని నియోజకవర్గంలో పూర్తిగా అరాచకం తాండవిస్తున్నది. గౌరవ ఆర్థిక మంత్రి గారి సోదరుడు తుని నియోజకవర్గాన్ని పూర్తిగా భ్రష్టు పట్టిస్తూ తీవ్ర అరాచకం చేస్తున్నారు. ఆయనను కంట్రోల్ చేయలేని గౌరవ ఆర్థిక మంత్రి గారు ఈ సభకు వచ్చి ఈ రాష్ట్ర ప్రజలకు, నాయకులకు ఏ రకమైన మెసేజ్ ఇస్తున్నారో మీరొకసారి గమనించాలి.

అధ్యక్షా, మొన్న తునిలో ప్రభుత్వానికి వేలాది కోట్ల ఆదాయాన్ని తీసుకొచ్చే హేచరీస్ మీద దాడి చేయడం జరిగింది. మీ దగ్గర డబ్బులున్నాయి కాబట్టి మాకు పంపించండి.

ఎందుకంటే మా అన్నయ్య గారు మంత్రి కాబట్టి డబ్బులు మాకివ్వండి అంటే ఇవ్వనందుకు హేచరీస్ మీద దాడి చేసి వాటిని తీవ్రంగా నష్టం చేయడం జరిగింది. కనీసం పోలీసులు ఎటువంటి యాక్షన్ తీసుకోకుండా మౌనంగా వుంటూ పోలీసు స్టేషన్‌కే పరిమితమవుతున్నారు. మా నియోజకవర్గంలో జరిగిన ఇలాంటి అరాచకం ఈ రాష్ట్రంలో ఇప్పటివరకు ఎప్పుడూ జరిగివుండదు. ఎందుకంటే తునిలో అంత అరాచకం జరుగుతుంటే ఇక్కడున్న పెద్ద మనిషి ఈ శాసన సభలో నీతులు చెప్పడం ఎంత వరకు సమంజసం అధ్యక్షా? సోదరుణ్ణి కంట్రోల్‌లో పెట్టుకోలేని ఈ....... . (మైకు కట్ చేయబడింది.)

(అధికార పక్ష సభ్యుల నుంచి తీవ్ర అభ్యంతరాలు)

**శ్రీ బొజ్జల గోపాల కృష్ణా రెడ్డిః అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన అంశాన్ని నోట్ చేసుకున్నాము. సభ్యుల ఆవేదన అర్థమయింది. తుని నియోజకవర్గ ఎమ్మెల్యే గారి చేతిలో ఫైనాన్స్ మినిస్టర్ గారి తమ్ముడు గారు ఓడిపోయారు. తప్పకుండా చర్యలు తీసుకుంటాము.**

CHAIRMAN: All the papers are deemed to have been laid on the Table of the House.

**PAPERS LAID**

1. "A copy in each of the $26^{th}$ and 27th Annual Reports of the Andhra Pradesh Beverages Corporation Limited for the years 2012-13 and 2013-14, as required under Section 619(3) of the Companies Act, 1956."

2. "A copy of the Notification in G.O.Ms.No.36, A&C (AM.III) Dept., 30-3-2014 as required under Section 33(5) of Andhra Pradesh (Agricultural Produce & Livestock) Markets Act, 1966."

Now, tea break for ten minutes.

(Then the House adjourned at 11.18 a.m.)

…

(THE HOUSE RE-ASSEMBLED AT 12-02 PM
WITH HON'BLE SPAKER IN THE CHAIR)

## సంతాప తీర్మానం

మిస్టర్ స్పీకర్‌: కేంద్ర మాజీ మంత్రి శ్రీ గడ్డం వెంకటస్వామిగారు భౌతికంగా మన మధ్య లేరని చెప్పడానికి విచారిస్తున్నాను. 85 సంవత్సరాల వయసున్న శ్రీ వెంకటస్వామి గారు గత కొద్ది రోజులుగా వారు అస్వస్థతతో బాధపడుతున్నందున ఒక ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ నిన్న రాత్రి తుది శ్వాస విడిచారు. 1929 అక్టోబర్ 5వ తేదీన జన్మించిన శ్రీ వెంకటస్వామి గారికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. స్వయంకృషితో ఎదిగి ఉన్నత పదవులు అధిరోహించి శాసనసభ్యునిగా, పార్లమెంటు సభ్యునిగా దేశంలో సుదీర్ఘకాలం పాటు చట్టసభలకు ప్రాతినిధ్యం వహించినవారిలో ఆయన ఒకరు. కార్మిక నాయకుడి నుంచి కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగిన వెంకటస్వామి గారిని అభిమానులు 'కాకా' అని ప్రేమగా పిలిచేవారు. స్వామి రామానందతీర్థ గారి వద్ద శిష్యునిగా పనిచేసి ఆయనతోబాటు అరెస్ట్ అయ్యారు. డా.బి.ఆర్.అంబేద్కర్ గారు హైదారాబాదు వచ్చినపుడు వారితో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్మికనేతగా వారి అభ్యున్నతికోసం కృషి చేశారు. 1957 నుంచి 1962 వరకు, 1978 నుంచి 1984వరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభలో సభ్యులుగా పనిచేసిన 'కాకా' 1967లో తొలిసారిగా లోక్‌సభకు ఎన్నికైనారు. 1969-71వరకు పి.ఎ.సి. కమిటీలో సభ్యునిగా పనిచేశారు. ఏడు సార్లు లోక్‌సభకు ఎన్నికైన వెంకటస్వామిగారు కేంద్రంలో వివిధ శాఖలలో పలు హోదాలలో మంత్రిగా పనిచేశారు. అలాగే 1978-82 వరకు ఆంధ్రప్రదేశ్ కార్మిక, పౌరసరఫరాల శాఖ మంత్రిగా పనిచేశారు. శ్రీ వెంకటస్వామిగారు ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి జీవితాంతం పాటుపడ్డారు. రాష్ట్ర రాజకీయాలలో చెరగని ముద్ర వేసిన వెంకటస్వామిగారు జీవితాంతం నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడారు. ఈ దేశానికి, రాష్ట్రానికి, బడుగు బలహీనవర్గాలకు శ్రీ వెంకటస్వామి గారు చేసిన సేవలను కొనియాడుతూ ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఘన నివాళులు అర్పిస్తున్నది.

శ్రీ జి.వెంకటస్వామి గారి మృతిపట్ల ఈ సభ తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ శోకార్తులైన వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది. శ్రీ వెంకటస్వామి గారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఈ సభ రెండు నిమిషాలు మౌనం పాటిస్తుంది.

(సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది)

**మిస్టర్ స్పీకర్‌: ఇపుడు ముఖ్యమంత్రిగారు ప్రకటన చేస్తారు.**

శ్రీ నారా చంద్రబాబు నాయుడు(కుప్పం)ః అధ్యక్షా, పేద ప్రజలందరికీ ప్రభుత్వం సంక్రాంతి కానుక అందిస్తున్నది. దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు జరుపుకొనే పర్వదినం సంక్రాంతి పండుగ. దక్షిణ భారతదేశంలో కుప్పల నూర్పిళ్ల అనంతరం పంట ఇంటికి వచ్చే పండుగ సంక్రాంతి పండుగ. కూతుళ్లు, అల్లుళ్లను ఇంటికి పిలుచుకొని కుటుంబ సభ్యులందరూ సంతోషంగా, ఆనందంగా పిండివంటలతో, సాంస్కృతిక కార్యకలాపాలతో సంక్రాంతి వేడుకలు ఇంటింటా జరుపుకుంటారు. రాష్ట్రంలో ప్రతి ఇంటిలో అనగా నిరుపేద కుటుంబాలలో కూడా సంతోషం, ఆనందం వెల్లివిరియాలని మా ప్రభుత్వ సంకల్పం. ఇప్పటికే ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా మూడు నిత్యావసర వస్తువులు అనగా బియ్యం, కిరోసిన్, పంచదారలను ప్రభుత్వం రాష్ట్రంలోని 1.3కోట్ల కుటుంబాలకు సరఫరా చేస్తున్నది. సంక్రాంతి పండుగను పేద కుటుంబాలు కూడా వేడుకగా జరుపుకోవడానికి ఈసారి ఆ సరకులతోబాటు మరికొన్ని సరకులను కూడా సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయించింది. సంక్రాంతి కానుకగా కందిపప్పు, పామాయిల్, శనగలు, బెల్లం, గోధుమపిండి, నెయ్యి కూడా ఉచితంగా అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

(అధికారపక్ష సభ్యులు చప్పట్లు కొట్టారు)

పండుగనాడు పేదలు కూడా పిండివంటలతో పప్పన్నంలో నెయ్యి వేసుకొని కుటుంబ సభ్యులతో పండుగ భోజనం చేస్తూ ఆనందం పంచుకోవాలన్నది మా కోరిక. దీనివలన రాష్ట్ర ప్రభుత్వంపై రూ.287కోట్ల అదనపు భారం పడుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలో కోటి 30లక్షల నిరుపేద కుటుంబాలకు ఎఐవై, అన్నపూర్ణ కార్డులతో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 20 కేజీల బియ్యం, కిలో గోధుమలు, అర కిలో పంచదార, గ్రామాల్లో రెండు లీటర్ల కిరోసిన్, పట్టణాలలో నాలుగు లీటర్ల కిరోసిన్ చొప్పున అందజేస్తున్నాం. సంక్రాంతి పండుగ స్పెషల్ గిఫ్ట్ ప్యాకేజి కింద పేద కుటుంబాలకు రూ.220 విలువైన ఈ కింది సరకులు కూడా పంపిణీ చేస్తున్నాం. కందిపప్పు అర కిలో, పామాయిల్ అర లీటర్, శనగలు కిలో, బెల్లం అర కిలో, గోధుమపిండి కిలో, నెయ్యి వంద గ్రాములు. దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలలోని కార్డులన్నింటికీ సంక్రాంతి కానుకగా ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం 6503 మె.ట. కందిపప్పు, 6503 కి.లీ. పామాయిల్,13.7 మెట్రిక్ టన్నుల శనగలు, 6503 మెట్రిక్ టన్నుల బెల్లం, 13007 మెట్రిక్ టన్నుల గోధుమ పిండి, 1301 కి.లీ. నెయ్యి పంపిణీ చేస్తున్నాం. ఈ మొత్తం సరకుల ఖరీదు దాదాపు రూ.280కోట్లు. మొత్తం నూటికి నూరు శాతం సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని మీకు తెలియజేస్తున్నాను. ఈ రోజు మనమందరం కూడా పేదవారికి న్యాయం జరగాలని కోరుకుంటున్నాం. పేద ప్రజలందరికీ కనీసం పౌష్టికాహారం కొంతవరకైనా ఇవ్వాలనే ఉద్దేశంతో ఆరోజు ఎన్.టి.రామారావు గారు రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం తీసుకొచ్చారు.

...

అనేక సంక్షేమ కార్యక్రమాలకు నాంది పలికింది తెలుగుదేశం ప్రభుత్వమే. ఈరోజు విభజన తరువాత కొన్ని ఆర్థిక ఇబ్బందులున్నాయి. అయినా కూడా ఇటీవలి కాలంలో పేదవాళ్లందరికీ రూ.200/- వృద్ధాప్య పింఛను, వితంతు పింఛనులను అయిదు రెట్లు పెంచి రూ.1000/-ఇస్తున్నాము. అదే మాదిరిగా పేదవాళ్లల్లో ఎవరైతే వికలాంగులున్నారో రూ.500/-నుంచి రూ.1500/- అంటే మూడు రెట్లు పెంచి వాళ్లకు కూడా పింఛను ఇవ్వడం జరిగింది. దీనివలన రూ.5000 కోట్లు అదనంగా ప్రభుత్వానికి భారమయ్యే పరిస్థితి ఉంది. ఆ రూ.5000 కోట్లు కూడా భరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. చాలా మంది పేదవాళ్లు, నిరుపేదలు పండుగ పూట కూడా సరైన పౌష్టికాహారం లేకుండా బాధపడుతున్నారు. డబ్బులుండే వాళ్లకే పండుగలు ఉన్నాయి. కాబట్టి పేదవాళ్లు కూడా ఆనందంగా పండుగలు జరుపుకోవాలనే ఉద్దేశంతో రూ.287 కోట్ల భారం పడుతున్నా ఈరోజు ఈ సంక్రాంతి కానుకగా పేదవాళ్లకి సరఫరా చేస్తున్నామని మీకు తెలియచేస్తున్నాను.

భవిష్యత్తులో కూడా పేదవాళ్లందరికీ 5కేజీల చొప్పున బియ్యం కూడా ఇవ్వడానికి కుటుంబంలో 5మంది ఉన్నా, ఆరు మంది ఉన్నా ఒక్కొక్కరికీ 5 కేజీల చొప్పున బియ్యం ఇచ్చే కార్యక్రమం ఏప్రిల్ మొదటి తారీఖు నుంచి ప్రారంభమవుతుంది. కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మందికి 5కేజీల చొప్పున మనమిచ్చే అవకాశం కూడా ఉంది. దీని వలన ఆర్థిక ఇబ్బందులున్నా, అదనపు భారం పడే పరిస్థితి ఉన్నా ఈ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం ఆలోచిస్తూ పేదలకు అనుకూలంగా ఏ పని చేసినా అటు రైతులని, పేదవాళ్లని దృష్టిలో పెట్టుకుని చేయడం కోసమే నేను ఈ కార్యక్రమాన్ని ప్రకటిస్తున్నాను. ఈ కార్యక్రమం ప్రారంభం మాత్రమే. పేదవాళ్లకు న్యాయం చేయడం కోసం, పేదరిక నిర్మూలన చేసే వరకూ తెలుగుదేశం పార్టీ పేదవాళ్లకు అండగా ఉంటుందని మరొక్కసారి తెలియచేస్తూ అందుకు ప్రారంభం మాత్రమే ఈ సంక్రాంతి కానుక. ఇలాంటివి రాబోయే రోజుల్లో ఏ విధంగా ఇవ్వాలో ఆలోచించి పేదవాళ్లను అన్ని విధాలుగా ఆదుకుంటానని మరొక్కసారి మీద్వారా తెలియచేసుకుంటూ రాష్ట్రంలోని పేదవాళ్లంద రికీ విజ్ఞప్తి చేస్తున్నాను. "ఈ ప్రభుత్వం పేదల ప్రభుత్వం, మీ ప్రభుత్వం. మిమ్మల్ని అన్ని విధాలుగా ఆదుకోవడానికి సర్వశక్తులు ఉపయోగించి మీకు అండగా ఉంటానని తెలియచేసుకుంటూ ఈ సంక్రాంతి శుభ సందర్భంగా మరొక్కసారి క్రిస్మస్, నూతన సంవత్సర, సంక్రాంతి పండుగలన్నింటినీ కూడా పేదవాడు ఆనందంగా జరుపుకునే విధంగా ముందుకు పోతానని తెలియచేసుకుంటూ అందరికీ క్రిస్మస్, నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలను తెలియచేస్తున్నాను". ఈ సంవత్సరం నుంచీ ప్రతీ పేదవాడి జీవితంలో వెలుగు చూడాలనేది తెలుగుదేశం పార్టీ ధ్యేయం అందుకు నిరంతరం పనిచేస్తానని హామీ ఇస్తూ సెలవు తీసుకుంటున్నాను.

MR.SPEAKER: Now, the Government Resolution by Sri B.Gopala Krishna Reddy garu, Environment and Forest.

## ప్రభుత్వ తీర్మానం
## పర్యావరణం, అడవులు, శాస్త్ర మరియు సాంకేతిక విజ్ఞానం, సహకార శాఖ మంత్రి
## శ్రీ బి.గోపాలకృష్ణారెడ్డిః

అధ్యక్షా, కొల్లేరు వన్యప్రాణుల అభయారణ్య సరిహద్దును +5 కాంటూరు నుండి +3 కాంటూరుకు కుదింపు కొరకు తీర్మానాన్ని ప్రవేశ పెడుతున్నాను.

" పశ్చిమ గోదావరి జిల్లాలోని 13,899.47 ఎకరాలు, కృష్ణా జిల్లాలోని 961.86 ఎకరాలు మొత్తం 14,861.33 ఎకరాల జిరాయితీ భూములను కలిపి 30,855.20 హెక్టార్లకు పైబడి +5 కాంటూరు వరకు ఉన్న కొల్లేరు సరస్సు ప్రాంతాన్ని, ఇఎఫ్ఎస్&టి (అడవులు. III) శాఖ వారి 04.10.1999 తేది నాటి జీ.ఓ.ఎం.ఎస్.నెం.120 ద్వారా, వన్యప్రాణుల అభయారణ్యంగా ప్రకటించారు.

రసాయన ఎరువులు వినియోగించకుండా సాంప్రదాయిక వ్యవసాయం ద్వారా ఆ రైతులు తగినంత ఆదాయాన్ని పొందలేకపోతున్నారు. భూములను సేకరించుట కోసం యజమానులకు ఇంత వరకు పరిహారం చెల్లించలేదు. ఆ భూముల సేకరణ నిమిత్తం చెల్లించాలని ప్రతిపాదించిన పరిహారం వల్ల రాష్ట్ర ఖజానాపై పెను భారం పడుతుంది.

రైతుల సమస్యలు ఉపశమింపచేయుటకు గాను కొల్లేరు వన్యప్రాణుల అభయారణ్య సరిహద్దును +5అడుగుల కాంటూరు నుండి +3అడుగుల కాంటూరుకు కుదించడానికి సిఫారసు చేయవలసిందిగా వన్యప్రాణుల జాతీయ మండలి, భారత ప్రభుత్వం, కేంద్ర సాధికార కమిటీలను కోరాలని ఈ సభ తీర్మానిస్తున్నది".

అధ్యక్షా, ఈ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించాలని కోరుతున్నాను.

(ఈ సందర్భంలో శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి మాట్లాడటానికి అవకాశం ఇవ్వాలని కోరారు)

మిస్టర్ స్పీకర్ః నేను మీ వైపు చూశాను. మీరు ఒకసారి చేయెత్తి దించారు. మీరు మాట్లడరేమోనని అనుకున్నాను.

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డిః స్పీకర్ గారూ ఒక యునానిమస్ రిజల్యూషన్‌ని తీసుకునేటప్పుడు అందరం దానికి సహకరించాలని అనుకున్నప్పుడు.....

MR.SPEAKER: Nobody said 'No'. Please speak.

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డిః సార్, నేను మాట్లాడుతున్నాను. గత చరిత్ర కూడా మనం మాట్లాడుకోవలసిన అవసరం ఉంది. ఇది పశ్చిమ గోదావరి, కృష్ణా రెండు జిల్లాలకు సంబంధించిన అంశం. ఏలూరు నుంచి కైకలూరు వరకు ఎంతో మందికి సంబంధించిన విషయం. ఆ ప్రాంతంలో ఉండే వాళ్లందరికీ న్యాయం చేయాలనే ఉద్దేశంతో దివంగత నాయకులు డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సభలో తీర్మానాన్ని ప్రతిపాదించడం జరిగింది. ఆ రిజల్యూషన్‌తోబాటు అందరూ ఢిల్లీకి వెళ్లి, కేంద్ర మంత్రి శరద్‌పవార్‌ని కలిసినప్పుడు శరద్‌పవార్‌గారు స్వయంగా చెప్పడం జరిగింది. "ఇటువంటి పరిస్థితి మహారాష్ట్రలో కూడా ఉంది, కానీ మేము చేయలేకపోయాము, అసెంబ్లీ నుంచి తీర్మానం తెచ్చి మంచి పని చేశారు" అని శరద్ పవార్ గారు అభినందించడం జరిగింది. ఆ సమయంలో పాసైన రిజల్యూషన్ గురించి మాట్లాడకుండా ఇప్పుడు మరలా రిజల్యూషన్ పెట్టడం ఎందుకు? ఆ రిజల్యూషన్ లైవ్‌లో ఉంది కదా దానిని మేము ఇష్యూ చేయాలని కాదు గానీ ఒక దివంగత నాయకుడు అన్ని విధాలుగా చేయాలని ప్రయత్నం చేసిన విషయం అందరికీ తెలుసు. ఆయన ఏ రకంగా ప్రయత్నం చేసిందీ,ఆ ప్రాంతంలో ఉన్నటువంటి ప్రజలకు ఏ రకంగా మేలు చేయాలి ఆ కాంటూరు లెవల్ తగ్గించడం వలన మిగిలిన ప్రాంతంలో ఆ రైతులకి పాండ్స్ ఎత్తేయమని సుప్రీంకోర్టు ఆర్డర్ కూడా ఇచ్చింది. ఆ విధంగా వాళ్లకు న్యాయం చేయాలని అనునిత్యం తపించిన వ్యక్తి పేరు కూడా చెప్పలేకపోవడం దురదృష్టకరంగా భావిస్తున్నాము. ఆ సమయంలో రిజల్యూషన్ పాస్ అయింది కాబట్టి మరలా రెండోసారి రిజల్యూషన్ పాస్ చేయడం అవసరమా, ఆ రిజల్యూషన్ తీసుకుని మనం ప్రయత్నం చేద్దాం. ఇదేమీ చెప్పకుండా వాళ్లు గొప్పలు చెప్పుకోవడం ఎంత వరకు సమంజసం? ఒక మంచి కార్యక్రమం చేసిన సందర్భంలో గత చరిత్ర కూడా చెప్పుకోవాలి. తాను నిజంగా ప్రమాదంలో మరణించకపోయి వుంటే ఆ ప్రాంతంలో ఖచ్చితంగా మంచి కార్యక్రమం చేపట్టాలని అన్ని రకాలుగా ఆలోచన చేశారు. అవన్నీ వాళ్లకు తెలుసు. కానీ కేవలం వాళ్ల భజన చేసుకోవడం తప్పితే గతంలో చేసిన మంచి పనులను అభినందించాలనే ఇంగిత జ్ఞానం కూడా వాళ్లకు లేదు.

అధ్యక్షా, నేను కోరేది ఒక్కటే. గత ప్రభుత్వం రిజల్యూషన్ పాస్ చేసిన తరువాత మరలా ఇప్పుడు అవసరమా, ఆ రిజల్యూషన్‌ని లైవ్‌లోకి తీసుకుని దానిపైన అందరం ప్రయత్నం చేద్దాం. ఆ రకమైన పాజిటివ్ యాటిట్యూడ్‌లో పొమ్మని మిమ్మల్ని కోరుతున్నాను.

శ్రీ వి.వి.శివ రామరాజు(ఉండి) ః అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు కొల్లేరు 5వ కాంటూరుని 3వ కాంటూరుకి కుదించాలని ఈరోజు సభలో తీర్మానం పెట్టడం మా ప్రాంతవాసులందరికీ శుభ పరిణామంగా మేము భావిస్తున్నాం. 2006వ సంవత్సరంలో కొల్లేరుని ఆనాటి ప్రభుత్వం విధ్వంసం చేసి, బాంబుల సంస్కృతిని తీసుకువచ్చి చెరువులన్నింటినీ బాంబులతో కొల్లగొట్టి అక్కడ ప్రజా జీవనాన్ని విధ్వంసం చేయడం వలన ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయాయి.

(ఈ సందర్భంలో వైకాపా సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయసాగారు)

...

ఈరోజు ఒకళ్లకు ఉపాధిని కల్పించాలంటే ఎంతో కష్టతరమైనది. అటువంటిది అక్కడ లక్షలాది కుటుంబాల జీవిన విధానాన్ని విధ్వంసం చేసి, జీవన ప్రమాణాలను దెబ్బదీసి, వాళ్లందరూ కూడా ఎంతో ఉన్నత విలువలతో పిల్లలందరినీ చక్కగా చదివించుకుంటూ విలువలతో కూడిన జీవితాలను జీవిస్తుంటే, అటువంటి జీవితాలను విధ్వంసం చేసి వాళ్లందరినీ అనాధలుగా, అభాగ్యులుగా, వలస పక్షులుగా తయారు చేశారు. ఈరోజు ఈ కొల్లేరు అభయారణ్యం వన్యప్రాణుల సంరక్షణ క్రింద తీర్చిదిద్దుతామని అదంతా కూడా టూరిజం క్రింద అభివృద్ధి చేస్తామని, వాళ్లందరికీ నష్టపరిహారాన్ని చెల్లిస్తామని ఎన్నో కబుర్లు చెప్పి, వాళ్లందరినీ భయభ్రాంతులకు గురిచేసి ఆరోజున మొత్తం విధ్వంసం చేసి, కొల్లేరు సదస్సు అనేదే లేకుండా కొల్లగొట్టినప్పుడు మొత్తం అంతా కూడా డ్రైన్లన్నింటినీ పూడ్చేసి, అక్కడికి వచ్చే డ్రైన్ వాటర్‌తో కొల్లేటి సదస్సు మొత్తం పూర్తిగా పొల్యూట్ అయ్యింది. ఈరోజు మన ముఖ్యమంత్రివర్యులు 3వ కాంటూరు వరకు దానిని కుదించి, 3వ కాంటూరు వరకు సదస్సును బాగా డెవలప్ చేసి అక్కడ 3వ కాంటూరు 5వ కాంటూరులో ఉన్న సుమారు 123 గ్రామాలకు సంబంధించిన ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా, సుమారు 35 వేల ఎకరాలను అక్కడి ప్రజలు వ్యవసాయం చేసుకునే విధంగా వెసులుబాటు కలిగించే విధంగా, కేంద్ర ప్రభుత్వానికి సిఫార్స్ చేసి, సుప్రీంకోర్టు సాధికారిత కమిటీలో కూడా ఈ అంశం ఉంది కాబట్టి లీగల్ ఇష్యూస్ కూడా ఇన్వాల్వ్ అయి ఉన్నాయి కాబట్టి, ఆ లీగల్ ఇష్యూస్ అన్నింటినీ సార్టవుట్ చేసి నరేంద్రమోడీ గారు ఆరోజు భీమవరంలో జరిగిన సభలో కూడా కొల్లేరు స్థితిగతుల పైన తప్పకుండా దృష్టి పెట్టి కొల్లేరు ఇష్యూస్‌ని పరిష్కరిస్తానని ప్రధాన మంత్రి గారు కూడా మాట ఇచ్చారు కాబట్టి వెంకయ్యనాయుడు గారు కూడా ఒక తీర్మానం ఉంటే బాగుంటుందని చెప్పడం జరిగింది కాబట్టి మన ప్రియతమ ముఖ్యమంత్రి గారు ఈ తీర్మానాన్ని ప్రవేశ పెట్టడం మా ప్రాంత వాసులందరికీ హర్షించదగిన విషయం.

అదే విధంగా రానున్న రోజుల్లో 3వ కాంటూరు వరకు కూడా కుదించుకొని దానిని ఒక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ క్రింద చేసుకొని తద్వారా మిగిలిన ఆయకట్టుకు నీరందించుకుంటూ ఆ ప్రాంతాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయాలనే ఆలోచనతో మన ముఖ్యమంత్రి గారు ఉన్నారు. అదంతా మాకు సంతోషించదగిన విషయం. రైతులందరికీ ఎంతో మేలు చేసే అంశం. ఈరోజు శ్రీకాంత్‌రెడ్డి గారు మాట్లాడుతూ దివంగతనేత తీర్మానం చేశారని చెబుతున్నారు. అదే నేత 2006వ సంవత్సరంలో చెరువులన్నింటినీ ద్వంసం చేసి ప్రజల జీవనప్రమాణాలకు భంగం కలిగించి మమ్ములందరినీ నాశనం చేశారనేది ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

శ్రీ చింతమనేని ప్రభాకర్ (దెందులూరు): అధ్యక్షా, కొల్లేరు పరిధిని 5వ కాంటూరు నుండి 3వ కాంటూరుకు కుదింపు అంశాన్ని ఈ రోజు ప్రవేశ పెట్టినందుకు గౌరవ ముఖ్యమంత్రి గారికి అదే విధంగా బొజ్జల గోపాల కృష్ణారెడ్డి గారికి, దీనికి సహకరించిన వారందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలను తెలియజేసుకుంటున్నాను. మిత్రులు శ్రీకాంత్‌రెడ్డి గారు మాట్లాడుతూ దివంగతనేత రాజశేఖరరెడ్డి గారు ఈ యొక్క కొల్లేరు అంశాన్ని తీసుకొని ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఢిల్లీకి తీసుకొచ్చినందుకు అక్కడ అభినందించారని చెప్పడం జరిగింది. అది 2006లో, 1999లో 120 జీఓ వచ్చినప్పటికీ కూడా కొల్లేరు ప్రాంత ప్రజల యొక్క జీవన వ్యవస్థ అంతా కూడా దెబ్బతింటుందని, ప్రభుత్వం దాని మీద కొంత ఉదార వైఖరిని అవలంభిస్తూ అక్కడి మనుషుల ప్రాణాల విలువను గమనించి ఎదరెళితే, ఆయన ఒక ప్రాంతానికి సంబంధించిన వ్యక్తులు వీళ్లు, ఒక పార్టీకి సంబంధించిన వ్యక్తులని చెప్పి 2006లో నిర్ధాక్షణ్యంగా బాంబులంటే ఏమిటో తెలియని కొల్లేరు ప్రాంతంలో బాంబులతో పేల్చి ఆ గట్టుల్ని కూలగొట్టిన చరిత్ర రాజశేఖరరెడ్డిగారి నాయకత్వంలో ఆనాడు జరిగిందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

కొల్లేరు అంటే మన శ్రీకాంత్‌రెడ్డి గారు అంటున్నారు. దాని పరిధి ఏలూరు నుండి కైకలూరు వరకు ఉందని. అది ఎన్ని నియోజక వర్గాల్లో ఉంది, ఎవరెవరు ఆ ప్రాంతంలో ప్రాతినిధ్యం వహిస్తున్నారో కూడా వాళ్ల తరఫున ఈరోజు శాసనసభలో అడిగేవారు ఒక్కరు కూడా లేరని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. కొల్లేరు గురించి ఆరోజు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మీకోసం పాదయాత్రలో, కొల్లేరు ప్రాంతంలో జరిగిన నష్టాన్ని చూసి ఆ ప్రాంత ప్రజలను పరామర్శించడానికి చంద్రబాబు నాయుడు గారు మీకోసం పాదయాత్ర సందర్భంగా వస్తే – మేము అసెంబ్లీలో దీని మీద బిల్లు పెడతాము, ప్రైవేటు బిల్లు అయినా సరే అని ఆయన అక్కడ చెబితే, మీరు ఇక్కడికి వచ్చి అసెంబ్లీలో బిల్లు పెడితే మేము పూర్తిగా మా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో మద్ధతు తెలియజేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆ సభ్యులకు గుర్తు చేస్తున్నాను. ఆరోజున శ్రీకాంత్‌రెడ్డి గారు శాసనసభలో లేరు. ఈరోజున ఎవరైతే కొల్లేరు ప్రాంత ప్రజల యొక్క జీవన ప్రమాణాలకు గండి కొట్టారో, వారెవరు కూడా అడ్రస్ లేకుండా పోయారని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఇదే కాకుండా కీ.శే. జలగం వెంగళరావు గారు కొల్లేరు సదస్సును ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వాళ్లతో నిర్బంధంగా చేపల సాగు చేయండని ఈ కల్చర్‌ని ప్రభుత్వమే ప్రోత్సహించి, ప్రభుత్వమే ఆచరణలోనికి తీసుకొచ్చి, ఈనాడు ఆనాడు ఉన్న రాజశేఖరరెడ్డి గారి ప్రభుత్వం కూలగొట్టిందనే విషయాన్ని కొల్లేరు ప్రాంత ప్రజలు జన్మజన్మలకు మర్చిపోరని తెలియజేస్తున్నాను. దీనికి ప్రత్యేకమైన ఉదాహరణ నా నియోజకవర్గంలో 14 గ్రామాలు ఉంటే, ఆ 14 గ్రామాలు, పూర్తిగా కొల్లేరు ప్రాంతమంతా కూడా కేవలం వీళ్లు చేసిన దారుణానికే కట్టుబడి ఆ నష్టాన్ని భరించి ఈరోజున మా పార్టీ అధికారంలోకి రావడానికి, వాళ్లకు జరిగిన నష్టాన్ని తెలుగుదేశం పార్టీయే పూడ్చగలుగుతుందనే నమ్మకంతో విశ్వాసంతో పని చేయడం జరిగిందని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

ప్రధానమంత్రి గారు భీమవరం సభలో మాట్లాడుతూ, అప్పుడు ప్రధాన మంత్రి కాకపోయినప్పటికీ భీమవరం సభలో మాట్లాడుతూ మరి కొల్లేరు ప్రజలను ఆదుకుంటామని చెప్పడం జరిగింది. ఆ మాట మీద మొన్న ముఖ్యమంత్రి గారు కూడా ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకొని ఈయొక్క కాంటూరు పరిధిని తగ్గించి 33 వేల ఎకరాలను మా ఉండి ఎమ్మెల్యేగారు చెప్పినట్లుగా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను ఏర్పాటుచేసి, అదే విధంగా పర్యటక కేంద్రంగా కూడా అభివృద్ధి చేస్తూ కొల్లేరుకు పూర్తి న్యాయం జరిగే వరకు ఈ పార్టీ, ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది. అదే విధంగా అక్కడ ఉన్న 14 వేల ఎకరాల జిరాయితీ భూమి కూడా, ఈనాడు పిల్లలకి పెళ్లిళ్లు కావడం లేదు, ఆ భూమి కొనేవాళ్లు లేరు. ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదు. 2006 నుండి ఈరోజు వరకు కూడా ఎప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తుందా, ఎప్పుడు మా జీవితాలు బాగుపడతాయా అని మా ప్రాంత ప్రజలందరు ఎదురు చూశారు.

అధ్యక్షా మీరు అన్నారు. వారి విషయంలో మేము ఇన్వాల్వ్ కావడం బాగుండదు గానీ, ఎవరైనా మాట్లాడాతారా అన్నారు. వారు మాట్లాడటానికి, ఆసలు ఆ కొల్లేరు ఏమిటో వారి సమస్యలేమిటో, వాళ్లకు ఉన్న ఇబ్బందులు ఏమిటో ప్రతిపక్ష నాయకులు గారికి తెలియదు. అది ఎన్ని వేల కిలో మీటర్ల పరిధిలో ఉన్నది, దాని విస్తీర్ణం ఎంత, నష్టపోయిన రైతాంగం ఎవరు, ఏమి జరిగిందనే విషయాలు వాళ్లకు అవగాహన లేక మాట్లాడకుండా ఉన్నారు. ఈరోజున ఏదో ఏలూరు నుండి కైకలూరు వరకు కొల్లేరు ఉందని చెబుతున్నారంటే, వాళ్లకు ఏ మాత్రం ఈ యొక్క ప్రజా సమస్యల మీద అవగాహన ఉందో మీరందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా తెలియజేస్తూ నాకు ఈ అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలను తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

…

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి(పులివెందుల): అధ్యక్షా, చంద్రబాబు నాయుడు గారు తన పార్టీ ఎమ్మెల్యేల చేత చక్కటి కట్టు కథలను మాత్రం చాలా బాగా చెప్పిస్తారు. గతంలో చంద్రబాబు నాయుడు గారు తొమ్మిది సంవత్సరాలు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. తొమ్మిది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండిన కాలంలో కొల్లేరు సమస్యపైన సభలో ఎందుకు తీర్మానం చేయలేదు? రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రిగా రాష్ట్ర బాధ్యతలు చేపట్టాక వారి హయాంలోనే ఎందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాల్సి వచ్చింది? ఎందుకు చంద్రబాబు నాయుడు గారి హయాంలో తీర్మానం చేయలేకపోయారో చెప్పండి.

అధ్యక్షా, చివరకు గతంలో రాజశేఖరరెడ్డి గారు అసెంబ్లీలో చేసిన తీర్మానాన్నే మళ్లీ ఈనాడు చంద్రబాబు నాయుడు గారు రెండవసారి కొత్తగా తీర్మానం చేస్తున్నట్టుగా బిల్డప్ ఇచ్చి సభ ముందు తీర్మానాన్ని ప్రతిపాదించారు. మాటి మాటికి కొల్లేరు ప్రాంతంలో గతంలో బాంబులు వేసి పేల్చినట్టుగా అధికార పక్షం వైపు సభ్యులు గగ్గోలు పెడుతున్నారు. కానీ, ఆ

వెనుక బ్యాక్ గ్రౌండ్ ఏమిటి? గతంలో సుప్రీం కోర్టు ఒక జడ్జిమెంట్ ఇచ్చింది. ఎటువంటి పరిస్థితుల్లోను కొల్లేరు కట్టలను తొలగించాలని సుప్రీం కోర్టు జడ్జిమెంట్ ఇచ్చిన కారణంగానే గత ప్రభుత్వం ఆ జడ్జిమెంట్‌కు అనుగుణంగా స్పందించింది. ఏ ప్రభుత్వమైనా సరే సుప్రీమ్ కోర్టు తీర్పును శిరసావహించాల్సిందే కదా! ఆ ప్రకారం గత ప్రభుత్వం నడుచుకోవడం జరిగింది. సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ఇచ్చిన తరువాతనే ప్రజలకు నష్టం జరుగుతుందనే విషయాన్ని గ్రహించి, వాళ్లకు న్యాయం జరగాలనే తలంపుతో రాజశేఖరరెడ్డి గారు ఆనాడు శాసనసభలో తీర్మానాన్ని పెట్టి, ఆ తీర్మానం పైన మళ్లీ సానుకూలంగా పలకండని కేంద్ర ప్రభుత్వానికి తీర్మానాన్ని పంపించడం జరిగింది. కానీ దురదృష్టవశాత్తు రాజశేఖరరెడ్డి గారు చనిపోయారు. చనిపోయారు కాబట్టి సదరు విషయం కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిదని, ఆల్‌రెడీ సుప్రీం కోర్టుకు సంబంధించిన కేసులు పెండింగ్‌లో ఉన్నాయి కాబట్టి, వాటినన్నింటిని అధిగమించి కేంద్రం తీర్మానం చేయాలి కాబట్టి ఆ అంశం ముందుకు జరగలేకపోయింది. ఇప్పటికైనా సరే పాలకులు కళ్లు తెరిచారు.

అధ్యక్షా, ఇప్పుడు ఆ అంశం పైన రాజకీయం చేస్తున్నప్పటికి ప్రభుత్వం కళ్లు తెరిచింది. చాలా సంతోషం. కనీసం ఇప్పటికైనా ఆ కొల్లేరు ప్రజల పైన కాస్తో, కూస్తో ప్రేమ కల్గినందుకు మాకు సంతోషంగా ఉంది. భారత ప్రధాన మంత్రి గారైన శ్రీ నరేంద్ర మోదీ గారు కూడా అంశంపైన స్పందించారు. మరొకసారి అంశాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్దాం. మేం కూడా అందుకు సిద్ధంగానే ఉన్నాం. మా తరఫున కూడా ఆ అంశంపైన సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నందుకు సంతోషంగా ఉంది.

శ్రీమతి పీతల సుజాత(చింతలపూడి): అధ్యక్షా, థ్యాంక్యూ సార్. ఈరోజున కొల్లేరు ప్రాంత ప్రజల కష్టాలను దగ్గరుండి చూసిన తరువాత వాళ్లందరూ బాగుపడాలి, కష్టాలనుంచి గట్టెక్కాలని, అభివృద్ధి చెందాలనే ఏకైక లక్ష్యంతో కొల్లేరు ప్రజల ఆశాజ్యోతిగా కీర్తించబడుతున్నటువంటి గౌరవ పూజ్యులు, ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఈరోజున కొల్లేరు ప్రజల కొర్కెలను తీర్చడానికి, కష్టాలను తీర్చడానికిగాను అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం ప్రవేశపెట్టినందుకు ప్రత్యేకంగా జిల్లా తరఫున నా హృదయపూర్వక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఈనాడు ఏ ప్రజా సమస్య పైన దృష్టి పెట్టకుండా, ఎటువంటి అవగాహన లేకుండా, ఎటువంటి ఆలోచన ప్రజా సమస్యలపైన చేయకుండా కేవలం అధికారపక్షం పైన దాడి చేసే ప్రయత్నాన్ని మాత్రమే ప్రతిపక్షపార్టీ చేస్తున్నట్టుగా అర్థమవుతోంది. కేవలం నోటికి వచ్చిన విషయాన్ని మాట్లాడే ధోరణిలోనే ప్రతిపక్షపార్టీ సభ్యుల ప్రవర్తన ఉంది తప్ప మరొకటికాదు. అన్నింటిని ప్రజలు గమనిస్తున్నారు. ఇప్పటికైనా సరే ప్రజా సమస్యల పైన ప్రతిపక్షపార్టీ సభ్యులు స్పందిస్తే ప్రయోజనముంటుందని నేను భావిస్తున్నాను.

అధ్యక్షా, అసలు కొల్లేరు ప్రాంత ప్రజలు ఎవరి హయాంలో కష్టాలు పడ్డారు? గత తొమ్మిది సంవత్సరాల చంద్రబాబు నాయుడు గారి హయాంలో కొల్లేరు ప్రాంత ప్రజలకు ఎటువంటి కష్టం కల్గలేదు. ఆ తరువాత పది సంవత్సరాల పాటు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ పాలకుల హయాంలోనే కొల్లేరు ప్రజలు అనేక కష్టనష్టాల పాలైనారనే నిజాన్ని అందరూ గ్రహించాలి. ముఖ్యంగా దివంగత స్వర్గీయ రాజశేఖరరెడ్డి గారి హయాంలోనే కొల్లేరు ప్రాంత ప్రజలు ఎక్కువ కష్టాలు పడ్డారు. కానీ, అన్నింటిని మరచి ఈనాడు సభలో దారుణంగా మాట్లాడుతున్నారు.

అధ్యక్షా, ఆనాడు సభలో తీర్మానం పెట్టారని ప్రతిపక్షపార్టీ నాయకుడు సభలో మాట్లాడుతున్నారు. కానీ తీర్మానం ఎప్పుడు పెట్టారు? కొల్లేరు ప్రాంతంలో రక్తపాతం చిందించాక సభలో తీర్మానం పెట్టారు. రాయలసీమ ప్రాంతంలోని ఫ్యాక్షన్ సంస్కృతినంతా పశ్చిమ గోదావరి జిల్లాకు తీసుకువచ్చి బాంబ్‌బ్లాస్ట్‌తో చెరువులనన్నింటిని పగులగొట్టి ఎక్కడికక్కడ చెరువులను కొట్టేసిన తరువాత మాత్రమే ప్రేమ ఒలకబోసి అసెంబ్లీలో తీర్మానం చేశారు.

అధ్యక్షా, నూతన రాష్ట్రంలో ఈనాడు కొల్లేరు ప్రాంత ప్రజల మనోభావాలకనుగుణంగా ఈనాడు గౌరవ ముఖ్యమంత్రి గారు అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రతిపాదించారు. మానవత్వం మీకుంటే ప్రతిపాదించిన తీర్మానానికి మద్దతు ప్రకటించాలి. లేకుంటే, ఈ జన్మకు మీరు బాగుపడరు. ఈ జన్మకు మీరు మారరంతే.

శ్రీ కామినేని శ్రీనివాస్ (కైకలూరు): అధ్యక్షా, దయచేసి గౌరవ సభ్యులనందరిని కోరుతున్నాను. నేను చెప్పే విషయాలను అందరూ ప్రశాంతంగా వినండి. నేను కేవలం నిజాలే చెబుతున్నాను. విన్న తరువాత ఏం చేయాలనే విషయమై అందరం ఆలోచన చేద్దాం.

అధ్యక్షా, నేను కొల్లేరు ప్రాంతం నుంచి సభ్యుడిగా సభకు వచ్చాను. నాది కైకలూరు నియోజకవర్గం. కొల్లేరు ప్రాంత పరిధిలో ఇవాళ నాలుగు నియోజకవర్గాలు, రాష్ట్ర విభజనానంతరం ఏడు నియోజకవర్గాలు ఉండేడివి. కైకలూరు, ఉండి, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాలు కొల్లేరు ప్రాంత పరిధిలో ఉన్నాయి. పూర్వం తాడేపల్లిగూడెం, అత్తిలి, ఏలూరు టౌన్ కూడా కొల్లేరు ప్రాంతం క్రింద ఉండేది. ఇందులో 78 వేల ఎకరాల్లో ఐదవ కాంటూరులోపు. ఐదుకు మూడుకు మధ్యలో 33 వేలు, లోపల 48 వేల ఎకరాల పరిధి.

అధ్యక్షా, గౌరవ ప్రతిపక్షపార్టీ సభ్యుడు, శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి గారు మాట్లాడుతూ అప్పుడు ఎందుకు తీర్మానం పెట్టలేదు, ఇప్పుడే ఎందుకు తీర్మానం పెట్టవల్సి వచ్చిందని ఇందాక

మాట్లాడారు. కానీ అప్పుడు కంబైన్డ్ స్టేట్‌లో తీర్మానం పెట్టాం. ఇప్పుడు మళ్లీ చేయాల్సి ఉంది. అలాగే ప్రతిపక్షనాయకుడు, జగన్మోహన్ రెడ్డి గారు ఒక విషయాన్ని చెప్పారు. అప్పుడు కొల్లేరు ప్రాంతం ప్రశాంతంగా ఉండేది. ఆనాడు ఆ ప్రాంత ప్రజల జీవితాల్లో గత ముప్పై ఏళ్లలో వెలుగు చూసింది. ఆనాడు తీర్మానం చేయాల్సిన అవసరం లేకుండా పోయింది కాబట్టి సభలో తీర్మానం చేయలేదు. దయచేసి నేను చెప్పే నిజాలను వినండి.

నేను చెప్పే నిజాలు ఎవరి గొప్ప పొందడానికో కాదు. కానీ వాస్తవం అందరికీ తెలియాల్సి ఉంది. అందుకే దయచేసి వినండి. కొల్లేరు ప్రాంతంలో 2006వ సంవత్సరంలో నిజంగా డెమాక్రసీ ఉందా, ఎమర్జన్సీ ఉందా అన్నట్టుగా నిజంగానే సర్రాజ్ అనే ఎమ్మెల్యేకు చెందిన చేపల చెరువులనే బాంబులు పెట్టి పేల్చారు. ప్రొక్లైనర్లతో చెరువులను ధ్వంసం చేసి ఒక భయానక వాతావరణాన్ని ఆనాడు ప్రభుత్వం సృష్టించింది. ఆ కాలంలో సుమారు రెండు నెలల పాటు ఇంట్లో నుంచి బయటకు వచ్చేందుకు కూడా ప్రజలు వెనుకాడేవారు. ఈ రకంగా చేసి మొత్తం జనజీవన స్రవంతిని మంటగలిపారు.

అధ్యక్షా, కొల్లేరు ప్రాంత అభివృద్ధి పైన కేవలం ఆనాటి ప్రభుత్వం రెండు మాటలు చెప్పింది. అందులో ఒకటి ఆ ప్రాంతాన్ని పర్యావరణం చేస్తామని, రెండవది ఆ ప్రాంతానికి పూర్వవైభవాన్ని తీసుకువస్తామని ఆనాటి ప్రభుత్వం చెప్పింది. దయచేసి ఒక విషయం గమనించండి. గతంలో ఎప్పుడు కొల్లేరు ప్రాంతానికి పూర్వ వైభవం లేదు. కొన్ని వందల సంవత్సరాల క్రితమే వడ్డీలనే తెగ దేశంలో ఎక్కడా లేదు. కేవలం కొల్లేరు ప్రాంతంలోనే ఆ తెగ ఉంది. అక్కడే కొందరు దళితులు కూడా నివాసం ఉన్నారు. ఆ తెగలకు చెందిన ప్రజలు నిత్యం కట్టుడు బట్టలు లేక పురుషులు గోచిలు పెట్టుకుని, మహిళలు రెవికలు కూడా ధరించకుండా అల్లిబిల్లికాయలు, నత్తలు కొట్టుకుని తినేవారు. అలాగే వంటి నిండా జల్లం ఉండేది. అది వాళ్లకు పూర్వవైభవం. వాళ్లకు ఆనాడు సహాయం చేసింది కేవలం ముగ్గురే ముగ్గురు నాయకులు. ఈనాటికి అక్కడి ప్రజలు ఆ నాయకుల ఫోటోలు పెట్టుకుని పూజిస్తున్నారు. స్వర్గీయ జలగం వెంగళరావు గారిని రాష్ట్రంలో ఎక్కడా స్మరించరు, కానీ కొల్లేరు ప్రాంతంలో స్మరిస్తారు. అలాగే స్వర్గీయ నందమూరి తారకరామారావు గారిని, ఎందుకంటే ఆ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఆ తరువాత శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు. రోడ్లు వేయడం, కరెంటు సౌకర్యాన్ని కల్పించడం, త్రాగునీటి సరఫరా చేయడం వంటి కార్యక్రమాలను ఆనాడు ఆ ముగ్గురు నాయకులు చేస్తే, ఆ తరువాత ఆ కార్యక్రమాలు కనుమరుగైనాయి. ఆ కారణాల ప్రస్తావనకు నేను పోను గానీ దురదృష్టకరమేమిటంటే కొల్లేరు ప్రాంత ప్రజలు జీవితాలు గత పది సంవత్సరాల కాలంలో సర్వనాశనమైపోయినాయి. జీవితాలు నాశనం చేయడమే గాకుండా వారి జీవితాల్లో పూర్వవైభవం తీసుకువస్తామనే ప్రగల్భాలు గత పది సంవత్సరాల కాలంలో రాష్ట్రాన్ని పరిపాలించిన పాలకులు పలికారు. మొత్తం ఉన్న 78 వేల ఎకరాల టూరిజమ్ ప్రాంతంలో కేవలం 300 ఎకరాల టూరిజం ప్రాంత పరిధిలో ఉండే పాత చెరువులకు మాత్రమే

పెలికాన్స్ వస్తున్నాయి. మిగితా 77,700 ఎకరాల పరిధి ఇవాళ కిక్కిస, గుర్రపుడెక్కతో కింకారణ్యంలాగా ఆ కొల్లేరు ప్రాంతముంది. గత పది సంవత్సరాల కాలంలో ఎటువంటి అభివృద్ధి ఆ ప్రాంతంలో జరగలేదు. వారి బతుకు గుగ్గిపాలైన కారణంగా బయటి ప్రాంతాలకు వలస వెళ్లి జీవనం సాగిస్తున్నారు. ఈనాడు చాలా మంది స్వంత గ్రామాల్లో నివాసం ఉండడం లేదు. బతుకుదెరువు కోసం బయటి ప్రాంతానికి వెళ్లారు. ఎందుకు అన్ని విషయాలు చెబుతున్నానంటే, వాస్తవం తెలియాల్సి ఉంది. 14 వేల ఎకరాల్లో స్వంత పట్టాదారులుండేవారు. వారిని తొలగించారు. ఈనాడు ఎకరం విలువ పదహేను, ఇరవై లక్షల రూపాయలుంటే కూడా తినడానికి తిండి కూడా లేకుండా జీవిస్తున్నారు. వాళ్లకు పునరావాసం కల్పించాలంటే ప్రభుత్వం ఇరవైఐదు నుంచి ముప్పై వేల కోట్ల రూపాయల వరకు ఖర్చు చేయాల్సిన ఆవశ్యకత ప్రభుత్వానికి కల్గుతుంది. కానీ, ప్రస్తుతం ప్రభుత్వం ఆ భారం మోసే పరిస్థితిలో ప్రభుత్వం ఉందా? అసలు ఎందుకు పరిస్థితి ఈ విధంగా దాపురించింది. అందుకే మిమ్మల్నందరిని నేను కోరుతున్నాను. ఆనాడు జరిగిన ప్రభుత్వ సర్వేలు కూడా సిస్టమాటిక్‌గా జరగక పోవడంతో కృష్ణా జిల్లా alone జిల్లా కలెక్టర్లు అత్యుత్సాహం చూపించి ప్రభుత్వం 7,800 ఎకరాల భూమిని ఎక్కువగా చూపించారు. ఆనాడు సభలో ఉన్న మొత్తం ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేను సభలో ఏమి మాట్లాడలేనటువంటి పరిస్థితి ఉండింది. చంద్రబాబు నాయుడు గారు జిల్లాకు పాదయాత్రకు వచ్చినప్పుడు కొల్లేరు ప్రాంత ప్రజలకు ల్యాండ్ ఇప్పిస్తామని, సర్వే తగ్గిస్తామని చెప్పడం జరిగింది. ఆనాడు చంద్రబాబునాయుడు గారు ప్రజలకు ప్రామిస్ చేశారు. నేను ఇవాళ ఒక విషయం చెబుతున్నాను. కొల్లేరు ప్రాంత ప్రజల బతుకులు మారాలంటే అక్కడ పర్యావరణం కావాలి, పెట్రో కావాలి. మొత్తం 48 వేల ఎకరాల్లో కొల్లేరు ప్రాంత పరిధి ఉంటుంది. దయచేసి మనం అసెంబ్లీలో తీర్మానం చేద్దాం. చంద్రబాబు నాయుడు గారు ఆ ప్రాంత వాసులకు ప్రామిస్ చేసినట్టుగానే కేంద్రంలో శ్రీ వెంకయ్య నాయుడు గారి అధ్యక్షతన భారత ప్రధాన మంత్రి గారైన శ్రీ నరేంద్రమోది గారిని కలిసి కొల్లేరు ప్రాంత సమస్యను వివరించడం జరిగింది. వారు కూడా సానుకూలంగా స్పందించడం జరిగింది. వెంటనే ఒక కమిటీని కేంద్ర ప్రభుత్వం నియమించింది. అదృష్టం కొద్ది సాక్షాత్తు భారత ప్రధాన మంత్రి గారే అధ్యక్షత వహించే ఆ కమిటీలో శ్రీ వెంకయ్యనాయుడు గారు సభ్యులు కాబట్టి తప్పకుండా కొల్లేరు ప్రాంతం అభివృద్ధి పథంలో నడుస్తుందనే నమ్మకం ఉంది.

గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రతిపాదించిన తీర్మానం కొల్లేరు ప్రాంత ప్రజల జీవితాలకు సంబంధించిన అంశం కాబట్టి తప్పకుండా అందరూ సహృదయంతో తీర్మానాన్ని ఆమోదిస్తారని కోరుకుంటూ మీ అందరి దగ్గర సెలవు తీసుకుంటున్నాను.

MR SPEAKER: They have also agreed.

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు: అధ్యక్షా, మా పార్టీ మాజీ శాసనసభ్యులు శ్రీ జయమంగళ వెంకటరమణ వడ్డీ. వడ్డీ సంతతికి చెందిన వ్యక్తి. ఇదే శాసనసభకు వడ్డీ తెగల

జీవన విధానం ఏ విధంగా ఉందో తెలియజెప్పేందుకుగాను గోచితో సభకు వచ్చి ఆనాడు ప్రభుత్వం కళ్లు తెరిపించడం జరిగింది. జి.వో.నంబర్ 120 ఉన్నప్పటికి కూడా ఎవరితో సంబంధం లేకుండా కొల్లేరు వాస్తవ్యులు, వాళ్ల జీవన విధానాన్ని అవలంభించి బ్రహ్మాండంగా అభివృద్ధి పథంలో పయనిస్తుంటే గత ప్రభుత్వాలు పది సంవత్సరాలుగా కక్షకట్టి, ఎమర్జన్సీ వాతావరణంతో రెండు నెలలుగా ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా జిల్లాకు చెందిన శాసనసభ్యులందరూ, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన శాసనసభ్యులు స్వయంగా ఆనాటి ముఖ్యమంత్రి గారైన రాజశేఖర రెడ్డి గారి దగ్గరకు వెళ్లి ప్రాధేయపడ్డా కూడా కనికరించకుండా కక్ష గట్టి, బాంబులుపెట్టి, డైనమెట్లు పెట్టి చేపల చెరువులను, సరస్సులను ఆనాటి ప్రభుత్వం కూల్చివేసింది. ఆనాడు ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తామని కేవలం మాటల్లో చెప్పి, ఏ మాత్రం మొత్తం నష్టపరిహారం క్రింద నిర్వాసితులకు చెల్లించకుండా వాళ్ల జీవితాలను కొల్లేరుగా మార్చింది. చాలా బాధతో ఆ ప్రాంత ప్రజాప్రతినిధులు, మా పార్టీ శాసనసభ్యులు, శ్రీ మాగంటి బాబు ఎం.పి.గారు, శ్రీనివాస్ గారు తదితరులు చంద్రబాబు నాయుడు గారు జరిపిన "వస్తున్న మీ కోసం" పాదయాత్ర సందర్భంగా మేమంతా పరిస్థితిని వారి దృష్టికి తీసుకుపోవడం జరిగింది. అసెంబ్లీలో కూడా ఆనాడు మేమంతా మా పార్టీ తరఫున అంశాన్ని లేవనెత్తిన తరువాతే ఆనాటి ప్రభుత్వం జి.వో.లు తీసుకువచ్చింది.

అధ్యక్షా, ఇందాక గౌరవ ప్రతిపక్షపార్టీ నాయకుడు చెబుతున్నాడు. మేమే తీర్మానం పెట్టామనే ధోరణిలో మాట్లాడారు. కానీ, దేని కోసం తీర్మానం ప్రతిపాదించారు? ఆనాడు బాంబులు పెట్టి చెరువులను పగులగొట్టి ఆ తప్పుల్ని సరిదిద్దుకోవడానికే మళ్లీ తీర్మానాలు ప్రతిపాదించి ప్రభుత్వ జి.వో.లు తెరమీదకు తెచ్చారు తప్ప మరొకటి కాదు. మమ్మల్ని ఉద్ధరించడానికి మాత్రం కాదు. కానీ మా ప్రభుత్వం తప్పకుండా కొల్లేరు ప్రాంతంలో పర్యావరణాన్ని కాపాడుతుంది. కాబట్టి గౌరవ సభ్యులందరూ గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రతిపాదించిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించాలని తెలియజేస్తున్నాను. గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రతిపాదించిన తీర్మానానికి గాను వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, మాట్లాడే అవకాశం కల్గించిన మీకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి: అధ్యక్షా, మూడే మూడు పేపర్లతో కూడిన డాక్యుమెంటరీ ఎవిడెన్స్ నా దగ్గర ఉంది. **(ప్రతులను గౌరవ సభాపతి స్థానం వైపు చూపించారు)**

Preface: 3 papers documentary evidence

On September 4th, 2008, the Andhra Pradesh Legislature passed a Resolution to request the National Board of Wild Life, Government of India, and the Central Empowered Committee to recommend for reducing the

boundary of Kolleru Wild Life Sanctuary from +5' Contour to +3' Contour to mitigate the problems of the farmers.

అధ్యక్షా, సుప్రీంకోర్టు నుంచి వచ్చిన జడ్జ్‌మెంట్ నేపథ్యంలో జరిగిన అన్యాయాన్ని బయటకు తీసి, పర్మినెంట్‌గా సమస్యకు పరిష్కారాన్ని వెతికి, కొల్లేరు ప్రాంత ప్రజలకు మంచి జరగాలనే ఒకే ఒక కారణంతో, మంచి ఆలోచనతో అంత వరకు రాష్ట్ర అసెంబ్లీ చరిత్రలో ఎన్నడు కూడా ఒక తీర్మానం చేసిన చరిత్ర లేకపోయినా, స్వర్గీయ రాజశేఖరరెడ్డి గారి హయాంలో సెప్టెంబర్ 4వ తేదీ, 2008న అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించినారు. ఇదొక డాక్యుమెంటరీ ఎవిడెన్స్.

…

On 29th April, 2010, the Government of India, Ministry for Environment and Forest Wild Life, Wild Life Division.

Subject: Constitution of a Committee for conservation of Kolleru Lake Sanctuary, during the 18th meeting of the standing committee of NBWL held on 12th April, 2010.

The issue regarding the reduction of boundaries of Kolleru Lake Sanctuary from +5' Contour to +3' Contours was considered and a Committee was formed.

Dr. Azeez, Director, Sechon Coimbattore, Chairman, Prof. K Kameshwara Rao, Dept. of Environmental Studies, Andhra University Member Dr. Ashok Kumar, IAS, Retd. Working in Environmental Management issues Member, Dr. B.C. Choudhury, Professor, Department of Wet Lands, Dehradun Member Mr. Sanjay Upadhyay, Managing Partner, Enviro-legal Defence Member, Dr. V.N.V.K. Sastry, Ex-Director, TCRNTI Hyderabad Member, Shri K. Mruthyunjaya Reddy, DG, APSR RSAC, Hyderabad Member,

Terms of Reference: To study the issue in greater detail both from the perspective of the protection of the livelihood of the local fisher man and farming communities and the conservation and protection of the wet lands of Kolleru and recommend to the Government on the merits and demerits of the proposal of the Andhra Pradesh Assembly for reduction of the Wild Life Sanctuary from +5' Contour to +3' Contour. అంటే రాజశేఖరరెడ్డి గారు చేసిన persuasion మేరకు కేంద్రప్రభుత్వం ఒక కమిటీని నియమిస్తున్నట్లు చెబుతుంది. This is the persuasion ఇక్కడ నుండి ముందుకు తీసుకు వెళ్లండి. నరేంద్రమోడి గారి సహకారం తీసుకోండి. వారి సహకారంతో మరింత ముందుకు తీసుకువెళ్లి మంచి చేసే కార్యక్రమం చేపట్టండి. అందుకు మేము పూర్తిగా సహకరిస్తామని తెలియజేస్తున్నాను.

నిజాలు ఈ విధంగా ఉంటే దానిని వక్రీకరించి, మీ ఇష్టం వచ్చినట్లు వేరే రకంగా త్రిప్పాలని చెప్పడం చాలా దారుణం అని చెబుతున్నాను. రాష్ట్ర అసెంబ్లీలో ఒక తీర్మానం చేసి పంపాలని ఆలోచన కూడా చేయలేని వ్యక్తులు ఈరోజు రాజకీయ అవసరాలు కోసం చేస్తూ మరలా దానిని గురించి మాట్లాడుతున్నారు.

( ఈ సందర్భంలో అధికార,ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం. ఈ సందర్భంలో శ్రీ కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు గారు మాట్లాడేందుకు మైకు ఇవ్వాల్సిందిగా కోరారు. )

శ్రీ కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (గుడివాడ): అధ్యక్షా ఈ కొల్లేరు మా జిల్లాలో కూడా ఉంది. నా ప్రక్క నియోజకవర్గం కైకలూరు. కొల్లేరు సరస్సును చంద్రబాబు నాయుడు గారు త్రవ్విస్తే దానిని రాజశేఖరరెడ్డి గారు పూడ్చి వేసినట్లు చెబుతున్నారు. మాది గుడివాడ విజయవాడ మీదుగా బుడమేరు అనే ఏరు ఒకటి ఉంది ఆ ఏరు వెళ్లి కొల్లేరులో కలుస్తోంది. ఏలూరు నుండి వచ్చే తమ్మిలేరు కూడా కొల్లేరులో కలుస్తోంది. అవన్నీ సముద్రంలో కలుస్తాయి. కొల్లేరు మూడవ కాంటూరు నుండి ఐదవ కాంటూరు వరకు వ్యవసాయం చేసుకునేందుకు పట్టా పొలాలు ఉన్నాయి. అదే విధంగా అసైన్డ్ భూములు కూడా ఉన్నాయి. వాళ్లకు వ్యవసాయం చేసుకునేందుకు అవకాశం ఉంది. ఆ భూముల్లో అక్రమంగా చెరువులు త్రవ్వారు.

ఆ ప్రాంతంలో చెరువులు త్రవ్వకం వలన వరదల సమయాల్లో ఏర్లు పొండి ప్రవహిస్తూ, విజయవాడ ఏలూరు పట్టణం మునిగిపోతున్నాయని ఆ కారణంగానే చెరువులను తొలగించాల్సిందిగా కోరుతూ ప్రైవేట్ వ్యక్తులు సుప్రీం కోర్టులో పిటీషన్ వేశారు. దానికి సుప్రీం కోర్టు 2006వ సంవత్సరంలో ఆ కొల్లేరు పరిధిలో అక్రమంగా త్రవ్విన చెరువులను అన్నింటినీ తీసివేయాల్సిందిగా సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆనాటి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రాజశేఖరరెడ్డి గారు అక్కడ ఉన్నటువంటి చెరువులను తొలగించడం జరిగింది. ఆ ప్రాంతం ప్రజలు వచ్చి అడిగితే, కొల్లేరు ప్రాంతపు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీకి చెందిన శాసనసభ్యులు అడిగినప్పటికీ సుప్రీంకోర్టు ఉత్తర్వులు మేరకు తప్పని పరిస్థితుల్లో ఆ చెరువులను తొలగించి అటు తరువాత ఆయన ఈ అసెంబ్లీలో విషయాన్ని చర్చకు తెచ్చి చాలా గంటలు కొద్దీ చర్చించి ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించారు.

దురదృష్టవశాత్తు తీర్మానంచేసిన ఆరు నెలలు కాలానికే రాజశేఖర రెడ్డి గారు మరణించడం జరిగింది. తరువాత వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోలేదు. రాజశేఖరరెడ్డి గారి ప్రభుత్వంలో చేసిన తీర్మానానికి మేము సంతోషిస్తాం. అందుకు మా పార్టీ తరఫున మద్దతిస్తాం. ఇప్పటికైనా మేము తీర్మానం చేసి ఢిల్లీ పంపించాము, బిజేపి వారు అందుకు మద్దతు తెలుపుతుంది. నరేంద్రమోడి గారు పట్టించుకోలేదని నెపం ఆయన మీద ఉంచి మళ్లీ ఐదు

సంవత్సరాలు కాలక్షేపం చేయకుండా ఇప్పటికైనా దానికి పరిష్కారం చూడాల్సిందిగా కోరుతున్నాను. (బెల్ )

శ్రీ కె. శ్రీనివాస్ : అధ్యక్షా, గౌరవ సభ్యులు నాని గారు చెప్పినట్లు ఆరోజు కొల్లేటి వాళ్లు అందరూ ఒప్పుకున్నారు. సర్కారు కాలువను డ్రైన్సును మేము వెడల్పు చేసి ఇస్తామని చెప్పారు. అది కారణం కాదు. గౌరవ ప్రతిపక్ష సభ్యులకు చెబుతున్నాను. 2006వ సంవత్సరంలో సుప్రీం కోర్టు డైరెక్షన్స్ ఉన్నాయి. కానీ చేయవలసిన దానికన్నా చాలా ఎక్కువ చేశారు. ఇదే తీర్మానం 2006వ సంవత్సరంలో పెట్టి ఉంటే ఏమయ్యేదండి? పెట్టకుండా మనమే చేసి ప్రజల్లో ఎన్నికలు వచ్చే సరికి ఎన్నికల సమీపంలో తీర్మానం పెట్టారు.

( ఈ సందర్భంలో ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం )

ఆరోజు కలెక్టర్స్ ఫుల్‌పవర్స్ ఇచ్చారు. మాగంటి బాబు ఆ పార్టీ వదిలేసి వచ్చారు అనేందుకు ఇది ఒక కారణం. సమాధానం చెప్పేందుకు ఎవరు లేరు. బయటకు వస్తే అరెస్ట్ అన్నారు. ఎంఎల్‌ఏస్ ఆరోజు నిన్ను షూట్ చేస్తాం అన్నారు. ఇన్నాళ్లుగా నేను ఎమర్జెన్సీలో చూశాను ఆ కొల్లేరు డిస్ట్రాయ్ చేసేటప్పుడున్న ఎమర్జెన్సీ చూశాను. సరాసరి ప్రజా ప్రతినిధులైన ముందు కాంగ్రెస్ ఎంఎల్ఏ బద్దలు కొట్టారు. నేను భయపడిపోయాను. ఇంకో పెద్ద రైతులుంటే వారిని తీసుకెళ్లి అరెస్ట్ చేశారు. కక్ష కట్టి ఠాగూరు గారిని అరెస్ట్ చేశారు. ఆయన పేదవారి పక్షాన చేస్తున్నాడు.

(ఈ దశలో ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం)

నానీ గారు మీకు తెలుసు. ఆయన చేసింది తప్పు ఆరోజు 2006లోనే తీర్మానం చేసి ఉండి ఉంటే బాగుండేది. అలా చేయకుండా చేయవలసిందంతా చేశారు. కొలేరు ప్రాంత ప్రజల పరిస్థితి ఏమంటే 1000 ఓట్లు ఉంటే 980 ఓట్లు నాకు వేశారు. ఆబాధ వాళ్లకు ఉంది, నాకు తెలుసు.

(ఈ దశలో ప్రతిపక్ష సభ్యులు శ్రీ కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు మాట్లాడేందుకు మైకు ఇవ్వాల్సిందిగా కోరారు. )

మిస్టర్ స్పీకర్ : మాట్లాడారు కదా.

శ్రీ కొడాలి శ్రీ వెంకటేశ్వర రావు : అధ్యక్షా, మంత్రి గారు సభను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఎందుకంటే సుప్రీం కోర్టు నిర్ధేశిత సమయాన్ని చూపించి ఆ సమయంలోగా చెరువులను తొలగించమని చెప్పింది. ఆ ప్రకారమే ఆయన తొలగించి ఆ తరువాత తీర్మానం

చేయడం జరిగింది. ఆ తరువాత కొల్లేరును కాంగ్రెస్ పార్టీ ధ్వంసం చేస్తే చిరంజీవి గారితోపాటు ఆయన ఆ పార్టీలో ఎందుకు చేరారో దానికి కూడా సమాధానం చెప్పాలి అధ్యక్షా.

MR. SPEAKER : Honourable Chief Minister garu,

శ్రీ ఎన్.చంద్రబాబు నాయుడు : అధ్యక్షా, ఎవ్వరూ కూడా చరిత్రను తిరగరాయలేరు. అబద్ధాలు, కావాలంటే అసత్యాలూ పలకవచ్చు కానీ, చరిత్రను తిరగరాయలేరు. నేను పాదయాత్ర కంటే కూడా మీ కోసం యాత్రకు వెళ్లాను. 2009 ఎన్నికల కంటే ముందు మీ కోసం యాత్రకు నేను వెళ్లినప్పుడు ఒక భయంకరమైన వాతావరణం కొల్లేరు ప్రాంతంలో అప్పుడు అక్కడున్నటువంటి శ్రీనివాస్ గారు చెప్పినట్లుగా ఎంతటి భయంకరమైన వాతావరణం ఉంది అంటే ఎన్నికల్లో అక్కడి వారందరిని భయభ్రాంతుల్ని చేశారు. మొత్తం బాంబులు వేసి కలెక్టర్లు బాంబులు వేసి మామూలుగా కాదు ప్రొక్లెయిన్స్ పెట్టి మొత్తం కాంటూర్స్‌ను ధ్వంసం చేసి ఎవరన్నా ఈ ప్రాంతానికి వస్తే అరెస్ట్ చేస్తామని ఎమర్జెన్సీని సృష్టించారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తే అక్కడి ప్రజలను భయపెట్టి అందరూ ఏకగ్రీవంగా కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలంటూ బెదిరించారు. ఇక్కడ ఒకే పార్టీ ఉండాలి మీకు వేరే గతిలేదు. కాంగ్రెస్ పార్టీ ఇక్కడ ఉండాలి అని బెదిరించారు. నేను వెళ్లేసరికి ఎన్నికలు పూర్తి అయ్యాయి. యునానిమస్‌గా కాంగ్రెస్ పార్టీకి వదిలి పెట్టారు. నేను రమ్మంటే బిక్కు బిక్కు మంటూ కొద్దిమంది వచ్చారు. కొంత మంది మైగ్రేట్ అయిపోయారు. వాళ్ల చెప్పిన బాధ చూశాను. వాళ్లకు నేను ఒక నమ్మకాన్ని ఇచ్చాను.

...

నమ్మకాన్ని ఇచ్చిన తర్వాత కొంతమంది చేరారు. ఆరోజు ఇక్కడున్న ప్రభాకర్ కూడా ఎమ్మెల్యే కాదు. శివ కూడా ఎమ్మెల్యే కాదు. 2009వ సంవత్సరం తర్వాత ఎమ్మెల్యేలయ్యారు. అక్కడంతా కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్నారు. మీరు భయపడొద్దు, ధైర్యంగా ఉండండని ఆరోజు ఒక మాట చెప్పాను. ఎట్టి పరిస్థితిలో మీకు న్యాయం చేసే బాధ్యతను నేను తీసుకుంటానని అసెంబ్లీలో వీళ్లని నిలదీస్తామని చెప్పాను. ఎట్టి పరిస్థితిలో మళ్లీ కొల్లేరుకు తీర్మానం పాస్ చేసే బాధ్యతను తీసుకుంటానని చెప్పాను. నేను ప్రతిపక్షనేతగా అసెంబ్లీలోకి వచ్చినప్పుడు, అప్పటి నా స్పీచ్ అధ్యక్షా, " ఈ తీర్మానాన్ని ఏదైతే +5 meters కాంటూరు నుండి +3 meters కాంటూరు వరకు తగ్గించడానికి మేం పూర్తిగా సహకరిస్తాం. మేం కూడా దీనిని సమర్థిస్తున్నాం. అయితే ఈరోజు ప్రభుత్వం ఆన్సర్ చేయాలి. మీ ప్రభుత్వం వచ్చిన తర్వాత +3 కు, +5 కు పెట్టాలనే ఉద్దేశంతో మీరు ప్రొక్లెయిన్స్ పెట్టి, బాంబులు పెట్టి, బ్లాస్ట్ చేసి పెద్ద యెత్తున అరాచకం సృష్టించారు. ఏదో యుద్ధం జరిగినట్టు అక్కడి వారంతా Anti Social Elements అయినట్టు అందర్నీ భయభ్రాంతులను చేసి, ఎవరైనా బయటకు వస్తే, వాళ్లని భయపెట్టేసి... ఎమర్జెన్సీలో కూడా అంత భయపడిన సందర్భాలు లేవు. ఇటీవలే నేను అక్కడకి వెళ్లాను. ఈరోజు రియాక్షన్ ఏమిటంటే నేను వెళ్లినప్పుడు కొల్లేరుకి వెళ్లాను. ఎంత భయంకరమైన వాతావరణం అంటే అంత భయంకరమైన వాతావరణం అక్కడ ఉంది. ఎమర్జెన్సీ కంటే దారుణమైన వాతావరణం.

ఆరోజు నేను వెళ్లినప్పుడు ఈ ప్రభుత్వం కావాలనే వేశారు. ఆరోజు మీరు, నేను జీ.ఒ. ఇష్యూ చేశానని చెప్పారు. కానీ ఎప్పుడూ కూడా అమలు చేయలేదు. మేం అమలు చేయకపోతే, మీరు ప్రొక్లెయిన్‌లు పెట్టి, బాంబులు పెట్టి, మొత్తం ఆ భూమి అంతా లాక్కుంటామని మీ ఇష్ట ప్రకారం చేశారు. ఇది ప్రజా ప్రభుత్వం. మీరు కూడా చట్ట ప్రకారమే పని చేస్తున్నారు. చట్టాన్ని వ్యతిరేకించి, అక్కడున్న వాళ్లని భయభ్రాంతుల్ని చేసి, ఎవరైనా మాట్లాడితే రాజ్యద్రోహం కింద కేసుపెడుతున్నారు. ఏమి వారు చేసిన రాజ్యద్రోహం అని నేను అడుగుతున్నాను. వాళ్ల భూముల్లో వ్యవసాయం చేస్తూ, చేపలు పట్టుకుంటుండేవారు.

వెంగళరావు ఉన్నప్పుడు చేపల చెరువులను ప్రోత్సహించేవారు. అందువల్ల వాళ్లు అన్నీ చేసుకున్నారు. చేసుకున్న తర్వాత ఈ ప్రభుత్వం చాలా దారుణంగా ప్రవర్తించింది. ఇంకోవైపు వాళ్లని సరెండర్ చేసుకుని మీరు పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌లుగా గాని, జెడ్‌పిటీసీలుగా గాని మా పార్టీకే సపోర్ట్ చేస్తే మీకు మినిమం కాంపెన్‌సేషన్ ఇస్తాం. లేకుంటే అది కూడా ఇవ్వమని చెప్పి ఇష్టమొచ్చినట్టు మాట్లాడారు.

వారు రెండు సంవత్సరాలు ఎంత దారుణంగా బాధపడ్డారంటే, కనీసం బయటకు రావడానికి భయపడి, ఆ ప్రాంతం నుండి వేరే ప్రాంతానికి వెళ్లి కూలీలుగా స్థిరపడ్డారు. కూలీలుగా స్థిరపడి చాలీ చాలని కూలీలతో చాలా ఇబ్బంది పడ్డారు. ఈరోజు మీరు చూస్తే మొత్తం 14,000 ఎకరాలు అన్నారు. మీరు ఆలోచన లేకుండా చేసిన చర్యలకు ఎవరు బాధ్యులు అని నేను ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. వారు రెండు సంవత్సరాలు వ్యవసాయం చేసుకోలేదు. వారికి జీవనోపాధి లేదు. మీరు ఏమాత్రం వారికి సహాయం చేయలేదు. దానికి మీరు ఏం సమాధానం చెబుతారు? ఈనాడు మేం తీర్మానాన్ని ఆమోదిస్తున్నామనే చెబుతున్నాను. ఈరోజు మీకు ఈ అంశం మీద ఇంట్రెస్ట్ ఉండి కాదు, అక్కడ ఈరోజు ఒక తిరుగుబాటు ప్రారంభమయింది.

తెలుగుదేశం పార్టీ తరపున మేం అక్కడికి వెళ్లిన తర్వాత ఒక హామీని ఇచ్చాను. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి గాని, కేంద్రప్రభుత్వానికి గాని +3 కాంటూరు పెట్టుకునే అవకాశం ఉంది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే +3 కాంటూరు ప్రకారం చేస్తామని హామీ ఇచ్చాం. దానికి భయపడి ఎన్నికలలో ఆవైపుకి వెళ్లటానికి భయపడి ఈరోజు +3 కాంటూరు తీసుకొచ్చారు. ఈ రెండు సంవత్సరాలు వాళ్లు కష్టపడ్డారు. ఒక కమిటీ వేసి దాని ప్రకారం నష్టపోయిన వారికి నష్ట పరిహారం చెల్లించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వానికి ఉంది. రెండు సంవత్సరాలూ తీవ్రమైన ఆందోళనకు గురయ్యారు, బాధ పడ్డారు, నరకయాతన పడ్డారు. ఆవిధంగా మీరు వాళ్లని చాలా దారుణంగా, అప్రజాస్వామిక పద్ధతుల్లో ఇబ్బందులకు గురి చేశారు.

ముఖ్యమంత్రిగారు, మంత్రిగారు వాళ్లకి భేషరతుగా సమాధానం చెప్పాలని నేను అడుగుతున్నాను. ఆ ప్రాంతానికి మీరు వెళ్లటానికి భయపడి ఈరోజు +3 కాంటూరును తీసుకొస్తున్నారు. జరిగినదానికి నష్ట పరిహారం చెల్లించాలి. భేషరతుగా అన్నిటినీ కూడా సెట్ చేయవలసిన అవసరం ఉంది. అంతర్గత డ్రెయిన్స్ అన్నీ బాగుచేయాలి.

డాక్టర్ మిత్రా చెప్పినట్లు సముద్రంలోకి 25,000 క్యూసెక్కుల నీళ్లు పోవలసి వస్తే, అక్కడ చాలా తక్కువుగా వెళ్లే పరిస్థితి వస్తుంది. దీనివలన చాలా ఇబ్బందులు వస్తున్నాయి. ఆవిధంగా ఆలోచించినప్పుడు డ్రెయిన్స్ అన్నింటినీ రిపేర్ చేయవలసిన అవసరం ఉంది. ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని 3 లక్షల మంది దీనిపై ఆధారపడి ఉన్నారు. అదంతా మీరు దెబ్బ తీశారు. దానికి మీరు ప్రోపర్ యాక్షన్ తీసుకోవాలి. డ్రైనేజ్ వ్యవస్థను బాగుచేయడం, నష్టపరిహారం చెల్లించడం ఈ ప్రభుత్వం చేయవలసిన అవసరం ఉంది. ఈరోజు మీరు చేసిన పనిని మూడు సంవత్సరాల క్రితం చేసి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదు. భేషరతుగా ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని ఆరోజు నేను డిమాండ్ చేశాను ". అసెంబ్లీలో పెద్ద గొడవ జరిగింది. గొడవ జరిగి, చివరకు విధి లేని పరిస్థితి. రూ.18 కోట్లు ఖర్చు పెట్టారు. ప్రొక్లెయిన్స్ పెట్టి, బాంబులు వేసి, భయభ్రాంతులు చేసి నీచాతి నీచంగా, ఒక పద్ధతి లేకుండా చేసి, ఆరోజు మేం ఇక్కడకు వచ్చి గట్టిగా నిలదీస్తే దిక్కు తెలియకుండా ఆ జిల్లాకి పోలేమనే భయంతో ఆరోజు ఆ తీర్మానం పెట్టారు తప్పితే ఇంకొకటి కాదు.

నేను అందుకే గతానికి పోదలుచుకోలేదు. మీరు అడిగారు కాబట్టే ఇప్పుడు చెప్పాల్సి వచ్చింది. లేకపోతే అది కూడా చెప్పేవాణ్ణి కాదు. ఆరోజు వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డిగారు అక్కడ ఉండే ప్రజల కోసం కాదు, మేం నిలదీసిన తర్వాత భయపడి.. పక్క అసెంబ్లీలో సవాలు కూడా చేశాను. ధైర్యం ఉంటే మీరు రండి నేను కూడా వస్తానని చెప్పాను. అక్కడ ప్రజలు మీ మాట వింటే నేను దేనికైనా సిద్ధంగా ఉన్నాను అంటే, అవన్నీ ఎందుకులే ఇప్పుడు, మీరు కూడా సహకరించండి, అందరం కలిసి తీర్మానం పెడదాం అని చెప్పి తీర్మానం పెట్టించారు. ఇది వాస్తవం. ఆ విషయాలన్నీ గుర్తు పెట్టుకోవలసిన అవసరం ఉంది.

దీనికి సుప్రీంకోర్టులో Empowerment Committee ఉంది. ఆ Empowered Committee లో ఇది నిర్ణయించవలసిన అవసరం ఉంది. ఈరోజు మనం +3 పెట్టాం. అందుకే భీమవరంలో గౌరవ ప్రధానమంత్రి నరేంద్రమోదీగారు వచ్చినప్పుడు మేం ఆయనకు కూడా చెప్పి, ఒక హామీని ఇవ్వమని చెప్పాం. ఆయన కూడా హామీ ఇచ్చారు.

ఈరోజు గుర్తు పెట్టుకోవలసిన అంశం ఒకటి ఉంది. ప్రతిపక్ష నాయకుడికి మరియు చాలామంది చరిత్ర తెలియకుండా మాట్లాడుతున్నారు. ఈరోజు కొల్లేరు అంటే మామూలుగా అనుకొని ఏదో మాట్లాడబోతున్నారు. కానీ నేను గతానికి పోవడం లేదు. కొల్లేరు ప్రాంతంలో రైతాంగం ఉన్నారు, వాళ్లకి చాలా ఇబ్బందులున్నాయి. వడ్డెరులున్నారు, ఎస్సీలున్నారు,

పేదవాళ్లున్నారు. దీనికి న్యాయం జరగాల్సిన అవసరముంది. కేంద్రప్రభుత్వాన్ని ఒప్పించాలి. సుప్రీంకోర్టులో ఉన్న Empowered Committee కూడా రిప్రజెంట్ చేయాలి. అవసరమైతే కొల్లేరు ప్రాంతంపైన ఒక నిపుణుల కమిటీ, ఒక టెక్నికల్ కమిటీ వేస్తాం. పూర్తిగా ఆ ప్రాంతంలో ఉన్న ఎన్విరాన్‌మెంట్‌ని కాపాడుకుంటూనే, ఆ ప్రాంతంలో ఉండే రైతులకు, పేదవారికి న్యాయం జరిగేట్టుగా ఈ ప్రభుత్వం తరపున కార్యక్రమాలను చేపడతామని నేను మీకు తెలియజేసుకుంటున్నాను. (అధికార పార్టీ సభ్యులు చప్పట్లు) ఆ దృష్టితోనే ఈరోజు ఈ తీర్మానం ప్రవేశ పెట్టాం. విషయం తెలిసినా controversy అనవసరమనే ఉద్దేశంతో నేను హుందాగా ప్రవర్తిస్తే, పాపం శ్రీకాంత్‌రెడ్డికి సమాచారం తెలియదు కాబట్టి, సెల్ఫ్ గోల్ వేసుకున్నారు. అదే జరిగింది ఇక్కడ. ఆ విషయం మీరు గుర్తు పెట్టుకోవాలి. పూర్వాపరాలు స్టడీ చేస్తే మీకు ఇబ్బందులుండవు. పూర్వాపరాలను స్టడీ చేయకుండా, అవగాహన లేకుండా, సబ్జెక్ట్ తెలియకుండా మీరు ఈవిధంగా మాట్లాడితే ఇలానే ఉంటుంది. ఆ విషయాన్ని మీరు గుర్తు పెట్టుకోవాలి. ఇప్పటికైనా సరే చేసిన తప్పుకి.. (వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డిని ఉద్దేశించి) మీ నాయకుడు తప్పు చేశారు. అది అయిపోయింది. కనీసం ఇప్పటికైనా సరే చేసిన తప్పుని సరి చేసుకునే విధంగా మీరు ముందుకుపోతే, మీరు కూడా ఆ ప్రాంతానికి పోగలుగుతారు. లేకపోతే ఆ ప్రాంతానికి పోలేరని తెలియజేసుకుంటూ అందరు కూడా ఈ తీర్మానాన్ని ఏకగ్రీవంగా బలపరచవలసిందిగా మరొక్కసారి కోరుతున్నాను.

(శ్రీ కొడాలి శ్రీవెంకటేశ్వరరావు మైకు ఇవ్వమని గౌరవ సభాపతిని కోరారు)

మిస్టర్ స్పీకర్ః మీరు రెండుసార్లు మాట్లాడారు, ఇంకెన్నిసార్లు మాట్లాడతారు. సరే మాట్లాడండి.

శ్రీ కొడాలి శ్రీవెంకటేశ్వరరావుః అధ్యక్షా, ఇక్కడ రాజకీయంగా మేం లబ్ధి పొందాలనో, లేక వాళ్లు లబ్ధి పొందాలనో మేం ప్రయత్నించటం లేదు. ఆయన తీర్మానం ప్రవేశపెట్టారు కాబట్టి, ఆ తీర్మానం మీద చర్చ జరగాలి. గతంలో వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డిగారు తీర్మానాన్ని పెట్టారు. ఆయన పెట్టిన తీర్మానాన్నే మీరూ పెట్టారు. కొల్లేరును మేం పూడ్చేసినట్టు మీరు తవ్వినట్టు ఎందుకని మేం అడుగుతున్నాం తప్పితే, మేమేమీ సెల్ఫ్ గోల్ వేసుకోలేదు. పెట్టిన తీర్మానాన్నే మళ్లీ మీరు పెట్టి, ఇక్కడ అంతా కొత్తగా వచ్చాం, మాకేం తెలియదు, మళ్లీ ఏదో చేద్దాం అని చెప్పి ఆయన సెల్ఫ్‌గోల్ వేసుకున్నారు తప్పితే మేం వేసుకోలేదు అధ్యక్షా.

MR. SPEAKER: Now the question is :

## ప్రభుత్వ తీర్మానం

పర్యావరణం, అడవులు, శాస్త్ర మరియు సాంకేతిక విజ్ఞానం, సహకార శాఖ మంత్రి శ్రీ బి.గోపాలకృష్ణారెడ్డిః అధ్యక్షా, కొల్లేరు వన్యప్రాణుల అభయారణ్య సరిహద్దును +5 కాంటూరు నుండి +3 కాంటూరుకు కుదింపు కొరకు తీర్మానాన్ని ప్రవేశ పెడుతున్నాను.

" పశ్చిమ గోదావరి జిల్లాలోని 13,899.47 ఎకరాలు, కృష్ణా జిల్లాలోని 961.86 ఎకరాలు మొత్తం 14,861.33 ఎకరాల రాయితీ భూములను కలిపి 30,855.20 హెక్టార్లకు పైబడి +5 కాంటూరు వరకు ఉన్న కొల్లేరు సరస్సు ప్రాంతాన్ని, ఇఎఫ్ఎస్ &టి (అడవులు. III) శాఖ వారి 04.10.1999 తేది నాటి జీ.ఓ.ఎం.ఎస్.నెం.120 ద్వారా, వన్యప్రాణుల అభయారణ్యంగా ప్రకటించారు.

రసాయన ఎరువులు వినియోగించకుండా సాంప్రదాయిక వ్యవసాయం ద్వారా ఆ రైతులు తగినంత ఆదాయాన్ని పొందలేకపోతున్నారు. భూములను సేకరించుట కోసం యజమానులకు ఇంత వరకు పరిహారం చెల్లించలేదు. ఆ భూముల సేకరణ నిమిత్తం చెల్లించాలని ప్రతిపాదించిన పరిహారం వల్ల రాష్ట్ర ఖజానాపై పెను భారం పడుతుంది.

రైతుల సమస్యలు ఉపశమింపచేయుటకు గాను కొల్లేరు వన్యప్రాణుల అభయారణ్య సరిహద్దును +5 అడుగుల కాంటూరు నుండి +3 అడుగుల కాంటూరుకు కుదించడానికి సిఫారసు చేయవలసిందిగా వన్యప్రాణుల జాతీయ మండలి, భారత ప్రభుత్వం, కేంద్ర సాధికార కమిటీలను కోరాలని ఈ సభ తీర్మానిస్తున్నది".

**The Resolution was unanimously adopted by the House.**

...

**నిన్నటి సభలో రైతుల రుణాల మాఫీ పైన చర్చ జరిగింది. దానిపై మంత్రిగారు స్టేట్‌మెంట్ ఇచ్చేముందు విశ్వేశ్వర రెడ్డి గారిని పది నిముషాలు మాట్లాడవలసిందిగా కోరుతున్నాను.**

శ్రీ వై.విశ్వేశ్వర రెడ్డి(ఉరవకొండ)ః అధ్యక్షా, నిన్నటిరోజు కరువు సమస్యపైన పూర్తిగా చర్చ జరగలేదు. ప్రధానంగా రుణమాఫీ పైన చర్చ జరిగింది. ఈరోజు విభజన తరువాత మన ఆంధ్రరాష్ట్రం పూర్తిగా వ్యవసాయ ఆధారిత రాష్ట్రం అయ్యింది. హైదరాబాద్ రాజధానిగా ఉన్నప్పుడు పారిశ్రామికరంగం నుండి వచ్చే ఆదాయం మనకు తోడ్పడేది. అయితే, ఇప్పుడు పారిశ్రామికరంగం నుండి వచ్చే ఆదాయం కేవలం విశాఖపట్నం నుండి తప్ప మరొక చోట నుండి లేదు. ఈరాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ఈ రాష్ట్ర ప్రజలు పురోభివృద్ధి చెందాలన్నా వ్యవసాయరంగం అభివృద్ధి కావలసిన అవసరముంది. అదేవిధంగా వ్యవసాయ ఆదాయాలు గణనీయంగా పెరగాల్సిన అవసరముంది. ఆటువంటి పరిస్థితుల్లో దురదృష్టవశాత్తు రాష్ట్రమంతా

కరువు రావడం, కరువు కారణంగా దాదాపు 540 మండలాలకు పైగా లోటు వర్షపాతం నమోదుకావడం వల్ల రాష్ట్రమంతా పంటలు దారుణంగా దెబ్బతిన్నాయి. కాబట్టి, ప్రభుత్వం ప్రజలను ఆదుకోవడానికి స్పష్టమైన ప్రకటనతో ముందుకు రావలసిన అవసరముంది. ఈ కరువులో, ఇంత దారుణమైన పరిస్థితుల్లో కూడా రైతులు వరి, ప్రత్తి, గ్రౌండ్‌నట్, మెయిజ్, బెంగాల్‌గ్రాం వంటి పంటలను అంతో, ఇంతో పండించారు. ఈరోజు పండించిన పంటలకు కనీస ధరలు కూడా రావడంలేదు. ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రూ.5000/-కోట్ల మేరకు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుచేస్తామని తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్నారు. ఈ సందర్భంలో ప్రభుత్వాన్ని నేను ఒక్కటే అడగుతున్నాను. రైతాంగాన్ని ప్రకృతి దయాదాక్షిణ్యాలకు వదిలిపెట్టదలచుకున్నారా? లేదా వాళ్ళనేమైనా ఆదుకోదలచుకున్నారా?

వరిపంటను దాదాపు కొనే పరిస్థితి లేదు. 'లేవీ'లో మార్పులు తీసుకువచ్చారు. 'లేవీ' 25 శాతానికి పెరగడం వల్ల, ఈరోజు మిల్లర్స్ కొనడానికి ముందుకు రావడంలేదు. గత సంవత్సరం 35 లక్షల టన్నులు కొంటే, ఈరోజు 10, 15 టన్నులైనా కొంటారా అనే పరిస్థితి దాపురించింది. వరి దిగుబడులు తగ్గాయి. వరి పండించే విస్తీర్ణం తగ్గింది. ఈసారి గత పది సంవత్సరాల్లో ఎప్పుడూ లేనంతగా కేంద్ర ఎం.ఎస్.పి.ని కేవలం యాభై రూపాయలు మాత్రమే పెంచింది. కేంద్రంలో ఉన్న ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వానికి మిత్రపక్షమే. మరి లక్షలాదిమందికి సంబంధించిన ప్రధానమైన పంటకు ధరలు లేకుండా, వాళ్ళు ప్రకటించిన ఎం.ఎస్.పి. కంటే కూడా తక్కువ ధరలకు అమ్ముకునే దీనపరిస్థితిలో ఈరోజు రైతాంగం ఉంటే, ఎం.ఎస్.పి. ని పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం ఏవిధమైన ప్రయత్నాలు చేసిందని నేను ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని అడగదలచుకున్నాను. ఈరోజు వరి పండించే రాష్ట్రాలైన పంజాబ్, బెంగాల్ వంటి 6, 7 ప్రధానమైన రాష్ట్రాలను కలుపుకుని వెళ్ళి, కేంద్రంపైన వత్తిడి తెచ్చి, వరి ధాన్యానికి మద్దతు ధరని పెంచేందుకు ప్రయత్నం చేయడంలో విఫలమైందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఎందుకంటే, ఇంత తక్కువ ఎం.ఎస్.పి.నిపెంచడం అనేది ఎప్పుడూ లేదు. గ్రౌండ్‌నట్ తీవ్రమైన కరువు ప్రాంతాల్లో పండించే పంట. ఈ సంవత్సరం మా జిల్లాల్లోనే రెండు వేల హెక్టార్లలో పంటల విస్తీర్ణం తగ్గిపోయింది. ఈ సందర్భంలో కూడా అంతో, ఇంతో పంట పండింది. గ్రౌండ్‌నట్ ఎం.ఎస్.పి. ధర గత సంవత్సరం రూ.4000/- ఉంటే, ఈ సంవత్సరం ఒక్క రూపాయి కూడా పెరగలేదు. ప్రస్తుతం ఉన్న ఎం.ఎస్.పి.కైనా సరే, కనీసం ఒక్క క్వింటాల్ అయినా ఈ రాష్ట్ర ప్రభుత్వం కొన్నదా? అని అడుగుతున్నాను. రూ.4000/- ఎం.ఎస్.పి. ఉన్నప్పటికీ, రూ.2500/-, రూ.3000/-లకు రైతులు అమ్ముకుంటూ ఉంటే, మీరు ఏ ప్రయత్నం చేశారని ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. మార్కెటింగ్ సౌకర్యాన్ని పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందా? లేదా? అని అడుగుతున్నాను. మూడు సంవత్సరాలుగా దాదాపు 20 లక్షల టన్నుల బెంగాల్ గ్రామ్ స్టాకుల్లో నిల్వ ఉంది. ముఖ్యమంత్రిగారే స్వయంగా గత అసెంబ్లీ సమావేశాల్లో చెప్పారు. మా కరువు జిల్లాలో దాదాపు రెండు లక్షల టన్నులున్నాయి. ప్రకటనలు తప్ప, ఒక్క క్వింటాలైనా కొన్నారా? ఎందుకు కొనలేకపోతున్నారని అడుగుతున్నాను.

ఈరోజు కాటన్ 14లక్షల ఎకరాల్లో పండిస్తున్నారు. దాదాపు 160 శాతం విస్తీర్ణం కూడా పెరిగింది. ఈ రాష్ట్రంలో అత్యధికంగా ప్రత్తి పండించే రైతులున్న కర్నూలు జిల్లాలో 28 మంది కాటన్ రైతులు ఆత్మహత్య చేసుకున్నారంటే, ప్రత్తి పండించే రైతులు ఎంతటి దురవస్థలో ఉన్నారో అర్థమవుతుంది. ఇందుకు ప్రధానమైనటువంటి కారణం, అక్కడ ప్రత్తి పంట దారుణంగా దిగుబడులు తగ్గడమే కాకుండా, కొనే పరిస్థితి కూడా లేదు. ఎం.ఎస్.పి. రూ.4050/- ఉంటే, కేవలం యాభై రూపాయలు పెంచారు. ఆ మాత్రం కూడా కొనకుండా, గత సంవత్సరం రూ.5000/- రూ.5500/- లకు కొంటే, ఈసారి రూ.3000/-లకు కూడా కొననటువంటి పరిస్థితి ఉంది. రాష్ట్రంలో ఇంత కరువు పరిస్థితులంటే, ప్రభుత్వమేమో ఎక్కడ బాధ ఉంటే అక్కడ ఉంటామంటారు, ఎక్కడ కష్టముంటే అక్కడ మేముంటాం అంటారు. ఎక్కడ ఉన్నారో చెప్పండి. కనీసం ప్రభుత్వం అడ్రస్ అయినా ఉందా? ఎందుకు విఫలమయ్యారని అడుగుతున్నాను. ధరల స్థిరీకరణకు రూ.5000/-కోట్లతో నిధి ఏర్పాటు చేస్తామన్న మీరు, ఈరోజు ఈ పంటలను ఎందుకు కొనలేకపోతున్నారు. సి.సి.ఐ. సెంటర్లను ఓపెన్ చేసినప్పటికీ, తేమ శాతం అంటూ ఈరోజు వాళ్ళు రకరకాల నిబంధనలు పెట్టి, ట్రేడర్స్‌తో కుమ్మక్కై, రైతులను దగ్గరకు కూడా రానివ్వకపోతుంటే, ప్రభుత్వానికి బాధ్యత లేదా? ఈరోజు వ్యవసాయశాఖామాత్యులు చేసిన ప్రకటన కూడా పూర్తిగా నిరాశ కలిగించే పరిస్థితిలో ఉంది. 'గడచిన పది సంవత్సరాల కాలంలో రైతుల ఉత్పాదకతను,ఆదాయాన్ని మెరుగుపరచడానికి ప్రభావవంతమైన ఏకీకృత విధానాన్ని అనుసరించలేదు అని చెప్తున్నారు. గత పది సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న ప్రభుత్వంపై నెపం వేస్తున్నారు. నేను ఒక్కటే అడుగుతున్నాను. మీరు గత పది సంవత్సరాల పాలన గురించి చెప్తున్నారు. మీరు ఉత్పాదకత విషయంలో గానీ, ఉత్పత్తి విషయంలో గానీ, ఆహారధాన్యాల వృద్ధిరేటు విషయంలో గానీ, ఆహారధాన్యాల దిగుమతి విషయంలో గానీ, ఈల్డ్ రేట్స్ విషయంలో గానీ, పారిశ్రామిక రంగం ఉత్పత్తులకు సంబంధించి గానీ, సేవారంగాల ఉత్ప త్తులకు సంబంధించి గానీ చర్చ చేద్దాం. రాజశేఖరరెడ్డిగారి హయాముకీ, చంద్రబాబు నాయుడు గారి హయాముకీ, కిరణ్‌కుమార్‌రెడ్డిగారి హయాముకీ, దేనికైనా మేము సిద్ధం. ఈరోజు మాపైన నెపం వేసి తప్పించుకోవడానికి ప్రయత్నం చేయవద్దని, వినయపూర్వకంగా ఈ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

ఎం.ఎస్.పి. ని రాజశేఖరరెడ్డి గారు ఏవిధంగా అమలు చేశారో ఒక ఉదాహరణ చెప్తాను. 2008వ సంవత్సరంలో, ఆరోజు 160 లక్షల క్వింటాళ్ళ వరి పండితే, దాదాపు ఒక లక్ష క్వింటాళ్ళు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఆరోజు రాష్ట్ర హార్వెస్టింగ్ ప్రైసెస్ బాగా ఉన్నప్పటికీ, మినిమమ్ సపోర్టింగ్ ప్రైసెస్ ఎక్కువగా ఉన్నప్పటికీ కూడా ఎం.ఎస్.పి.కే లక్ష క్వింటాళ్ళు కొనడం జరిగింది. అదేవిధంగా 35 లక్షల బేళ్ళు ప్రత్తి ఉత్పత్తి జరిగితే, ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం 30 లక్షల బేళ్ళు కొనుగోలు చేయడం ద్వారా రైతాంగానికి ధైర్యం ఇచ్చింది. ఎం.ఎస్.పి. అమలు చేయడా నికి ఆనాటి రాజశేఖరరెడ్డిగారి ప్రభుత్వం పనిచేసిందని చెప్తున్నాను. అనంతపురం జిల్లాకు

సంబంధించిన రైతు కుటుంబం నుంచి వచ్చిన వాడిగా నేను రాష్ట్రప్రభుత్వాన్ని అడగదలచుకున్నాను. ఈ సంవత్సరం ఇంత ఘోరంగా వర్షపాతముంది, ఇంత ఘోరంగా పంటల దిగుబడి ఉంది, మీరేవిధంగా ఆదుకున్నారో చెప్పమని అడుగుతున్నాను.

...

వ్యవసాయ రుణాలు, పంట రుణాల కోసం రూ.4,000/- కోట్లు గత సంవత్సర కాలంలో ఇస్తే, ఈ సంవత్సరం కేవలం రూ.230/- కోట్లు మాత్రమే పంట రుణాలు ఇవ్వడం ద్వారా రైతులకు లాభం చేశారా, నష్టం చేశారా, అని నేను అడుగుతున్నాను. వ్యవసాయ రుణమాఫీ క్రింద ప్రభుత్వం మొదటి విడతగా రూ.750/-కోట్లు రుణాల మాఫీ చేస్తామంటుంది. మా అనంతపురం జిల్లాకు పంటనష్ట పరిహారం క్రింద రూ.684/- కోట్లు, ఇన్సూరెన్స్ క్రింద రూ.226/- కోట్లు రావాలి. దానిని మంజూరు చేసినా కూడా మాకు రూ.900/- కోట్లు రావలసి ఉంటుంది. రూ.730/- రుణమాఫీ చేస్తామని ప్రకటించారు.

కేస్ స్టడీగా గుంటూరు జిల్లాలో విచారణ కమిటి వేసి విచారణ చేయించండి. రుణమాఫీ వలన రైతులకు లాభం జరిగిందా, నష్టం జరిగిందా, ఇంకా చేయాల్సిన అవసరం ఉందా అనే దానిపై విచారణ చేయించండి. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ గురించి పదే పదే మాట్లాడవద్దని ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి నేను చేతులెత్తి మ్రొక్కుతున్నాను. దానివల్ల రైతాంగానికి నష్టం జరుగుతుంది.

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌కు మించి, రైతుల బాధలను చూసి, వారి విశ్వసనీయతను బట్టి రైతులకు లోన్లు ఇచ్చామని బ్యాంక్ మేనేజర్లు చెబుతున్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌కు మించి ఎలా ఇచ్చారని ఆర్‌బీఐ బ్యాంకర్లకు ప్రశ్నించింది. వచ్చే రోజులల్లో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌కు మించి ఒక్క రూపాయి ఇచ్చే అవకాశముందా? రైతుల అవసరాలలో 30 శాతానికి మించి బ్యాంకులు పంటరుణాలు ఇవ్వడం లేదు. ప్రాథమిక రంగంగా ఉన్న వ్యవసాయ రంగానికి 18 శాతం రుణాలు ఇవ్వాలనే నిబంధనను ఒక్క బ్యాంకు కూడా పాటించడం లేదు. రుణాలు లిబరల్‌గా ఇవ్వమని ముఖ్యమంత్రి గారు చెప్పకుండా రుణమాఫీ నుంచి భారాన్ని తగ్గించుకోడానికి ఇలాంటి ప్రకటనలు చేయడం సరైంది కాదు.

బంగారు రుణానికి పంట రుణంగా తక్కువ వడ్డీతో బ్యాంకర్లు రుణం ఇచ్చారు. రుణమాఫీ సందర్భంగా ముఖ్యమంత్రి గారు మాట్లాడుతున్న మాటలకు బ్యాంకర్ల దగ్గర బంగారం పెడితే రైతులకు పంట రుణాల మాదిరిగా తక్కువ వడ్డీతో రుణాలు ఇచ్చే అవకాశం లేదు.

ఒక ఉదాహరణ చెబుతాను. ఒకామె పంట రుణం కోసం నా భర్త నా బంగారు నగలు అడిగాడు. వ్యవసాయం ఒడిదుడుగులతో కూడుకున్నదని నేను నా బంగారం ఇవ్వనని చెప్పింది.

అప్పుడతను తన భార్యతో, ఎన్నికలు అయిన వెంటనే చంద్రబాబు నాయుడు గారు అధికారంలో వచ్చిన వెంటనే బంగారంకు బంగారం వస్తుంది, డబ్బులకు డబ్బులు వస్తాయి, బంగారం ఇవ్వమని భార్యతో అన్నాడు. చంద్రబాబు గారి ప్రకటన వల్ల ఆడవారి బంగారు ఆభరణాలన్నీ బ్యాంకులకు చేరాయి. నేను లేనిది చెప్పడం లేదు. రైతులు ఏ విధంగా బాధపడుతున్నారో ఆ విషయాల్ని చెబుతున్నాను.

శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారి హయాంలో బ్యాంకులు వారి టార్గెట్‌కు మించి రుణాలు ఇస్తే, ఈ సంవత్సరం బ్యాంకులు పది శాతం కన్నా రుణాలు ఇచ్చారా, అని అడుగుతున్నాను.

(ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు బల్లలు చరిచారు)

వ్యవసాయం ప్రాథమిక మిషన్ అంటున్నారు. ఈ సంవత్సరం కరువు రాబోతుందని, వర్షపాతం లేదని ప్రభుత్వానికి తెలిసినా ఇన్స్యూరెన్స్ చేయలేదు. రెన్యువల్స్ కావాలని ఎస్ఎల్‌బీసీ వారు ముఖ్యమంత్రి గారికి చెప్పారు. ఎస్ఎల్‌బీసీ రాకపోతే ఇన్స్యూరెన్స్ ఒక్క నయాపైసా రాదని ముఖ్యమంత్రి గారికి చెప్పారు. కానీ ఈ ప్రభుత్వం కళ్లు తెరవలేదు. రూ.500/- కోట్లు పెట్టి ఇన్స్యూరెన్స్ చెల్లించి ఉంటే, రూ.800/- కోట్లు లేదా రూ.900/- కోట్లు రాష్ట్ర రైతాంగానికి ఇన్స్యూరెన్స్ వచ్చి ఉండేది. ఈ ప్రభుత్వం ఇన్స్యూరెన్స్ సౌకర్యం రైతాంగానికి రాకుండా చేసింది.

పోస్ట్ హార్వెస్ట్ చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి గారు తెలిపారు. అంతేకాకుండా వ్యవసాయ యాంత్రీకరణ గురించి చెప్పారు. వ్యవసాయ యంత్రాలకు సంబంధించి ఆర్భాటమైన ప్రకటనలు తప్ప ఒక్క యంత్రానికి కూడా సబ్సిడీతో ఇవ్వలేదు. ఈ విషయంలో నేను ఛాలెంజ్ చేస్తున్నాను.

అనంతపురం జిల్లాకు మైక్రో ఇరిగేషన్ ఇస్తున్నారని మాకు ఇవ్వమని కొందరు సభ్యులు అడుగుతున్నారు. దీని కోసం 1,90,000 హెక్టార్లకు 97,000 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు అయ్యాయి. ఒక్క వర్క్ ఆర్డర్ ఇచ్చారా అని ఈ సందర్భంగా ఛాలెంజ్ చేస్తున్నాను. మైక్రో ఇరిగేషన్ పరికరం ఇవ్వరు, ఒక యంత్రం ఇవ్వరు, ఇన్స్యూరెన్స్ ఇవ్వరు రైతులు ఎలా బ్రతకాలి? ఉపాధి హామి సహాయకులను తొలగించేదానిలో ఉన్న ఉత్సాహం ఉపాధి కల్పించడంలో లేదు. మా జిల్లాలో కరువును తట్టుకోలేక లక్ష మంది వలసలు వెళ్ళారు. ఉపాధి హామీకి మండలాలను కేంద్రం కుదించే ప్రయత్నం చేస్తే, దానిపై ఈ ప్రభుత్వం స్పందన ఏమిటని అడుగుతున్నాను.

(ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు బల్లలు చరిచారు)

ఈ ప్రభుత్వం ఎప్పుడూ సింగపూర్, జపాన్‌ల అభివృద్ధిని చూడమంటున్నారు. మా ప్రాంతంలో మొదటిసారి పెళ్ళి జరిగేటప్పుడు భార్యాభర్తలను బ్రాహ్మణుడు బయటికి తీసుకువచ్చి మిట్టమధ్యాహ్నం 12 గంటలప్పుడు అరుంధతీ నక్షత్రాన్ని చూపిస్తారు. అరుంధతీ నక్షత్రం కనిపిస్తుందా అంటే మా తండ్రి గారు చేసిన పది లక్షల రూపాయల అప్పు కనిపిస్తుందని పెళ్ళికూతురు చెబుతుంది. సింగపూర్, జపాన్‌లను చూడమంటే, మాకు రైతుల ఆత్మహత్యలు, రైతుల దుర్భరమైన జీవితాలు కనబడుతున్నాయి.

చిత్తూరు జిల్లాలో 1713 ట్యాంకుల ద్వారా త్రాగునీటిని సరఫరా చేస్తున్నారు. రాయలసీమ జిల్లాలలో 20 మీటర్లకు పైగా గ్రౌండ్ వాటర్ లెవెల్స్ పడిపోయాయి. ఒక్క అనంతపురం జిల్లాలో 60,000ల బోర్లు, కర్నూలు జిల్లాలో 40,000ల బోర్లు, కడప జిల్లాలో 35,000ల బోర్లు, చిత్తూరు జిల్లాలో 30,000ల బోర్లు ఎండిపోయాయి. ఇన్ని బోర్లు ఎండిపోతుంటే త్రాగునీటి కోసం రాష్ట్ర ప్రభుత్వం పాత బకాయిలు చెల్లించిందా, అని అడుగుతున్నాను.

గుంటూరు జిల్లాలో ఎవరిని అడిగినా వ్యవసాయమంత్రి మంచివారు అంటారు. ఈ ప్రభుత్వం వ్యవసాయ మంత్రి చేసే పనులు చేయనిస్తున్నారా, అని అడుగుతున్నాను. వ్యవసాయ మంత్రి వ్యవసాయ ఉత్పత్తులు పెంచడానికి, పంటల సాగుబడి పెంచడానికి కృషి చేయాలి. విజయవాడ చుట్టుప్రక్కల ఉండే ప్రాంతాలలో భూములన్నీ కమర్షియలైజ్ అయ్యి రాబోయే కాలంలో లక్ష ఎకరాలకు ఇరిగేషన్ లేకుండా పంటలు దెబ్బతినడానికి, వ్యవసాయ ఉత్పత్తులను నాశనం చేయడానికి వ్యవసాయ మంత్రిని ఉపయోగించుకోవడం దురదృష్టకరమని తెలియజేస్తూ నాకు ఈ అవకాశాన్ని ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ ముగిస్తున్నాను.

శ్రీ కాల్వ శ్రీనివాసులు(రాయదుర్గం)ః అధ్యక్షా, శ్రీ రాజశేఖర్ రెడ్డి, శ్రీ కిరణ్‌కుమార్‌రెడ్డి గారి పరిపాలన బాగుందని సభ్యులు శ్రీ విశ్వేశ్వర రెడ్డి గారు చెప్పారు. అనంతపురం జిల్లా కరువు, త్రాగునీటి సమస్య గురించి, ఈ ప్రభుత్వం చేస్తున్న సహాయక చర్యల గురించి, చేయాల్సిన పనుల గురించి చెప్పిఉంటే ఆ జిల్లావాసిగా సంతోషపడేవాడిని. అవి ఏవీ చెప్పకుండా శ్రీ రాజశేఖర్ రెడ్డి గారి భజన చేయడం సరైంది కాదు.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి అభ్యంతరాలు)

శ్రీ రాజశేఖర్‌రెడ్డి గారి గురించి ఒక చిన్న మాట మాట్లాడుతాను. 2004వ సంవత్సరంలో ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. 2003లో తీవ్రమైన కరువు వచ్చింది. అప్పుడు శ్రీ చంద్రబాబునాయుడు గారు ముఖ్యమంత్రి హోదాలో అనంతపురం జిల్లా రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని ప్రకటించారు. రూ.56,000/- కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ

అనంతపురం జిల్లాకు రావలసి ఉంది. ముఖ్యమంత్రి అయిన మొదటి సంవత్సరమే అత్యంత కరువుపీడిత అనంతపురం జిల్లాలో ఐదు లక్షల మంది రైతులకు రావలసిన రూ.56,000/- కోట్లు ఎగవేసిన మహానాయకుడు శ్రీ రాజశేఖర్ రెడ్డి గారు. ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్స్యూరెన్స్ ఎలా ఇవ్వవచ్చో మొట్టమొదటిసారిగా అనంతపురం జిల్లా రైతులకు ఇచ్చి చూపించిన నాయకుడు శ్రీ చంద్రబాబు నాయుడు గారు. వారిరువురి మధ్య ఉండే వ్యత్యాసం చెబుతున్నాను.

అనంతపురం జిల్లాకు కరువు కొత్త కాదు. గడిచిన 139 సంవత్సరాలలో 69 సంవత్సరాలు కరువు వచ్చింది. గత 17 సంవత్సరాల కాలంలో 13 సంవత్సరాలు తీవ్రమైన కరువుకాటకాలతో అనంతపురం జిల్లా విలవిలలాడిపోతుంది. ఈ సంవత్సరం కూడా తీవ్రమైన కరువు ఉంది. ప్రభుత్వం 59 మండలాలను కరువుపీడిత మండలాలుగా ప్రకటించింది. 63 మండలాలను కరువుపీడిత మండలాలుగా ప్రకటించమని ప్రభుత్వాన్ని అనంతపురం జిల్లావాసిగా నేను కోరుతున్నాను.

...

అనంతపురం జిల్లాలో వ్యవసాయం దుర్భరమైన పరిస్థితుల్లో వుంది. గడచిన పది సంవత్సరాల్లో తీవ్రమైన నిర్లక్ష్యానికి గురి కావడం వల్ల అనంతపురం జిల్లాలో వ్యవసాయాన్ని మళ్లీ లాభసాటిగా మార్చడం కోసం ప్రాథమిక రంగం అయిన వ్యవసాయరంగాన్ని అభివృద్ధి పథంలో నిలపాలన్న లక్ష్యంతో వ్యవసాయ మిషన్‌ను అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ప్రారంభించారు. ఆ విషయాన్ని మరచిపోతే ఎట్లా? అనంతపురం జిల్లాలో వున్న కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కరువు పెన్షన్ల మంజూరు నిమిత్తం ఐదు ఎకరాల నుంచి పది ఎకరాల వరకు ఈ ప్రభుత్వం మినహాయింపునిచ్చింది. డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్స్ ఇరిగేషన్ కింద ఐదు ఎకరాల నుంచి పది ఎకరాలకు వెసులుబాటు కల్పిస్తూ మొన్ననే ఆర్డర్లిచ్చింది ఈ ప్రభుత్వం. ఈ రోజు చెప్పి ఈ రోజే చేయమనడం భావ్యం కాదు. అనంతపురం జిల్లాను వంద శాతం డ్రౌట్ ప్రోన్ ప్రాంతంగా ప్రకటించడానికి ఈ ప్రభుత్వం కట్టుబడి వుంది. కచ్చితంగా అనంతపురం జిల్లాను ఆదుకోవడానికి ఈ ప్రభుత్వం సిద్ధంగా వుంది.

నిజంగా వ్యవసాయాన్ని వాళ్లు పండగ చేసివుంటే ఇంకా రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటారు? రైతుల రుణాలు మాఫీ చేయాల్సిన అవసరం మనకు ఎందుకొచ్చిందన్నది వాళ్లు తెలుసుకుంటే బాగుంటుంది. వాళ్ల మనసులో ఒకటి వుంటుంది. బయట ఇంకొకటి మాట్లాడాలని మాట్లాడితే తెలిసిన వాళ్లు అనుకుందామా, తెలిసీ తెలియని వాళ్లనుకుందామా? కావాలని ప్రభుత్వం మీద బురద చల్లే కార్యక్రమం చేసే వారనుకుందామా? వాళ్ల విజ్ఞతకే వదిలేస్తున్నాను సార్. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు అనంతపురం జిల్లా సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అనంతపురం జిల్లాను ఆదుకోవడానికి అన్నిరకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారని అనంతపురం జిల్లా వాసిగా నేను చెప్పగలుగుతున్నాను. అయితే ఆ జిల్లాలోని రాయదుర్గం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న నేను ఒకటే విజ్ఞప్తి చేస్తున్నాను.

రాయదుర్గంలో గడచిన 30/40 సంవత్సరాలుగా దాదాపు 20 వేలహెక్టార్లలో ఇసుకమేటలు వేసి, ఇసుక దిబ్బలలాగా మారిపోయి, ఎడారీకరణ ప్రారంభమై శరవేగంగా ఎడారి లాగా విస్తరించబడుతున్నది. ప్రతి సంవత్సరం 0.32 చదరపు కిలోమీటర్ల మేర ఎడారీకరణ విస్తరించబడుతున్న పరిస్థితి వుంది. ఇది చాలా అలార్మింగ్ పొజిషన్. అట్లాగే అది తీవ్రమైన నీటియెద్దడి వున్న ప్రాంతం. గడచిన 17 సంవత్సరాల్లో 13 సంవత్సరాలు కరువు పరిస్థితులొచ్చాయి కాబట్టి అనంతపురం జిల్లా కరువును జాతీయ విపత్తుగా ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులకు తోడు కేంద్ర ప్రభుత్వమే ప్రత్యేకంగా ఒక ప్యాకేజీ కింద కనీసం పది వేలకోట్లతో ప్రకటించి అనంతపురంజిల్లాను ఆదుకోవడానికి గాను గౌరవ ముఖ్యమంత్రి గారి ద్వారా మేమ ఒక ప్రతిపాదన పంపించదలచుకున్నాము సార్. దయచేసి మిగతా సభ్యులు కూడా అనంతపురం జిల్లాలో నెలకొన్న తీవ్ర దుర్భిక్ష పరిస్థితుల పట్ల, కరువు పట్ల సహకరించమని మేము విజ్ఞప్తి చేస్తున్నాము. తప్పకుండా ఈ ప్రభుత్వం అనంతపురం జిల్లాలోని కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆదుకోవడానికి ముందుకొస్తుంది. కేంద్రం వంతు కూడా మాకు అందితే రెండు ప్రభుత్వాలు కలిసి పనిచేస్తే శరవేగంగా కరువు నివారణ చర్యలు చేపట్టడానికి అవకాశముంటుంది కాబట్టి నేను అందరికీ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేసేదేమంటే అనంతపురం జిల్లాలోని కరువును ప్రత్యేకంగా గుర్తించి ఆ జిల్లాను ఆదుకోవడంలో మాకు సభ్యులందరూ సహకరించమని ఈ సభ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీమతి పి.యామినీ బాల (సింగనమల)ః నమస్కారం అధ్యక్షా. రైతుల సమస్యలను చక్కగా విశ్లేషించిన వారిలో గౌరవ సభ్యులు విశ్వేశ్వర రెడ్డి గారు కూడా వున్నారు. మా సింగనమల నియోజకవర్గంలో రెండు గ్రామాలలో త్రాగు నీరు సరఫరా ద్వారా అందజేస్తున్నాం. అక్కడి తాగునీటి పరిస్థితి గురించి గౌరవ ముఖ్యమంత్రి గారికి కూడా తెలుసు కాబట్టి మొత్తం జిల్లా అంతా కరువు పరిస్థితుల్లో వుంది కాబట్టి జిల్లాలోని కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రైతుల పరిస్థితిని, తాగు నీటి పరిస్థితులను గమనించి రైతులను ఆదుకునే విషయయంలోనైతే నేమి రుణాల మాఫీ విషయంలోనైతేనేమి, రైతుల సంక్షేమం విషయంలో నైతే నేమి మా ముఖ్యమంత్రి గారు ఏ రాష్ట్రంలోనూ ఇవ్వనంత ప్రాధాన్యత రైతులకిస్తూ రుణాల మంజూరు విషయంలో కాని వృద్ధాప్య పించన్ల మంజూరు విషయంలో కాని చాలా ఉదారంగా వ్యవహరిస్తూ ప్రతి ఒక రైతును ఆదుకుంటున్నారన్న విషయంలో ఎలాంటి సందేహం లేదు. మా సింగనమల నియోజకవర్గంలోని రైతులకు చేసిన రుణ మాఫీ విషయంలోనూ, మంజూరు చేసిన పెన్షన్ల విషయంలోనూనేను వారికి మా నియోజకవర్గం తరఫున కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

శ్రీ గడికోట శ్రీకాంత్ రెడ్డిః అధ్యక్షా, అనంతపురం జిల్లాలో కరువు వున్న మాట వాస్తవమే. అయితే అనంతపురం జిల్లాలో కరువు ఏ రకంగా వున్నదో అంతకంటే ఘోరమైన పరిస్థితులు కడప జిల్లాలో కూడా వున్నాయి. కనీసం తాగునీరు దొరకని పరిస్థితులున్నాయి. తాగునీటికి ఈ ఏడు నెలల్లో ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం

దురదృష్టకరం. మీ ద్వారా నేను ఈ ప్రభుత్వాన్ని తాగునీటి కోసం సెపరేట్ ఫండ్స్ కేటాయించాలని కోరుతున్నాను. ఎక్కడా బోర్లు పడని చోట తాగునీటిని ట్రాన్స్‌పోర్టు చేసుకోమంటున్నారు. ట్రాన్స్‌పోర్ట్ చేయడానికి ట్యాంకరుకు కేవలం రూ. 350 మాత్రమే ఇస్తామంటున్నారు. దానివల్ల నీటిని ట్రాన్స్‌పోర్టు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దానితో ప్రజలకు తాగునీరు అందే పరిస్థితి లేకుండా పోయింది. కనుక ఆ అమౌంట్‌ను పెంచాల్సిన అవసరముంది.

అదేవిధంగా అనంతపురం జిల్లాకు ఏదైతే ప్రత్యేక ప్యాకేజీ గురించి ముఖ్యమంత్రి గారు ఆలోచిస్తున్నారో అదే జిల్లాకు సరిహద్దుల్లో వున్న రాయచోటి సెగ్మెంటుకు కూడా అదే ఆలోచన చేయాల్సిన అవసరముంది. ఎందుకంటే తీవ్ర దుర్భిక్షమున్న ప్రాంతాలలో ఇది కూడా ఒకటి. అక్కడి దుర్భిక్ష పరిస్థితుల కారణంగా రైతులు పంటలు కూడా వేసుకోలేని పరిస్థితులున్నాయి. సోదరులు విశ్వేశ్వరరెడ్డి గారు చెప్పినట్లు సోదరీమణులు మన హిందూ సాంప్రదాయానికి ప్రతీకలైన తాళిబొట్టును కూడా రైతులు తాకట్టు పెట్టుకునే పరిస్థితులున్నాయి. కనీసం పంటలు కూడా వేసుకోలేని పరిస్థితులున్నాయి. క్యాపిటల్ సిటీకి భూములిచ్చిన రైతులకు రుణ మాఫీ ఏదైతే చేస్తున్నారో అలాంటి పద్ధతుల్లోనే కరువు ప్రాంతాల్లోని రైతులకు కూడా రుణ మాఫీ విధానాన్ని వర్తింప చేయాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి గారికి తెలియజేస్తున్నాను. అదేరకంగా తాగు నీటికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి మా ప్రాంతాన్ని ఆదుకోవాలి. వెయ్యి అడుగుల లోతుకు బోర్లు వేస్తేనే కాని నీరు పడని పరిస్థితులు, కనీసం పంటలు కూడా వేసుకోలేని పరిస్థితులను దృష్టిలో పెట్టుకోవాలని కోరుతున్నాను. కరువుతో అల్లాడుతున్న రైతులు ఇన్సూరెన్సు ప్రీమియం కట్టనందువల్ల ఈసారి ఇన్సూరెన్స్ కూడా వస్తుందో రాదో తెలియని అయోమయ పరిస్థితులన్నాయి. దానిపైన క్లారిటీ ఇవ్వాలని కోరుతున్నాను. ఈ కరువు పరిస్థితులపైన ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నాను. తుపాను వచ్చినప్పుడు మనమందరం ఏవిధంగానైతే స్పందించామో కరువు వల్ల అంతకన్నా ఘోరమైన పరిస్థితులన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలని కోరుతున్నాను. కరువు ప్రాంతాలలోని రైతులకు కనీసం తిండి కూడా లేని పరిస్థితులను గమనించాలి. కరువుతో అల్లాడుతున్న రైతులను కూడా ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందన్న భరోసాను మనం ఈ సభ ద్వారా రైతులకు కల్పించాలి. తాగునీటి సమస్యను తొలగించేందుకు, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని తక్షణమే అందించేందుకు కరువు ప్రాంతాల్లోని రైతులందరికీ రుణమాఫీ విధానం అమలుచేసేందుకు చర్యలు తీసుకోవాలని మీ ద్వారా ముఖ్యమంత్రి గారిని కోరుతున్నాను.

( వైఎస్సార్సీపీ సభ్యులు కొంత మంది తమకు అవకాశం కల్పించాలని కోరుతూ అంతరాయం కలిగించసాగారు)

మిస్టర్ స్పీకర్ః దయచేసి కూర్చోండి. దయచేసి సహకరించండి.

శ్రీ ఎన్.చంద్రబాబు నాయుడుః అధ్యక్షా, సభ్యులు కూడా అర్థం చేసుకోవాలి. చాలా మంది మాట్లాడారు. ఈ రోజు వ్యవసాయం మీద, రిడంప్షన్ ఆఫ్ డెట్ మీద సుదీర్ఘంగా చర్చ జరిగింది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇది ఏడవ నెల. అయితే దీనికి కారణమేమిటనేది కూడా అందరం ఆలోచించుకోవాల్సిన అవసరముంది. గత పది సంవత్సరాల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభించిన విధానాల వలన మొత్తం వ్యవసాయం సర్వనాశనమయ్యే పరిస్థితి వచ్చింది. రైతులు అప్పుల ఊబిలో చిక్కుకునే పరిస్థితి వచ్చింది. రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చింది. దీనికి పూర్తిగా బాధ్యత తీసుకోవలసింది కాంగ్రెస్ పార్టీ తప్ప ఇంకొకరు కానే కాదని మీ ద్వారా ప్రజలకు కూడా తెలియజేస్తున్నాను.

...

ఇంతకు ముందు కొంత మంది ప్రతిపక్ష సభ్యులు మాట్లాడుతూ తాము అధికారంలో ఉన్నప్పుడు చాలా బ్రహ్మాండంగా చేశామని, చాలా బాగా అభివృద్ధి జరిగిందని చెబుతున్నారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం ఒక సర్వే చేసింది. Key indicators of situation of Agriculture Households in India, Government of India, Ministry of Statistics and programme implementation, National Sample Survey. ఈ రాష్ట్రం భారతదేశంలోకెల్లా income, investment, indebtedness. Total 52% Agriculture households in the country were estimated to be indebted అంటే దేశవ్యాప్తంగా 52 శాతం రైతులు అప్పుల్లో ఉన్నారు. కానీ వీరు మాత్రం మేం అప్పుడు చాలా బ్రహ్మాండంగా చేశామని చెబుతున్నారు. In this survey, among the major states, Andhra Pradesh had the highest share of indebted agriculture households in the country. మన రాష్ట్రంలో అది 92.9శాతం ఉంది. మన తర్వాత మన రాష్ట్రం నుంచి విడిపోయిన తెలంగాణలో 89.1శాతం ఉంది. ఆ తరవాత తమిళనాడులో 82.5శాతం ఉంది భారతదేశంలో 52 శాతం ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో 92.9శాతం అంటే సుమారు 93 శాతం ఉంది. వ్యవసాయం చేస్తున్న రైతులందరికీ నష్టమే వస్తుంది. ఆ విధంగా నష్టాలు రావడం మామూలు కాదు. వ్యవసాయం చేస్తున్న వందమంది రైతులకు 93 మంది అప్పులపాలవుతున్నారు. దేశవ్యాప్తంగా రైతులలో 52 శాతం నష్టాలు వస్తుంటే, మన రాష్ట్రంలో 93 శాతం మంది రైతులు అప్పుల ఊబిలో చిక్కుకుపోయారు. నిన్న, మొన్న మిత్రులు కొంతమంది మాట్లాడుతూ ఆదర్శ రైతులు బ్రహ్మాండంగా చేశారని చెప్పారు. ఆదర్శ రైతులు, గత ప్రభుత్వాలు బాగా పనిచేసి ఉంటే ఈ రోజు రాష్ట్ర రైతాంగానికి ఈ పరిస్థితి వచ్చేది కాదు, రైతులు రుణ మాఫీ కూడా అడిగేవారు కాదని గుర్తు చేస్తున్నాను.

గత పది సంవత్సరాలుగా నేను రైతులకు మద్దతుగా ఉండేందుకు చాలా ప్రయత్నాలు చేశాను. రైతుకు అండగా ఉండడంకోసం రైతు పాదయాత్రలు 22 జిల్లాలలో నిర్వహించి, తరువాత రైతులకు ధైర్యం కల్పించడంకోసం రైతు చైతన్యయాత్రలు చేశాం. ఆ తరవాత

హైదరాబాదులో నేను నిరవధిక నిరాహార దీక్ష చేశాను. రైతులు మామూలు ఇబ్బందులు పడలేదు. కోనసీమకు గోదావరి నీరు పుష్కలంగా అందుతుంది. అటువంటి కోనసీమలో గత ప్రభుత్వ హయాంలో క్రాప్ హాలిడే ప్రకటించారు. అలాంటి దుర్దినం ఇంకొకటి ఉందా? అప్పుడు నేను జాతీయ నాయకులను తీసుకొచ్చి కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లనే ఈ విధంగా జరుగుతుందని కాబట్టి కేంద్రం తన విధానాలను మార్చుకోవాలని చెప్పాను. వ్యవసాయ ఖర్చులు పెరిగి ఆదాయం తగ్గిపోతుందని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని మేం పెద్దఎత్తున ఉద్యమించినా, ఆందోళనలు చేసినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకొన్న దాఖలాలు లేవు. గుంటూరులో రైతు మహాసభ పెట్టి జాతీయ నాయకులను పిలిచి వారి ద్వారా కూడా పోరాటం చేశాం.

ఇంకొక పక్క మహారాష్ట్ర ప్రభుత్వం గోదావరి నదిపై బాబ్లీ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా కడుతుంటే మన రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటే ఉత్తర తెలంగాణ ఎడారిగా మారిపోతుందనే ఉద్దేశంతో శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులతో అక్కడకి పరిశీలించడానికి వెళితే మమ్మల్ని బలవంతంగా జైలులో పెట్టారు. పర్వాలేదు మేం ఎన్ని రోజులైనా జైలులో ఉంటాం కానీ మాకు న్యాయం జరగాలని రైతాంగం కోసం పోరాడినది తెలుగుదేశం పార్టీ మాత్రమే. ఇన్ని ప్రయత్నాలు చేసిన తరవాత మేం పాదయాత్రలు కూడా చేశాం. అప్పుడు రాష్ట్రంలోని రైతాంగం పరిస్థితులను అధ్యయనం చేస్తూ రైతులకు న్యాయం జరగాలని, రైతుల ఆర్థికస్థితిగతుల గురించి అధ్యయనం చేస్తూ శాంపిల్ సర్వే చేయించాను. ఆ శాంపిల్ సర్వేలో వెల్లడైన వివరాలను పరిశీలించిన తరవాత అనంతపురం జిల్లా హిందూపురం నుంచి పాదయాత్ర ప్రారంభించాను. అక్కడ నుంచి పాదయాత్ర ప్రారంభించి గుత్తి, గుంతకల్లు వచ్చేసరికి రైతుల స్థితిగతులను, వారు పడుతున్న బాధలు చూసిన తరవాత నాకు చాలా ఆవేదన, బాధ కలిగింది. మరలా వ్యవసాయం లాభసాటిగా తయారయ్యేవరకు, మీ కష్టాలు తీరేవరకు మీకు అండగా ఉంటానని రైతుకు భరోసా ఇచ్చాను. అప్పుడు మొట్టమొదటగా నేను హామీ ఇచ్చినదేమంటే, రైతుల రుణాలను పూర్తిగా మాఫీ చేస్తానని, రుణ విముక్తుల్ని చేస్తానని చెప్పాను. మన రాష్ట్రంలో 92.9 మంది రైతుల రుణాలు చెల్లించలేని స్థితిలో ఉన్నారు.

మేం తీసుకొన్న నిర్ణయాల వల్ల ఈ రోజు చాలా మంది రుణ విముక్తులయ్యారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలలో రుణాలు ఏ విధంగా ఉన్నాయని సర్వే చేస్తే రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతంలో నూటికి 31 కుటుంబాలు రుణ బాధితులుంటే, పట్టణ, నగరాలలో 22 శాతం మాత్రమే రుణ బాధితులున్నారని తెలిసింది. ఇవన్నీ చూసిన తరవాత నేను రైతుల రుణ మాఫీ గురించి మేనిఫెస్టోలో పెట్టాను. ఇప్పటికే రాష్ట్రంలో 40 లక్షల మంది పేదలకు పింఛన్లు అందిస్తున్నాం. రాష్ట్రంలో పేదవారు ఎవరైనా కూడా దయనీయ పరిస్థితుల్లో ఉంటే వారికి కూడా పింఛను ఇచ్చేందుకు నేను నిర్ణయం తీసుకుంటానని చెప్పాను. నిన్న కొంతమంది

గౌరవసభ్యులు మాట్లాడినపుడు కేస్ స్టడీ గురించి చెప్పారు. ఆ వివరాలు అందించి అర్హులెవరికైనా పింఛన్లు రాలేదని తెలియజేస్తే వెంటనే ఆ డేటా ఆన్‌లైన్‌లో ఇక్కడే పెట్టి మీరు అనుమతిస్తే మొత్తం మీకు చూపిస్తానని చెప్పాను. కానీ వారెందుకు ఇవ్వలేదు? వారు చెప్పే విషయంలో వాస్తవముంటే తప్పకుండా ఆ పేర్లు ఇవ్వమనండి, వారి ఊరి వివరాలు ఇవ్వమనండి. నేను చెప్పిన పాలసీ ప్రకారం ఉంటే ఇంతకు ముందెవరినైనా విస్మరించి ఉంటే ఇబ్బందులలో ఉన్నవారికి పూర్తిగా న్యాయం చేసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది. అందులో అనుమానం లేదు.

రెండోది, కొంతమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు. వారి పేర్లు కూడా ఇవ్వమన్నాను. మేం ఇచ్చిన పాలసీలో బ్యాంకులోన్ తీసుకొని ఆత్మహత్య చేసుకున్నారా, ఎందుకు చేసుకొన్నారో పేర్లతో సహా ఇవ్వమంటే అది కూడా ఇవ్వలేదు. కాబట్టి మీరు చెబుతున్నది అసత్యమని మీరే నిరూపించుకున్నారు. నేనొక స్పష్టమైన పాలసీ ఇచ్చాను. ఆ పాలసీ ప్రకారం నేను చెప్పినట్లుగా 2007 నుంచి 2013 డిసెంబర్ వరకు రైతులు రుణాలు తీసుకున్నారో, వారందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పాం. ఎందుకంటే 50 వేల కంటె తక్కువ రుణం తీసుకొంటే వారికే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ లేకుండా వారికి వన్ టైం సెటిల్మెంట్ ప్రకారం మాఫీ చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంది. పదవ తేదీ నుంచి లేఖలు కూడా ఇచ్చాం. రెండో దశలో కూడా ఇస్తున్నాం. డాక్యుమెంటరీ సాక్ష్యం ఉంటే నూరు శాతం చేస్తాం. ఇక్కడొక విషయం గుర్తు పెట్టుకోవాలి. జవాబుదారీతనంలో మేం ఒక పద్ధతి ప్రకారం కార్యక్రమాలు చేస్తున్నాం.

నేను రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన మొదటిరోజు నుంచి ఆలోచించినదేమంటే, ఈ రాష్ట్రంలో పెద్దఎత్తున దోపిడీ జరిగింది కాబట్టి దానిని అరికట్టాల్సిన అవసరముంది. ప్రతిపక్షసభ్యులు చాలా మంది మాట్లాడుతూ చాలా విషయాలు చెప్పారు కానీ ఎర్ర చందనం గురించి, బెరైటీస్ గురించి ఎందుకు మాట్లాడలేదు? అవి మీరే చేశారని పరోక్షంగా ఒప్పుకొనే పరిస్థితికి వచ్చారు. నేను ఎవరినీ వదలిపెట్టను. రాష్ట్ర ప్రభుత్వానికి రావలసిన ప్రతి రూపాయి కూడా వసూలు చేస్తాను. ఆ డబ్బును పేదవారికి ప్రయోజనం కలిగేందుకు చర్యలు తీసుకుంటాను. ప్రస్తుతం కూడా రాష్ట్ర ప్రభుత్వం కష్టాల్లో ఉన్నా కూడా రూ.287కోట్ల రూపాయలతో సంక్రాంతి కానుకగా పేదవారికి నిత్యావసర సరకులు ఇస్తున్న ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం. మరొక విషయం కూడా చాలా స్పష్టంగా చెప్పాను. రూ.50వేలకు పైగా రుణం తీసుకొని ఉంటే అందులో వారికి కూడా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ వర్తిస్తుంది, అలా వర్తింపజేసిన తరవాత రూ.70వేల నుంచి రూ.80వేల తీసుకుంటున్నారు. వారికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ వస్తే నలభై వేలు లేదా ముప్పై వేలు మాత్రమే వస్తుంది. ఆ తర్వాత వారందరూ కూడా అయిదు వాయిదాలు చెల్లిస్తే చాలా తక్కువ డబ్బులు వచ్చే పరిస్థితి ఉంది. అది కూడా ఆలోచించిన తరవాత నిన్ననే ప్రకటించాను. అలాంటి వారందరికీ పూర్తిగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఉన్నప్పటికీ ఎంత మొత్తం ఉంటుందో చూసి రూ.50వేలు తక్కువ ఉంటే వారికి కూడా పూర్తిగా

మాఫీ చేసి ఒన్ టైం సెటిల్మెంట్ ఇస్తామని నిన్న హామీ ఇచ్చిన దానికి నేను కట్టుబడి ఉన్నాను, చేస్తాను. ఇదే కాకుండా రూ.50వేలకు పైగా రుణాలు తీసుకున్నవారికి మాత్రమే అయిదు వాయిదాలు ఇస్తామని చెప్పాను. అయిదు వాయిదాలలో వాయిదాకు 20శాతం చొప్పున కడుతున్నాం. తరవాత నాలుగు వాయిదాలలో మిగిలిన డబ్బులు చెల్లిస్తాం. మేం రుణాలు పొందినవారిని బ్యాంకులకు వెళ్లి రీషెడ్యూలు చేసుకోండని చెబుతున్నాం. రైతులు కరవు వచ్చినా, వరద వచ్చినా చాలాసార్లు రుణాల రీషెడ్యూలు చేసుకుంటారు, అదేమి కొత్త కాదు.

...

ఆ విధంగా రీషెడ్యూల్ చేసుకుంటే 4 శాతానికే మీకు రుణాలు వస్తాయి. నేను 10 శాతం ఇస్తాను. మీరు రీషెడ్యూల్ చేసుకుంటే 4 శాతానికే మీకు వస్తుంది, 6 శాతం అదనంగా ఇస్తాం. దానివలన వాళ్లకు కూడా లాభం ఉంటుంది. తద్వారా రైతులు కూడా మిగుల్చుకునే పరిస్థితి ఉంటుందని మేము చాలా స్పష్టంగా చెప్పాము. ఇన్సూరెన్సు విషయంలో ఏ విధంగా చేయాలని ఆలోచించి, పరవాలేదు రైతులకి ఇబ్బంది ఉంది కాబట్టి ముఖ్యంగా అనంతపూర్, ఈస్ట్, వెస్ట్ లాంటి జిల్లాలున్నాయని పూర్తిగా ఆ డబ్బులు వాళ్ల అకౌంట్‌లో వేయడం జరిగింది. అదే విధంగా రుణమాఫీకి, ఇన్సూరెన్సుకి సంబంధం లేకుండా రెండు ప్రయోజనాలు ఇచ్చి ఇది రైతు ప్రభుత్వమని నిరూపించుకున్న ప్రభుత్వం. అందుకే ఈరోజు కూడా రైతులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. కొంత మంది రైతులు అనేక కారణాల వలన ఎక్కువ డబ్బులు తీసుకున్నారు. ఒక రైతు రూ.50 లక్షల వరకూ రుణం తీసుకున్నాడు. ఇక్కడ కూడా రైతులు ఉన్నారు. మీరు కూడా పది బ్యాంకుల్లో అప్పు తీసుకుని ఉంటారు. అదే డాక్యుమెంటు పెట్టుకుని తీసుకున్న వాళ్లు కూడా ఉండి ఉంటారు. నేను కాదనను. మీకు కష్టాలున్నాయి. కానీ పూర్తిగా మేము మాఫీ చేయలేని పరిస్థితులున్నాయి. మాకు వెసులుబాటు ఉంటే ఏదైనా చేయవచ్చు గానీ కష్టాల్లో ఉన్నప్పుడు సన్నకారు, చిన్నకారు రైతులను పూర్తిగా ఆదుకోవాలి. గతంలో పెద్ద రైతులనే పేరు పెట్టి పెద్ద రైతులకి రుణమాఫీ ఇవ్వకుండా, ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఇవ్వకుండా చేసే పరిస్థితికి వచ్చారు. మొట్ట మొదటి సారిగా ఈ రాష్ట్రంలో ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వం నుంచే ప్రారంభమైంది.

అనంతపూర్ జిల్లా నుంచి కొంత మంది మాట్లాడారు. పెద్ద రైతులతో సహా రైతులందరికీ వేరుశెనగ పంటకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి అనంతపూర్ జిల్లాని ఆదుకున్నది తెలుగుదేశం ప్రభుత్వం. మాతోనే ప్రారంభమైంది. ఆ విషయం కూడా మీరు గుర్తు పెట్టుకోవాలి. డ్రిప్ ఇరిగేషన్ కూడా ఇచ్చాము. నిన్న మొన్న అనంతపూర్ జిల్లాలో మాకు కష్టాలున్నాయని అడిగారు. పది ఎకరాల వరకూ ఇవ్వమంటే కరెక్టే ఇస్తానని చెప్పడం జరిగింది. పది ఎకరాలకు కూడా సన్నకారు, చిన్నకారు రైతులకి 90 శాతం ఇస్తున్నాం. జిల్లా మొత్తం డ్రిప్ ఇరిగేషన్ ఇవ్వడానికి, స్ప్రింక్లర్ ఇరిగేషన్ ఇవ్వడానికి తెలుగుదేశం పార్టీ అనంతపూర్ జిల్లాలో ముందుకు వచ్చింది. తరువాత వెస్ట్ గోదావరిలోని మెట్ట ప్రాంతానికి కూడా ఇవ్వడానికి ముందుకు వచ్చాం. ఈ సంవత్సరం ఇప్పటికే 19 టిఎంసీల నీళ్లు హంద్రీనీవా ద్వారా తీసుకు వెళ్లాం. నేను 20

సంవత్సరాలుగా ఎప్పుడూ చేయలేదు. నేను కర్ణాటక ప్రభుత్వం దగ్గరకి వెళ్లి అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా అక్కడ ముఖ్యమంత్రిని కలిసి హైలెవల్ ప్యారలల్ కెనాల్ రావాలి, దీనికి ఆధునీకరణ జరగాలి, మనకు రావలసిన న్యాయసమ్మతమైన నీళ్లు రావాలి దీని వలన కర్నూలు, అనంతపూర్ జిల్లాలు బాగుపడతాయని నేను మొన్న వెళ్లి మాట్లాడటం జరిగింది. అందుకు ఆ ప్రభుత్వం ఒప్పుకున్నది. బోర్డుకి కూడా పంపిస్తామన్నారు. ఇప్పుడు బోర్డులో అది అప్రూవ్ అయితే మోడర్నైజేషన్ వస్తే అనంతపూర్ జిల్లాకు రెండు ప్రాంతాల వలన హంద్రీనీవా, హెచ్ఎల్‌సీ ఈ రెండూ వస్తే కొంత వరకు ఆ జిల్లాకు నీటి ఎద్దడి తగ్గే పరిస్థితి వస్తుంది. తుంగభద్ర వలన కర్నూలు, కడపకి కొంత వరకు నీటిఎద్దడి తగ్గుతుంది. ఇలాంటివన్నీ ఇటీవల కొన్ని నిర్ణయాలు చేశాం. ఒకప్పుడు నేను రాత్రి 2.00 గం.లకు పాదయాత్రకు వెళితే అక్కడ భోగి మంట వేసుకుని ప్రతీ ఒక్కరూ చలి మంట దగ్గర కూర్చుని ఎప్పుడు కరెంటు వస్తుందా అని బిక్కుబిక్కుమంటూ బ్రతికారు. ఒక టైము లేదు, ఒక పద్ధతి లేదు. 2004వ సంవత్సరంలో ఈ రాష్ట్రంలో సంస్కరణలు తీసుకుని వచ్చి మిగులు కరెంటు, మిగులు బడ్జెటు ప్రవేశపెడితే 2014వ సంవత్సరానికి ఎప్పుడు కరెంటు వస్తుందా అని ప్రజలు ఎదురు చూసే పరిస్థితికి వచ్చారు. రైతులకి రెండు గంటలు, మూడు గంటలు కూడా కరెంటు ఇవ్వకుండా రైతుల ఉసురు పోసుకున్నారు. ఈరోజు నాలుగు నెలల్లో మరలా మిగులు తీసుకువచ్చాం. ఎక్కడైనా సరే ఏడు గంటల కరెంటు రాకపోతే చెప్పండి, ఇప్పించే బాధ్యత, యాక్షన్ తీసుకునే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. పదివేల ఫీడర్లు ఆన్‌లైన్‌లో పెట్టాము. మీరు ఇంట్లో కూర్చుంటే మీ ఫీడర్ చూస్తే కరెంటు వచ్చిందో, లేదో మీరే చూసుకునే అవకాశం ఉంటుంది. అది తెలుగుదేశం పార్టీ యొక్క బాధ్యత, ప్రజల పట్ల ఉండే కర్తవ్యమని నేను మీకు తెలియచేస్తున్నాను. ఎక్కడైనా ఒక అర్ధగంటో, పావు గంటో కరెంటు రాకపోతే అవసరమైతే దానికి పరిహారం ఇస్తానని చెప్పాను. కరెంటు విషయంలో గత 9 సంవత్సరాల కాలంలో మీరేమి చేసారని అడుగుతున్నాను. మొన్నటి వరకూ అనేక ఇబ్బందులు ఉంటే ఆ ఇబ్బందులు తొలగించడమే కాదు, భవిష్యత్తుకి కూడా ప్రణాళిక తయారు చేశాం. దాని ప్రకారమే ముందుకు పోతాం. కొంతమంది రకరకాలుగా మాట్లాడారు. ఏదో విజన్ అని, వ్యక్తిగత విషయాలన్నీ మాట్లాడారు. నేను వాటన్నింటి జోలికి పోను. తప్పకుండా తెలుగుదేశం పార్టీకి ఒక విజన్ ఉంది. ఒక దూరదృష్టి ఉంది. సమస్యల పరిష్కారంలో చొరవ చూపిస్తాం. కొంత వరకు సమస్యలు పరిష్కారం చేయగలుగుతున్నాం. అందుకనే వ్యవసాయం మీద కూడా పద్ధతి ప్రకారం ముందుకు పోవడం కోసం ఒక కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకున్నాం. ఈ ప్రభుత్వం ఒక ప్రైమరీ మెషీన్. నేను గతంలో ఈ సభలో కూడా చెప్పాను. ఒక ఫోకస్ అప్రోచ్ తీసుకున్నాము. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీని ఉపయోగించుకుంటున్నాం. ఇంతకు ముందు ఉన్న పింఛన్లు గానీ అదే మాదిరిగా కొత్తగా ఎవరికైతే పింఛను రాలేదో వాళ్ల పేర్లన్నీ తీసుకుని ఆధార్ అకౌంట్‌కు అనుసంధానం చేశాం. భూమి వివరాలకు అనుసంధానం చేశాం. ఇవన్నీ చేసిన తరువాత ఒక పద్ధతి ప్రకారం పింఛన్లన్నీ ఫైనలైజ్ చేస్తే ఎవరూ ఫిర్యాదు చేయకుండా అర్హులందరికీ పింఛన్లు ఇచ్చే పరిస్థితి వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో మగవాళ్లకు వితంతు పింఛన్లు ఇచ్చారు. ఎక్కడ చెప్పుకోవాలో నాకైతే అర్థం

కాలేదు. 20 సంవత్సరాల వయస్సు ఉండే వాళ్లకు వృద్ధాప్య పింఛను ఇచ్చారు. ఒక భూస్వామి ఇంట్లో 5, 6 మంది పింఛన్లు తీసుకుని పేదవాళ్లకు ఇవ్వాల్సిన డబ్బులు వాళ్లు బొక్కే పరిస్థితికి వచ్చారు. అవన్నీ ప్రక్షాళన చేశాం. దాని వలన కొంత మందికి బాధ ఉండవచ్చు. దానికి నేనేమీ చేయలేను. ఈరోజు కూడా కొంత మంది కలలుగన్నారు. ఎందుకంటే మేము పది బ్యాంకుల్లో డబ్బులు తీసుకున్నాం. లక్షన్నర రూపాయల చొప్పున పది బ్యాంకులకి గాను రూ.15 లక్షలు తీసుకోవచ్చని అనుకున్నారు. మా ఐటి అడ్వయిజర్ సత్యనారాయణ గారు, మా ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ కుటుంబరావు గారు ఇద్దరూ కూడా పకడ్బందీగా మొత్తం ప్రోగ్రామ్ తయారు చేశారు. అందుకు వారిని అభినందిస్తున్నాను. 2007వ సంవత్సరం నుంచి 2013వ సంవత్సరం వరకూ ఎవరెవరు ఏయే బ్యాంకుల్లో అప్పు తీసుకున్నారో అవన్నీ కంప్యూటరైజ్ చేశారు. ఆధార్ అకౌంట్‌కి రేషన్ కార్డుని అనుసంధానం చేశాం.  ఆధార్ అకౌంట్‌కి భూములన్నీ సింక్రనైజ్ చేశాం. వీళ్లు పది బ్యాంకుల్లో తీసుకుంటే పది బ్యాంకుల్లో అకౌంట్లను పెట్టాం. వీళ్లు పది గ్రామాల్లో తీసుకుంటే పది గ్రామాలను కూడా పెట్టాం. అందువలన ఎవరైతే ఆశ పెట్టుకుని పది బ్యాంకుల్లో డబ్బులు కొట్టేయొచ్చు అనుకున్నారో వాళ్లకు మొత్తం కలిపి రూ.1,50,000 ఇచ్చాం. దానివలన ఎవరూ ఎక్కడా మోసం చేయలేకపోయారు. ఈరోజు ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందంటే ప్రభుత్వం చూపించిన చొరవ. ఒక పద్ధతి ప్రకారం చేశాం. ఎంత పెద్దవాళ్లైనా సరే రూ.1,50,000 మాత్రమే ఇచ్చాం. అదే అత్యధిక మొత్తం తప్ప మరొకటి కాదు. టెక్నాలజీని మనం ఉపయోగించుకున్న తరువాత నేను ఒకటే ఆలోచించాను. ఈరోజు వ్యవసాయం లాభసాటిగా తయారు కావాలి. అందుకే ప్రైమరీ మెషీన్‌ని తీసుకున్నాం. వ్యవసాయంలో జీఎస్‌డీపి కాంట్రిబ్యూషన్ రూ.45,132 కోట్లు కాగా హార్టికల్చర్‌లో రూ.30,088 కోట్లు. కోళ్ల పరిశ్రమ, పాడి పరిశ్రమ, గొర్రెల పెంపకం ఈ మూడు కలిపి రూ.33,600 కోట్లు. చేపల పెంపకంలో రూ.17,295 కోట్లు అంటే దీనిని బట్టి మీరు అర్థం చేసుకోవలసింది వ్యవసాయంలో ఎంత ఆదాయం వస్తుందో, వ్యవసాయంతో సమానంగా వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. అందుకనే ప్రభుత్వం చాలా స్పష్టంగా ఆలోచించింది. వ్యవసాయానికి, తోటల పెంపకానికి, లైవ్ స్టాక్‌కి, చేపల పెంపకానికి అన్నింటికీ న్యాయం చేసే విధంగా ప్రయత్నం చేస్తున్నాం. ఒక్కోసారి కోళ్ల పరిశ్రమకి గానీ, పాడి పరిశ్రమకు  గానీ, గొర్రెల పెంపకానికి గానీ తక్కువ ఖర్చు పెడితే ఎక్కువ ఆదాయం వచ్చే పరిస్థితి ఉంటుంది.

...

అదే మాదిరిగా చేపల పెంపకానికి మన రాష్ట్రంలో విపరీతంగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది.  ఇప్పటికే భారతదేశంలో మనం మొదటి స్థానంలో ఉన్నాం. ఎక్స్‌పోర్ట్స్‌లో దీనిని బాగా చేయగలిగితే దేశంలో నెంబర్ వన్ స్థానంగా దీనిని దాదాపు పది రెట్లు ఎక్కువకు తీసుకుపోయే అవకాశం ఉంది. దీని కోసమే ఒక పద్ధతి ప్రకారం ప్రణాళికలను తయారు చేసుకొని ముందుకు పోతున్నాం. నేను దీనిని రాబోయే రోజుల్లో ఏ విధంగా చేయాలో ఒక ప్రణాళికను తయారు చేసుకున్నాం. భూమి దగ్గర నుంచి, భూసార పరీక్షల దగ్గర నుంచి, వ్యవసాయ ఆధార పరిశ్రమల వరకు నిర్దిష్టమైన కార్యక్రమాలను తయారు చేస్తున్నాం. మొట్టమొదటిసారిగా

ఆదర్శరైతులను పెట్టి ఆ ఆదర్శ రైతు ఎక్కడ ఉంటాడో తెలియదు, వ్యవసాయం అంటే తెలియదు, వీళ్లు చేసిన పనుల వల్ల 93 శాతం మంది రైతులు అప్పుల ఊబిలోకి వెళ్లారు. ఈరోజు గర్వంగా చెప్పగలుగుతున్నా ఎవరైతే లక్షాయాభై వేల పైచిలుకు ఋణాలను తీసుకున్న రైతులు, ప్రైవేటు వ్యక్తుల దగ్గర అప్పులు తీసుకున్న వారు తప్ప మిగిలిన వారందరినీ రుణ విముక్తి చేసిన ఘనత ఒక్క తెలుగుదేశం పార్టీకే దక్కింది. కష్టాలు ఉన్నాయి, ఇబ్బందులు ఉన్నాయి, కానీ ఈరోజు ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ నేను ఒకే మాట చెప్పాను. రైతులు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి, రైతు ఆర్థిక ఇబ్బందుల వల్ల అప్పుల బాధలు పడలేక ప్రతి రోజు బాధపడుతున్నాడు. మీరు ఒక్కసారి ఆలోచించాలి. ఇక్కడే అనంతపురం విషయం కూడా చెప్పారు. ఆత్మహత్యలు. ఈరోజు ఆత్మహత్యలు చేసుకోవడానికి రైతులే కాదు మిగిలిన వారు కూడా కొంత మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కొన్ని కారణాలు ఉన్నాయి. రైతులు అప్పులు తీసుకురావడం పంట నష్టపోవడం, తిరిగి డబ్బులు కట్టలేకపోవడం, దీని వల్ల డీలాపడిపోయి బ్రతుకు మీద విరక్తి కలిగి, ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కొంత మంది కుటుంబంలో కలహాల వల్ల ఆత్మహాత్యలు చేసుకుంటున్నారు. కొంత మంది చిన్న పిల్లలైతే ప్రేమలో పడి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. చాలా మందిని మీరు చూస్తే చాలా బలహీనతతో మానసిక ఆందోళనతో కూడా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మేము చాలా స్పష్టంగా కోరుతున్నాం. ఎవ్వరు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన అవసరం లేదు. మీ సమస్యలను పరిష్కరించడానికి ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మీకు అండగా ఉంటాం. ఏ రైతు కూడా ఈ రాష్ట్రంలో ఆత్మహత్య చేసుకోకుండా ధైర్యంగా ఫేస్ చేయండి. మీకు అన్నివిధాలుగా అండగా ఉంటామని మరొక్కసారి రైతాంగానికి విజ్ఞప్తి చేస్తున్నాను. అనంతపురంలో ఆరు మంది చనిపోతే ప్రభుత్వం తరపున వారికి ఆర్థిక సహాయం చేశాము. ఇంకా కొంత మంది ఉన్నారు. నేను ఆ లెక్కలన్నీ చూశాను. కొంత మంది లోన్ తీసుకోలేదు కానీ, ప్రైవేటు అప్పులను తీసుకొని ఆత్మహత్యలు చేసుకున్నారు. కొంత మంది వీవర్స్ కూడా పని లేకుండా అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్నారు. అందుకనే, ఎవరైతే రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారో వారి కుటుంబాలన్నింటికీ నేను హామీనిస్తున్నాను. వాళ్లు రైతులు అయినప్పుడు, అప్పుల బాధలు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకొని ఉంటే ఒక్కొక్క కుటుంబానికి రూ.5లక్షల చొప్పున ఇవ్వడంతోబాటు ఆ కుటుంబాన్ని బాగు చేసే బాధ్యతను తీసుకుంటాం. మళ్లీ ధైర్యంగా ఆ కుటుంబాలు నిలదొక్కుకొని ముందుకు పోయే విధంగా వారిని ఆదుకుంటాం. అది పదైదు మంది కావచ్చు ఇరవై మంది కావచ్చు, పూర్తిగా వారిని ఆదుకునే బాధ్యతను తీసుకుంటామని తమరి ద్వారా ఆ రైతు కుటుంబాలకు హామీనిస్తున్నాను. వేరే జిల్లాల్లో ఎక్కువ జరగలేదు గానీ అనంతపురం జిల్లాలో అధైర్యపడిపోతున్నారు. కరువు వస్తోంది, ఆ కరువుతో చాలా ఇబ్బంది పడ్డారు. అందుకనే వాళ్లందరినీ కూడా ఏ విధంగా ఆదుకోవాలో ఆదుకోవడానికి ప్రభుత్వం ముందుకు వస్తుందని నేను మీకు తెలియజేస్తున్నాను. అందుకనే నేను మరొక మాట కూడా చెప్పాను.

ఈరోజు మనందరం చూస్తే ఒక ప్రక్క గోదావరి ఉంది ఇంకొప్రక్కన కృష్ణానది ఉంది. పెన్నా నది ఉంది, తుంగభద్ర నది ఉంది. వంశధార, నాగావళి నదులు ఉన్నాయి. ఈరోజు కృష్ణా నదిలో ఒక్కొక్కసారి నీళ్లు సరిగ్గా రాని పరిస్థితి ఉంది. నాగావళి గానీ అదే మాదిరిగా వంశధారగానీ నీళ్లు వస్తున్నాయి. మనం ప్రాజెక్టులను కట్టుకోవాల్సిన అవసరం ఉంది. తుంగభద్ర నదికి ఒక్కొక్కసారి నీళ్లు సరిగ్గా వస్తున్నాయి. ఒక్కొక్కసారి పైన వాడుకునే పరిస్థితి వస్తోంది. 20 సంవత్సరాల యావరేజ్‌ని చూస్తే ఒక్క గోదావరిలోనే 3000 టిఎంసీల నీరు సముద్రంలోకి పోతోంది. ఈరోజు కేంద్రం కూడా ముందుకొచ్చి పోలవరం ప్రాజెక్టును నేషనల్ ప్రాజెక్టుగా డిక్లెర్ చేసే పరిస్థితి వచ్చింది. ఈరోజు దానిని ఆసరాగా చేసుకొని మనం కూడా, గోదావరి నీళ్లను కృష్ణాడెల్టాకు తీసుకొచ్చి కృష్ణ పరివాహక ప్రాంతానికి తీసుకొస్తే ఆ నీళ్లు రాయలసీమ ప్రాంతానికి కొంత ఇచ్చే అవకాశం ఉంది. ఆ ప్రయత్నమే నేను చేస్తున్నాను. నేను గోదావరి విషయంలో చాలా స్పష్టంగా చెప్పాను. తెలుగుదేశం పార్టీకి కంచుకోటలాగా నూటికి నూరు శాతం ఆదరించిన జిల్లాలు గోదావరి జిల్లాలు. నేను ఆ జిల్లాల్లో చెప్పింది సముద్రంలోకి పోయే నీళ్లను కృష్ణ డెల్టాకు తీసుకొచ్చి ఇక్కడ వాడే నీళ్లు శ్రీశైలం నుంచి కొన్ని నీళ్లను రాయలసీమకు తీసుకొస్తే, విష్ణువర్ధన్ రాజుగారు మొన్న ఒక మాట చెప్పారు. మేము చిత్తూరుకు వెళ్లాం, రాయలసీమకు వెళ్లాం, అక్కడ అంతా చాలా భయంకరమైన పరిస్థితి ఉందని చెప్పారు. వారు మరియు రాజమండ్రి ఎమ్మెల్యే గారు మొన్న నాతో మాట్లాడుతూ చెప్పారు. కనీసం నీళ్లు ఇవ్వమని చెప్పే పరిస్థితికి వచ్చారు. నేను ఆలోచన చేస్తే ఈ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంత మంది తూర్పు గోదావరి జిల్లాకు వెళ్లి అక్కడ వాళ్లను రెచ్చగొట్టే పరిస్థితికి వచ్చారు. దీని వల్ల గోదావరి ఎండిపోతుంది మీకు నీళ్లు రావని వాళ్లను రెచ్చగొట్టారంటే, ఎక్కడికిపోతున్నారని మిమ్మల్ని అడుగుతున్నాను. నేను మళ్లీ మళ్లీ చెబుతున్నాను గోదావరి జిల్లాలకు అన్యాయం జరిగే పరిస్థితిని నేను ఎప్పుడూ నా జీవితంలో చేయను ఆ విషయాన్ని మీరు గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉంది. ఏ ప్రాధాన్యత వచ్చినా గోదావరి నీళ్లు గోదావరి జిల్లాలకు రావాలి, అక్కడి నుంచి సముద్రంలోకి పోయే నీళ్లను కృష్ణా డెల్టాకు తీసుకొస్తాను. అక్కడ నుంచి ఆ నీళ్లను మళ్లిస్తాం, ఆ మిగిలిన నీళ్లను రాయలసీమకు ఇస్తాం. అన్ని జిల్లాల్లో కరువును నివారించే బాధ్యతను తెలుగుదేశం పార్టీ తీసుకుంటుంది. అయిదు సంవత్సరాల్లో ఈ రాష్ట్రంలో కరువు అనేది లేకుండా చేయడానికి ఆలోచిస్తున్నాం. దీనికి గోదావరి జలాలు ఆదర్శం కావాలి.

ఈరోజు కేంద్ర ప్రభుత్వం కూడా ఆలోచిస్తుంది. వాళ్లు ఆలోచించింది ఏమంటే, ఇంటర్ రివర్ లింకేజీ పెట్టాలనుకొంటున్నారు. అంటే గంగానది నుంచి కావేరినది వరకు నీళ్లను తీసుకొచ్చి ఎక్కడికక్కడ నదులను అనుసంధానం చేయాలనుకొంటున్నారు. అందులో భాగంగా ఇటీవల నేను ఒకటి అడిగాను. ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తే ఆ సమావేశానికి వెళ్లి నేను అడిగిందేమంటే, నదుల అనుసంధానం మీరు చేయండి, మా రాష్ట్రంలో గోదావరి, కృష్ణ, పెన్న ఈ నదులన్నీ ఉన్నాయి. ముందు వీటిని అనుసంధానం చేస్తే దీని వల్ల లాభం వస్తుందని

అడగడం జరిగింది. దానికి వారు కూడా సుముఖంగా ఉన్నారు. అందుకనే మా మంత్రికి నేను ఆదేశాలిచ్చాను. వెంటనే గోదావరి నదిలో ఉన్న రైట్ బ్యాంక్ కెనాల్ పనులను పూర్తి చేయండి. ఒక లిఫ్ట్ ఇరిగేషన్ పెడదాం, వీలైనంతవరకు ఆ నీళ్లను లిఫ్ట్ చేద్దాం. పోలవరం రావడానికి మరొక నాలుగేళ్లు పడుతుంది గానీ, దానికంటే ముందు ఒక 70 టిఎంసీల నీళ్లు సముద్రంలోకి పోయే నీళ్లు, మళ్లా కొంత మంది ఇక్కడ ఉన్నారు, తెలివైన వాళ్లు, ఒక్క చుక్క నీళ్లను తీసుకున్నా సముద్రంలోకి పోయే నీళ్లను మాత్రమే తీసుకుంటాం తప్ప గోదావరికి నష్టం కలిగించే పరిస్థితి రాదు. ఆ నీళ్లను తీసుకొచ్చి కృష్ణాకు ఇస్తాం. కృష్ణలో కొంత నీళ్లు మిగిలితే ఆ నీళ్లను రాయలసీమకు ఇచ్చి కరువు ప్రాంతాన్ని పూర్తిగా ఆదుకునే బాధ్యత, కరువు నుంచి నివారించే బాధ్యతను తెలుగుదేశం ప్రభుత్వం తీసుకుంటుంది.

ఈరోజు దేశంలో కరువు వల్ల చాలా ఇబ్బందులు వస్తున్నాయి. ఈ సంవత్సరం 530 మండలాల్లో మనకు వర్షపాతం నమోదుకాలేదు. అయితే గోదావరి జిల్లాల్లో నీళ్లు ఉన్నాయి. కృష్ణాలో నీళ్లున్నాయి. అక్కడ నలభై, నలభై అయిదు, యాభై శాతం వరకు వర్షపాతం తక్కువగా ఉన్నా అక్కడ నీళ్లున్నాయి కాబట్టి, వాళ్లకు కరువు తెలియదు. అదే అక్కడగానీ నీళ్లు లేకపోతే చాలా సమస్యలు వచ్చేవి. అక్కడ మెట్ట ప్రాంతాలు కూడా ఉన్నాయి. ఆ విషయాలు కూడా నా దృష్టిలో ఉన్నాయి. దానిని ఏమి చేయాలో చేయడం కోసం ప్రభుత్వం సిద్ధంగా ఉందని నేను మీకు తెలియజేసుకుంటున్నాను. అందుకనే ఈరోజు మనం ఆలోచించాల్సింది, ఈ సంవత్సరం వాటర్ కన్జర్వేషన్ పైన ఎక్కువ శ్రద్ధ పెట్టాలనుకొంటున్నాం. ఇంకొక ప్రక్క ఎక్కడికక్కడ డ్రిప్ ఇరిగేషన్ స్ప్రింకిల్ ఇరిగేషన్ పైన ముందుకు పోవాలనుకొంటున్నాం.

శ్రీకాకుళం, విజయనగరం, తోటపల్లి. నేను ఆరోజు ఫౌండేషన్‌ని నేనే వేసి ఒకటిన్నర రెండు సంవత్సరాల్లో పూర్తి చేయాలనుకుంటే పదేళ్లు పట్టింది అయినా పూర్తి కాలేదు. ఈ సంవత్సరం దానిని ప్రాధాన్యతా క్రమంలో తీసుకున్నాం, రాబోయే ఒక్క సంవత్సరంలో ఎంత డబ్బు అవసరమైతే అంత డబ్బును ఖర్చు పెట్టి తోటపల్లిని పూర్తి చేసి, కాలువ పనులన్నీ పూర్తి చేసి వెనుకబడిన జిల్లా విజయనగరం జిల్లాను ఆదుకోవడానికి తోటపల్లి నీళ్లివ్వడానికి ఈ ప్రభుత్వం ముందుకు పోతుందని నేను మీకు తెలియజేస్తున్నాను.

తోటపల్లి రిజర్వాయర్‌ను త్వరితగతిన పూర్తిచేసి వెనుకబడిన జిల్లా అయిన విజయనగరం జిల్లాకు సాగునీరు, త్రాగునీరందించి ఆదుకునే దిశగా ఈ ప్రభుత్వం అడుగులేస్తోందనే విషయాన్ని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, శ్రీకాకుళం జిల్లాలో ఒకవైపు వంశధార మరోవైపు నాగావళి నదులున్నాయి. పుష్కలంగా నీరుంది. కానీ, ఆ జిల్లాలో సక్రమంగా గత పాలకులు నిధులను ఖర్చుచేసినట్లైతే ఇప్పటికే ఆ ప్రాంతమంతా సస్యశ్యామలం కావాల్సి ఉండేది. దేశంలో ఎక్కడకు వెళ్లినా వలస పై

వచ్చిన శ్రీకాకుళం జిల్లా ప్రజలుంటారు. హైదరాబాద్‌కు వెళ్లినా ఆ జిల్లా వాసులే, మద్రాస్ నగరంలో ఈ మధ్యే నిర్మాణంలో ఉన్న భవనం కూలిపోయిన సంఘటనలో ప్రాణాలు కోల్పోయింది కూడా శ్రీకాకుళం జిల్లా పేదలే. ఉపాధిలేక వలస వెళ్లి బతుకు బుగ్గిపాలు చేసుకునేది శ్రీకాకుళం జిల్లా ప్రజలే. విజయవాడలో పనిచేసే కూలీలు శ్రీకాకుళం జిల్లా పేదలే. జిల్లాలో సాగు నీరు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలసవెళ్లే పరిస్థితి దాపురించింది. కానీ, జిల్లా ప్రజానీకానికి తాగునీరు, సాగునీరు అందించగల్గితే, ఆ ప్రాంతన్ని అభివృద్ధి చేయగల్గితే ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితి కనుమరుగవుతుంది. ఆ దిశగా ప్రభుత్వం ముందుకు పోవాల్సిన అవసరముంది.

అధ్యక్షా, అలాగే చిత్తూరు జిల్లా. చిత్తూరు జిల్లాకు నీరు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. వెస్టన్ ఘాట్స్ దగ్గరగా అప్‌ల్యాండ్స్ ఉండడం వల్ల సుమారు 1000 నుంచి 1500 అడుగుల లోతు వరకు వెళ్లితే గానీ భూగర్భజలాలు దొరికే పరిస్థితి కనబడదు. ప్రజలు చాలా ఇబ్బందుల్లో ఉన్నారు. ఇదే హౌస్‌లో గత పాలకులు ఎన్నో హామీలిచ్చారు. ఆనాటి కాంగ్రెస్ నాయకుల దగ్గర్నుంచి రాజశేఖరరెడ్డి గారి దగ్గర వరకు సభలో అనేక హామీలిచ్చారు. మేం మదనపల్లికి, పీలేరుకు తాగునీటిని, సాగునీటిని తీసుకువస్తామని అన్ని కథలు సభలో చెప్పారు గానీ, ఎక్కడా ఏమి జరిగే పరిస్థితి లేకుండా పోయింది. అందుకే ఈ ప్రభుత్వం ఈ సంవత్సరం హంద్రీ-నివా పథకం ద్వారా కనీసం మదనపల్లి నుంచి పుంగనూరు వరకు నీటిని తీసుకుపోవడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. అదే విధంగా సోమశిల, స్వర్ణముఖి నదులున్నాయి. ఆ నదుల ద్వారా జిల్లాకు నీరందితే జిల్లాలోని కొంత భాగమైన శ్రీకాళహస్తి, నగరి ప్రాంతాలకు నీరొస్తుంది. అదే విధంగా నగరి - గాలేరు రిజర్వాయర్ ద్వారా జిల్లాకు నీరందే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

అధ్యక్షా, ఆ ప్రాజెక్టులకు మా నాయకుడి చేత ఆనాడు మేమే శంఖుస్థాపనలు చేయించాం. మళ్లీ ఆ ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తిచేసే బాధ్యతను కూడా మా తెలుగు దేశం పార్టీ ప్రభుత్వమే తీసుకుంటుందనే విషయాన్ని తెలియజేస్తున్నాను. నగరి, గాలేరు రిజర్వాయర్ పనులను త్వరితగతిన పూర్తిచేయగల్గితే నగరి పట్టణానికి నీళ్లు వచ్చే పరిస్థితి కనబడుతోంది. గండికోట రిజర్వాయర్ వరకు ఆ నీటిని తీసుకుపోవడానికి ప్రణాళికను తయారుచేయమని అధికారులను ఆదేశించాను. ఆ దిశగా త్వరితగతిన పనులు పూర్తిచేసి తిరుపతి వరకు తద్వారా నీళ్లను బాలాజీ రిజర్వాయర్ వరకు తీసుకుపోగల్గితే చాలా వరకు ప్రయోజనం చేకూరుతుంది. ఆ విషయమై కూడా ప్రభుత్వం ఆలోచన చేస్తోందనే విషయాన్ని మీకు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఇవన్ని కూడా ప్రాధాన్యతా క్రమంలో జరగాలి. అలాగే ప్రకాశం జిల్లాలో వెలిగొండ ప్రాజెక్టు ఉంది. నేనే ఆ ప్రాజెక్టుకు ఫౌండేషన్ వేశాను. కానీ, ఆ తరువాత పదేళ్లైనా ఆ ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాలేదు. ఈ సంవత్సరంలో ప్రాజెక్టుకు సంబంధించిని టన్నెల్స్ పనులను

పూర్తిచేయమని అధికారులను ఆదేశించాను. టన్నెల్స్ పనులను త్వరితగతిన పూర్తిచేయగల్గితే, 40 టి.ఎం.సి. నీటిని నిల్వచేసే సామర్థ్యం కల్గుతుంది. తద్వారా మెట్ట ప్రాంతమైన ప్రకాశం జిల్లా పూర్తిగా సస్యశ్యామలం కాగల్గుతుంది. తప్పకుండా ఆ జిల్లాకు సాగునీరు అందించే బాధ్యతను మళ్లీ నేనే తీసుకుంటున్నాను. తప్పకుండా ప్రకాశం జిల్లాకు సాగునీరు అంది జిల్లా సస్యశ్యామలమవుతుందనే నమ్మకం నాకుంది. అందుకే నేనేమి పని చేసినా ఒక పద్ధతి ప్రకారం ప్రణాళికను రూపొందించుకుని ముందుకు వెళ్లడం జరుగుతోంది.

అధ్యక్షా, నిర్మాణ దశలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేస్తామనే విషయాన్ని సభాముఖంగా తెలియజేస్తూ, ఈ సభలో ఉన్న ప్రతి ఒక్కరిని పదే, పదే ఒకటి కోరుతున్నాను. నేను చెప్పిన పాలసీ ప్రకారం ఏ ఒక రైతుకు అన్యాయం జరిగినా మీరు డీటైల్స్ ఇవ్వండి. కేవలం పేర్లిచ్చి, అడ్రస్‌లివ్వకపోతే జరిగే లాభం లేదు. మీకు రైతుల మీద ప్రేముంటే  ఫలానా రైతు ఫలానా బ్యాంకు నుంచి రుణం తీసుకున్నాడు, ఆ రైతుకు సంబంధించిన గ్రామం పేరు, రేషన్ కార్డ్ వంటివి ఏమైనా ఉంటే ఇవ్వండి. నేను వెరిఫై చేసి మీరిచ్చిన సమాచారం ప్రకారం అన్యాయం జరిగిన రైతుకు న్యాయం చేస్తాను. ఎవరైనా రైతు ఆత్మహత్య చేసుకుంటే, ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలను చేస్తుందనే విషయాన్ని తెలియజేస్తున్నాను. నేను అందరినీ  ఈ సందర్భంగా ఒకటే కోరుతున్నాను. చితికిపోయిన రైతు కుటుంబాలను మళ్లీ పూర్తిగా రివైవ్ చేసే బాధ్యత, ఆ కుటుంబాలను పూర్తిగా ఆదుకునే బాధ్యతను తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇస్తున్నాను. కానీ, స్లోగన్‌ల కోసం, ఏదో కన్‌ఫ్యూజ్ చేయడం కోసం, ఏదో జరిగిపోయిందని ప్రజలను మభ్యపెట్టడం కోసం ప్రయత్నాలు చేయొద్దని ప్రతిపక్షపార్టీని మరొకసారి సభాముఖంగా కోరుతున్నాను. ఈ ప్రభుత్వం పేదవాళ్ల ప్రభుత్వం, రైతుల ప్రభుత్వం, రైతులకు న్యాయం చేస్తాం. నేను కూడా ఒక రైతు బిడ్డగా పుట్టాను. రైతు కుటుంబంలో పుట్టాను. తప్పకుండా  రైతులకు వ్యవసాయంలో  లాభసాటి చేకూరే వరకు నా శరీరంలో చివరి రక్తపు బొట్టు ఉన్నంతవరకు  వారి కోసం పోరాడుతాను. న్యాయం చేస్తాం. చరిత్రను తిరగరాస్తాం. అలాగే పేదవారి సంక్షేమానికి ఇప్పటికే కొన్ని కార్యక్రమాలను చేశాం. వారి కోసం ఇంకా  చాలా కార్యక్రమాలను చేయాల్సిన అవసరముంది. ఎవరూ ఊహించలేదు. పేదవాళ్లకు గత ప్రభుత్వాలు అందించే పెన్షన్లను  తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం అధికారం చేపట్టాక ఐదు రెట్లు పెంచి వృద్ధాప్య, వితంతు, వికలాంగులను ఆదుకోవడం జరిగింది. పేదవాళ్లకు ఇప్పటికే తక్కువ ధరలకు నిత్యావసర వస్తువులనందించాం. అవసరమైతే ఇంకా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలుచేయడానికి ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందనే విషయాన్ని తెలియజేసుకుంటూ, మరొకసారి ఈ హౌస్‌లో ఉండే సభ్యులను కోరుతున్నాను. ఇదొక బాధ్యత కల్గిన ప్రభుత్వం. ఒక పద్ధతి ప్రకారం ప్రభుత్వం పనిచేస్తుంది. ఎవరైనా ఇష్టానుసారం అవినీతికి పాల్పడాలనో, దౌర్జన్యం చేయాలనో ప్రయత్నం చేస్తే, ఇది భయపడే ప్రభుత్వం కాదు. ప్రజలకు మంచి చేయడం కోసం సర్వశక్తులు ఒడ్డి పేదవాళ్లకు న్యాయం చేసే ప్రభుత్వం తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం.  పాలనలో

ఏమైనా తప్పులుంటే ఎప్పటికప్పుడు పూర్తిగా తప్పులను కరెక్ట్ చేసుకుని ముందుకువెళ్తాం. మాకేమాత్రం బేషజం లేదు. పూర్తిగా తప్పులను కరెక్ట్ చేసుకుని పేదవాళ్లకు, రైతులకు న్యాయం చేయడం కోసం పాలనలో ముందుకుపోతాం. అందుకు పూర్తిగా సహకరించమని మరొకసారి సభాముఖంగా ప్రతిపక్షపార్టీని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

(ప్రతిపక్షపార్టీ సభ్యులు సర్వశ్రీ జి. శ్రీకాంత్ రెడ్డి, జ్యోతుల వెంకట అప్పారావు (జ్యోతుల నెహ్రూ), శ్రీమతి ఆర్.కె.రోజా, శ్రీమతి ఉప్పులేటి కల్పన, శ్రీ కొడాలి వెంకటేశ్వరరావు (కొడాలి నాని) తదితరులు ప్రతిపక్షపార్టీ నాయకుడికి మాట్లాడే అవకాశం కల్పించాలని నినాదాలు చేసుకుంటూ పోడియం వద్దకు చేరారు)

(ప్రతిపక్షపార్టీ సభ్యుల చేత సభకు అంతరాయం)

MR.SPEAKER: I have an Announcement to make.

**ANNOUNCEMENT**

1) I am to announce to the House, that the answers pertaining to 18 Starred Questions which were not included in the business, on any day till 23.12.2014, are placed on the Table of the House. They shall form part of the proceedings of the House.

2) I am also announce to the House that the Ministers concerned are hereby directed to furnish the replies directly to the Members, as regards the remaining Starred, Un-starred, Short Notice Questions, Notices under Rule 74 and Rule 344, which were admitted and communicated to the Departments and for which answers have not been so far furnished.

**STATISTICS FOR THE THIRD SESSION**
**FROM 18.12.2014 TO 23. 23.12.2014**

| | |
|---|---|
| 1. Days for which the Assembly Sat | 5 days |
| 2. Hours for which the Assembly worked | 22 Hrs. 54 Mts. |
| 3. Starred Questions answered orally | 36 |

| | |
|---|---|
| 4. Answers to starred Questions placed On the Table of the House | 18 |
| 5. Notices under Rule 344 | 2 |
| 6. Speeches made by the Members | 17 |
| 7. Statement made by the Ministers | 05 |
| 8. Bills introduced | 05 |
| 9 Bills passed | 05 |
| 10. No. of Government Resolutions adopted | 03 |

**PARTY POSITION IN THE ASSEMBLY AS ON 23.12.2014**

| | |
|---|---|
| 1. Telugu Desam Party | 101 |
| 2. YSR Congress Party | 67 |
| 3. Bharatiya Janata Party | 4 |
| 4. Navodayam Party | 1 |
| 5. Independent | 1 |
| 6. Vacant | 1 |
| **Total** | **175** |

MR.SPEAKER: With the consent of the House, now I will adjourn the House *Sine Die.*

**(The House then adjourned *Sine Die* at 2.07 P.M.)**